www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## అందాల పోటీలతో రాష్ట్ర ఖ్యాతి విశ్వవ్యాప్తం

14
ప్రతిష్ఠాత్మకంగా మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో స్వాగతం
ప్రతి కార్యక్రమానికి ఓ నోడల్ అధికారి: రేవంత్
మిస్ వరల్డ్ పోటీలపై అధికారులతో సీఎం సమీక్ష
10న గచ్చిబౌలిలో పోటీలు షురూ.. 31న ముగింపు
ఉప్పల్‌లో ఐపీఎల్ సెమీస్ వీక్షించనున్న అందగత్తెలు



మంగళవారం | 6-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 37

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ.8.39 తదుపరి దశమి; నక్షత్రం: మఖ మ.3.52 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా.12.40-2.26; దుర్ముహూర్తం: ఉ.8.23-9.13, రా.10.14-10.58; అమృతఘడియలు: మ.1.16-3.00; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.33

వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



## ఉచితాలు తగ్గించాలి

అర్హులకే ప్రభుత్వం ఉచితాలు ఇవ్వాలి
కిలో రూ.3 ఉన్న బియ్యాన్ని రూ.2కే ఇస్తే
నాడు ఎన్టీఆర్‌ను దేవుడని అన్నారు
ఇప్పుడు కిలో బియ్యం రూ. 60 ఉండగా..
ఉచితంగా ఇవ్వడం పద్ధతి కాదు
రాష్ట్రంలో కోటి పది లక్షల కుటుంబాలుంటే
కోటి పాతిక లక్షల రేషన్ కార్డులున్నాయి
తినడానికి లేనివారికే బియ్యం ఇవ్వాలి
ప్రభుత్వంలో ఉండి ఇవన్నీ చెప్పకూడదు
మంత్రి తుమ్మల సంచలన వ్యాఖ్యలు

ధారూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): "నేను ప్రభుత్వంలో ఉండి చెప్పకూడదు కానీ.. పెద్దాయనకు కోపం రాదంటే.. ఉచితాలు తగ్గించాలి. నిరుపేదలైన అర్హులకే ఉచితాలు అందాలి. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులు అందరి దగ్గరి ఉండటం వల్ల ఉచితాలు అనర్హులకు అందుతున్నాయి. తినడానికి తిండి లేని వారికి బియ్యం ఇవ్వాలి.. అమ్ముకునే వారికి ఇవ్వొద్దు. కిలో బియ్యం రూ.3 ఉన్నప్పుడు 2 రూపాయలకే అందించిన ఎన్టీ రామారావును దేవుడన్నారు. కానీ ఇప్పుడు కిలో బియ్యం రూ.60గా ఉన్నప్పటికీ ఉచితంగా ఇస్తారా? ఇది పద్ధతి కాదు కదా.. తెలంగాణలో కుటుంబాలను మించి రేషన్ కార్డులు

మిగతా 13వ పేజీలో...

# నన్ను కోసినా..!

## ఉన్న ఆదాయానికి మించి ఉద్యోగులకు పైసా ఇవ్వలేను

### రూ. 18,500 కోట్లలోనే జీతాలూ, బాకీలు, సంక్షేమమూ!

మీ సమరం 98 శాతం ఉన్న ప్రజల మీదా?
మీ జీతాలు, పెన్షన్లు ఇచ్చే వారి పట్ల బాధ్యత లేదా?
కొత్త కోరికలతో దీక్షలకు దిగితే వ్యవస్థ కూలుతుంది
కరెంటు, పెన్షన్లు.. ఏ పథకాలు ఆపాలో చెప్పండి
పెట్రోల్, ఉప్పులు, పప్పులు ధరలు పెంచుదామా?
రాజకీయ పార్టీల చేతుల్లో పావులుగా మారొద్దు
ప్రజలపై యుద్ధం చేసి బాగుపడ్డ వారు లేరు
ఆర్థిక వ్యవస్థను నాశనం చేసినోడు ఫాంహౌస్‌లో..
నేను వచ్చాక ఎకరం భూమిని అమ్మలేదు
విమానాల్లో నలుగురితో కలిసి ప్రయాణిస్తున్నా
అప్పు కోసం వెళ్తే బ్యాంకులు దొంగల్లా చూస్తున్నాయి
ఉద్యోగులను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యలు
ఉద్యోగులను పలుచన చేసేలా మాట్లాడొద్దు!
తమకు రావాల్సిన, దాచుకున్న డబ్బే అడుగుతున్నారు
13 ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు విచారకరం
తక్షణమే ఉద్యోగుల ఐకాసతో భేటీ కావాలి: యూటీఎఫ్



ఉత్తమ పనితీరు కనబరిచిన ఓ పోలీసుకు అవార్డు ఇస్తున్న సీఎం

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాలు సమరం చేస్తామని ప్రకటించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరిపై, ఎందుకు సమరం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టే బాధ్యత ఉద్యోగులకు లేదా? అని ప్రశ్నించారు. ఆర్థిక పరిస్థితి కుదురుకుంటున్న తరుణంలో కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుందని హెచ్చరించారు. తనను నిలువునా కోసినా వస్తున్న ఆదాయానికి మించి తానేమీ చేయలేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం అంటే తాము మాత్రమే కాదని, ఉద్యోగులు కూడా అందులో భాగమేనని చెప్పారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన పోలీస్ సిబ్బందికి అవార్డులు అందించే

మిగతా 13వ పేజీలో...

## రేపటి నుంచి ఆర్టీసీ సమ్మె

మంత్రి పొన్నంతో సంఘాల నేతల భేటీ
చర్చలతోనే సమస్యల పరిష్కారం: పొన్నం
సమ్మెకు వెళితే ఎస్మా ప్రయోగిస్తాం: ఆర్టీసీ
మా సంఘం కార్మికులు విధులకు వస్తారు
టీఎంయూ నాయకుడు అశ్వత్థామరెడ్డి
సమ్మె యథాతథం: జేఏసీ
13
కళాభవన్ నుంచి బస్‌భవన్ దాకా
వందల మంది ఆర్టీసీ కార్మికుల కవాతు



## క్యాన్సర్ బాధితులకు అండగా..

- అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న మిస్ థాయ్‌లాండ్ ఓపల్ సుచాతా
- రాజధానిలో సందడి.. ముత్యాలంటే ప్రేమ

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): అందానికి ఎంతో మంది ఎన్నో రకాల నిర్వచనాలు ఇచ్చి ఉండొచ్చు. కానీ, నిజమైన అందం మనసులోనే ఉంటుందనేది కొంత మంది భావన. ఇప్పుడు 'మిస్ వరల్డ్' పోటీల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన అందగత్తెలలో మిస్ థాయ్‌లాండ్ ఓపల్ సుచాతా గురించి తెలిస్తే.. అది నిజమని అంగీకరించక తప్పదు. ఆదివారమే నగరానికి వచ్చిన ఆమె, సోమవారం బంజారాహిల్స్‌లోని సింఘానియాస్ స్టోర్‌లో సందడి చేశారు. అంతర్జాతీయంగా పేరొందిన జ్యువెలర్ కలెక్టివ్ సంస్థతో కలిసి నగరంలోని చార్మినార్ సహా

మిగతా 14వ పేజీలో...



బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న గడ్కరీ. చిత్రంలో కిషన్‌రెడ్డి, దామోదర, కోమటిరెడ్డి, సురేఖ, రఘునందన్, విశ్వేశ్వర్‌రెడ్డి

## అమృత సరోవరంగా రాష్ట్రం

తెలంగాణ సహకరిస్తే జలవనరుల అభివృద్ధి.. ఖర్చు భరించి అద్భుతంగా చేస్తాం: కేంద్ర మంత్రి గడ్కరీ
కాగజ్‌నగర్‌లో జాతీయ రహదారి-363.. బీహెచ్ఈఎల్, అంబర్‌పేట ఫ్లైఓవర్ల ప్రారంభం

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి
**ఆమోదం తెలపండి**
ప్రాజెక్టును ఒకేసారి పూర్తి చేసేందుకు సహకరించండి
కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి 12

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తే రాష్ట్రాన్ని అమృత సరోవర్‌గా తీర్చిదిద్దుతామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూపాయి ఆశించకుండా నేషనల్ హైవే అథారిటీ తరఫున మట్టి, పూడికతీత పనులను చేపడతామని స్పష్టం చేశారు. ఇందుకు సీఎంతో చర్చించేందుకు చొరవ చూపాలని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కను కోరారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నీటి నిల్వలు పెంచేందుకు

మిగతా 12వ పేజీలో...

# పారాహుషార్!

## పౌరుల భద్రత సన్నద్ధతపై రేపు మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు

వైమానిక దాడి సైరన్లు మోగగానే సేఫ్ జోన్‌కెళ్లడం
దాడి జరిగినప్పుడు స్వీయ రక్షణకు సిద్ధమవడం
మాక్ డ్రిల్‌లో అవగాహన కల్పించే అంశాలివే..
ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటాం
ప్రధాని మోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్
సాయుధ దళాల యుద్ధ సన్నద్ధతపై ప్రధానికి
వివరాలు తెలిపిన రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్
కశ్మీర్‌లోని రెండు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నీటి
నిల్వ సామర్థ్యం పెంపునకు పూడికతీత పనులు
నిలిచిపోయిన ఆరు ప్రాజెక్టుల పూర్తికి కసరత్తు
పాకిస్థాన్‌కు ఆర్థిక సాయాన్ని నిలిపివేయాలంటూ
ఆసియా అభివృద్ధి బ్యాంకుకు భారత్ విజ్ఞప్తి



ఉగ్రవాదులకు సహకరించిన వ్యక్తి
### నదిలో దూకి మృతి
పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో ఘటన
కావాలని చేసినదేనని కుటుంబ సభ్యుల ఆరోపణ
2

న్యూఢిల్లీ, మే 5: పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. పౌరుల భద్రత సన్నద్ధతపై బుధవారం మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్ర హోం శాఖ.. రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. డ్రిల్స్‌లో భాగంగా చేపట్టాల్సిన చర్యలను వివరించింది. వైమానిక దాడులు జరిగినప్పుడు అప్రమత్తం చేసే సైరన్లు మోగగానే ప్రజలు ఏం చేయాలన్నది ఈ డ్రిల్‌లో వివరిస్తారు. శత్రుదేశం దాడి చేసినపుడు తమను తాము ఎలా రక్షించుకోవాలో సామాన్య పౌరులకు, ప్రత్యేకంగా విద్యార్థులకు ఇందులో చెబుతారు. ఆకాశ మార్గాన విదేశీ నిఘాను తప్పించుకోవడానికి హఠాత్తుగా లైట్లు ఆపేసినా, తగ్గించినా.. భయపడకుండా, కంగారు పడకుండా

మిగతా 2వ పేజీలో...

**మోదీతో రాహుల్ భేటీ** సైనిక సన్నద్ధతపై ప్రస్తావన.. సీబీఐ చీఫ్ ఎంపికపై చర్చ 2

## మార్కులు తగ్గినా.. సీటు గ్యారంటీ

'నీట్'పై అనవసర ఆందోళన వద్దు: నిపుణులు
ప్రైవేటు సంస్థల కీతో కుస్తీ పడుతున్న విద్యార్థులు
తమకు తక్కువ మార్కులు వస్తాయని ఆందోళన

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): నీట్ ప్రశ్నపత్రం అత్యంత కఠినంగా రావడంతో.. పరీక్ష రాసిన విద్యార్థులంతా తమకు ఎన్ని మార్కులు వచ్చే అవకాశం ఉందో తెలుసుకునేందుకు ప్రైవేటు సంస్థల 'కీ'తో కుస్తీ పడుతున్నారు. తమకు కచ్చితంగా ఎక్కువ మార్కులు వస్తాయనే నమ్మకం ఉన్న ఉత్తమ విద్యార్థులు సైతం.. 'కీ' చూసిన తర్వాత ఢీలా పడిపోతున్నారు. పరీక్షకు ముందున్న ఆత్మవిశ్వాసం.. ఇప్పుడు చాలా మందిలో కనిపించట్లేదు. తమకు కన్వీనర్ కోటాలో సీటు వస్తుందో రాదోనన్న ఆందోళన వారిలో

మిగతా 10వ పేజీలో...

నీట్ సరిగా రాయలేదని
**ఇద్దరి ఆత్మహత్య**
జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఘటనలు
10

## సహ చట్టం ప్రధాన కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

ఖరారు చేసిన గవర్నర్.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ 10
పెండింగ్‌లో ఏడుగురు కమిషనర్ల ఫైల్



ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగిన బాధితులు

## వీడియో కాల్ ద్వారా నర్సు వైద్యం

నెలలు నిండని ఓ గర్భిణికి చికిత్స
గర్భంలోనే కవల పిల్లల మృతి, తల్లి క్షేమం
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఘటన
ఆస్పత్రిని సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారి
3

## ఉత్తర తెలంగాణలో స్వల్ప భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 3.8 తీవ్రత
భయంతో రోడ్లపైకి వచ్చిన ప్రజలు

## సాదాబైనామాపై ఏం చేద్దాం?

అధికారులు మల్లగుల్లాలు
9.26 లక్షల దరఖాస్తులు పెండింగ్
గతంలో హైకోర్టులో పిల్
కౌంటర్ దాఖలు చేయని సీసీఎల్ఏ
తుది తీర్పు వచ్చే వరకు
చట్టబద్ధత కల్పించొద్దన్న హైకోర్టు
రెండో దశ భూభారతి అమలులో
సాదాబైనామా కేటగిరీ తొలగింపు
తొలి దశ నాలుగు మండలాల్లో
ఈ కేటగిరీలోనే ఎక్కువ దరఖాస్తులు
భూభారతితోనే సాదాబైనామా
సమస్యకు పరిష్కారాలు

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామాల సమస్య పరిష్కారంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 9.26 లక్షల మేర సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. పరిష్కారం విషయంలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. దాంతో అధికారులు భూభారతి చట్టాన్ని రెండో దశలో భాగంగా అమలు చేయనున్న 28 మండలాల్లో 'సాదాబైనామా' కేటగిరీని తాత్కాలికంగా తొలగించారు. తొలి దశలో నాలుగు పైలట్ మండలాల్లో మొత్తం 11,630 దరఖాస్తులు రాగా.. వీటిల్లో సాదాబైనామాలకు సంబంధించినవే 2,796 వరకు ఉన్నాయి. రెండో దశలోనూ ఈ తరహా దరఖాస్తులు

మిగతా 12వ పేజీలో...



పిల్లలు ఆర్యన్, ఆరాధ్యతో సుభాష్ (ఫైల్)

## ఇద్దరు పిల్లల ఉసురు తీసి.. ఉరేసుకొని!

గొంతు నులిమి పిల్లల్ని చంపి, తానూ ఆత్మహత్య చేసుకున్న తండ్రి
ఇంట్లోంచి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు
భార్య గొడవపడి వెళ్లిపోవడంతో దారుణం
10 పేజీల సూసైడ్ నోట్ స్వాధీనం
సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ఘటన
3

### ఉగ్రవాదులకు సహకరించిన వ్యక్తి

# నదిలో దూకి మృతి


శ్రీనగర్, మే 5: పహల్గాంలో దారుణానికి పాల్పడ్డ ఉగ్రవాదులకు సహాయం అందించాడన్న ఆరోపణలు ఎదుర్కొన్న ఇంతియాజ్ అహ్మద్ మాగ్రే(23) ఆదివారం వెష్వ్ నదిలో దూకి ప్రాణాలు కోల్పోయాడు. విచారణ నుంచి తప్పించుకునే క్రమంలో మరణించినట్టు భద్రత బలగాలు చెబుతుండగా, పోలీసులే కావాలని ఈ పని చేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉగ్రవాదుల రహస్య స్థావరాలను చూపిస్తానంటూ తొలుత అతడు పోలీసులు, భద్రత బలగాలకు చెప్పాడు. పోలీసులు డ్రోన్ కెమేరా, ఇతర సామగ్రిని తీసుకొని అతడి వెంట వెళ్లారు. నదికి సమీపంలో ఓ స్థావరం ఉందని చెప్పి జవాన్లను అక్కడికి తీసుకెళ్లాడు. అక్కడికి చేరుకోగానే వారి నుంచి నుంచి తప్పించుకునేందుకు నదిలో దూకాడు. నదిలో ఈత కొట్టి బయటపడేందుకు ప్రయత్నించినా నీటి ప్రవాహ వేగం బలంగా ఉండడంతో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన డ్రోన్ వీడియో వైరల్‌గా మారింది. కొన్ని గంటల తరువాత అతడి శవం కుల్గాం జిల్లాలోని అహర్‌బల్ ప్రాంతంలో ఉన్న అబ్బల్ వాగులో దొరికింది. కుటుంబ సభ్యులు మాత్రం దీనితో ఏకీభవించడంలేదు. విచారణ నిమిత్తం శనివారం అతడిని పోలీసులు తీసుకెళ్లారని తెలిపారు. ఇది కస్టోడియల్ మరణమేనని, దీనిపై దర్యాప్తు చేయించాలని డిమాండు చేశారు. ఉగ్రవాదులకు సహకరించినట్టు మాగ్రే విచారణలో అంగీకరించాడని తెలిసింది. కుల్గాంలోని తంగ్‌మార్గ్ అడవిలో దాక్కొన్న ఉగ్రవాదులకు ఆహారం, ప్రయాణ సౌకర్యాలు కల్పించినట్టు చెప్పాడని సమాచారం. మాగ్రే మరణం కుట్ర అని మాజీ సీఎం ముఫ్తీ ఆరోపించారు.

### భర్తను కోల్పోయిన హిమాన్షిపై ట్రోలింగా?


హిమాన్షి నర్వాల్

న్యూఢిల్లీ, మే 5: ఇటీవల పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి నర్వాల్‌కు జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యు) మద్దతుగా నిలిచింది. ఆమెపై సోషల్‌మీడియాలో వస్తున్న ట్రోల్స్‌పై సీరియస్‌గా స్పందించింది. భర్తను కోల్పోయి దుఃఖంలో ఉన్న ఒక మహిళను లక్ష్యంగా చేసుకుని విమర్శించడం బాధాకరమని కమిషన్ వ్యాఖ్యానించింది. ఆమె వ్యక్తిగత జీవితంపై చేసిన ట్రోల్స్ ఏమాత్రం ఆమోదయోగ్యమైనవి కాదని తెలిపింది. గత నెల 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత దేశం మొత్తం ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో ముస్లింలను, కశ్మీరీలను టార్గెట్ చేయవద్దంటూ హిమాన్షి ఇటీవల విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలు కొంతమందికి నచ్చలేదు. దీంతో ఆమెపై ట్రోల్స్ మొదలుపెట్టారు.

### పాకిస్థాన్‌తో యుద్ధం జరిగితే
### కరాచీ, లాహోర్‌లో మన గురుకులాలు: రాందేవ్



హమీర్‌పూర్, మే 5: పాకిస్థాన్ అంతర్గత కలహాలతో విచ్ఛిన్నమయ్యే స్థితిలో ఉందని యోగా గురువు బాబా రాందేవ్ అన్నారు. బలూచిస్థాన్ ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారని, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆయన పేర్కొన్నారు. "యుద్ధం వస్తే భారత్‌ను వారు నాలుగు రోజులు కూడా ఎదుర్కోలేరు. కొన్ని రోజుల్లోనే మనం కరాచీలో ఒక గురుకులాన్ని, లాహోర్‌లో మరో గురుకులాన్ని ఏర్పాటు చేయాల్సి వస్తుంది" అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మరోవైపు, సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, భారత వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగిస్తే ప్రపంచపటం నుంచి పాకిస్థాన్ తుడిచిపెట్టుకు పోతుందని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ హెచ్చరించారు.

### పాక్‌లో భూకంపం..ఐదు వారాల్లో మూడోసారి

ఇస్లామాబాద్, మే 5: పాకిస్థాన్‌లో భూమి కంపించింది. రిక్టర్‌స్కేలుపై తీవ్రత 4.2గా నమోదైంది. సాయంత్రం 4 గంటల సమయంలో ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్ చిత్రాల్ జిల్లాలో భూ ప్రకంపనలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఐదువారాల్లో ఇది మూడో భూకంపం అని వెల్లడించారు.

### వక్ఫ్‌పై సుదీర్ఘ విచారణ అవసరం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 5 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుదీర్ఘంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అభిప్రాయపడ్డారు. దాఖలైన 72 పిటిషన్లపై విచారణను తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం చేపడుతుందని పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వబోమని తెలిపారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ ధర్మాసనం నిర్ణయంపై తాము ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయదలుచుకోలేదని అన్నారు. ఈ నెల 13న సీజేఐ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ చేయనున్నారు. 14న తదుపరి సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు.


### జంధ్యం తొలగింపు వివాదంలో ఇద్దరి అరెస్టు

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): కలబురగి పరీక్ష కేంద్రంలో నీట్ పరీక్షలకు హాజరైన విద్యార్థి జంధ్యం తొలగించిన వివాదంలో ఇద్దరు ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. ధార్మిక భావనలకు భంగం కలిగించేలా వ్యవహరించినందుకు పరీక్షకేంద్రం ఉద్యోగులు శరణగౌడ, గణేశ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని కలబురగి పోలీస్ కమిషనర్ ఎస్‌డీ శరణప్ప సోమవారం తెలిపారు. పరీక్ష జరిగిన తర్వాత శ్రీపాదపాటిల్ అనే విద్యార్థి స్టేషన్ బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. జంధ్యం తొలగింపు ఘటనకు నిరసనగా కలబురగిలో బ్రాహ్మణ సంఘాలు ఆదివారం సాయంత్రం ఆందోళన చేశాయి.

### ప్రజల ఖాతాల్లోకి తగ్గుతున్న ప్రత్యక్ష నగదు బదిలీ

న్యూఢిల్లీ, మే 5: వివిధ సంక్షేమ పథకాల కింద కేంద్రప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీ విధానం(డీబీటీ) ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రజల ఖాతాల్లో రూ.6.77లక్షల కోట్లు జమ చేసింది. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ఇదే అతి తక్కువ. ఆహార, ఎరువుల సబ్సిడీల్లో కోత విధించడమే డీబీటీ నిధుల్లో తగ్గుదలకు ప్రధాన కారణం కాగా, సంక్షేమ పథకాల్లో నకిలీ లబ్ధిదారులను ఏరివేయడం, పథకాల పునర్వ్యవస్థీకరణ, సబ్సిడీ నిధుల సద్వినియోగం వల్లే డీబీటీ నిధుల్లో తగ్గుదల నమోదవుతోందని ప్రభుత్వ అధికారులు తెలిపారు. కేంద్రంలోని 55మంత్రిత్వ శాఖల పరిధిలో 327పథకాలను డీబీటీ ద్వారా అమలు చేస్తున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేంద్రప్రభుత్వం డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లో రూ.7.16లక్షల కోట్లు జమ చేసింది. అది 2023-24లో రూ.6.91లక్షల కోట్లకు, 2024-25లో రూ.6.77లక్షల కోట్లకు తగ్గింది.

### నీరవ్ ఫైళ్లు ఉన్న ఈడీ ఆఫీసులో అగ్ని ప్రమాదం



ముంబై, మే 5: దక్షిణ ముంబైలోని ఈడీ జోన్-1 కార్యాలయంలో ఏప్రిల్ 28 (ఆదివారం) అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కీలక పత్రాల పరిస్థితిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు పది గంటల పాటు మంటలు వ్యాపించాయి. బల్లార్డ్ ఎస్టేట్‌లోని ప్రయివేటు భవనం కైసర్ ఎ హింద్‌లోని నాలుగో అంతస్తు, ఒకటో అంతస్తులోని కొంత భాగంలో ఈ కార్యాలయం నడుస్తోంది. నాలుగో అంతస్తులో అదనపు డైరెక్టర్ ఆఫీసు ఉంది. ఆర్థిక నేరగాళ్లు మెహుల్ చోక్సీ నీరవ్ మోదీ, రాజకీయ నాయకులు ఛగన్ భుజబల్, అనిల్ దేశ్‌ముఖ్ వంటి ప్రముఖుల కేసుల ఫైళ్లు ఇందులోనే ఉన్నాయి. వాటిలో కొన్నయినా కాలిపోయి ఉంటాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంప్యూటర్లు, ఇతర పత్రాలు దెబ్బతిన్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగా దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందా, లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

# పారాహుషార్!


సీడీఎస్ అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాల అధిపతులతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

(మొదటిపేజీ తరువాయి)

తమ పని తాము చేసుకోవడం నేర్పిస్తారు. రక్షణ పరంగా ముఖ్యమైన పరిశ్రమలను, భవనాలను శత్రు దేశాలు గుర్తుపట్టకుండా మాయోపాయాలు చేయడం ఇందులో భాగమే. దాడి జరిగినపుడు కంగారు లేకుండా జనాన్ని తప్పించడంపై రిహార్సల్స్ చేస్తారు. కాగా.. పహల్గాం ఉగ్రదాడిపై దర్యాప్తులో రష్యా, చైనా జోక్యం కోరుతున్న పాకిస్థాన్‌కు.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ షాక్ ఇచ్చారు! ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అన్నివిధాలా అండగా ఉంటామని భారత ప్రధాని మోదీకి ఆయన హామీ ఇచ్చారు. భారత విదేశాంగ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. సోమవారం మోదీకి ఫోన్ చేసి మాట్లాడిన పుతిన్.. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారని, ఈ దాడిలో అమాయకుల ప్రాణాలు పోవడం పట్ల ఆవేదన వెలిబుచ్చారని పేర్కొన్నారు. ఈ దాడుల వెనుక సూత్రధారులను ఎట్టిపరిస్థితుల్లోనూ చట్టం ముందు నిలబెట్టాలని పుతిన్ అభిప్రాయపడినట్టు ఆయన తెలిపారు. మరోవైపు.. వార్షిక ద్వైపాక్షిక భేటీ నిమిత్తం భారత్‌కు రావాలని మోదీ ఆహ్వానించగా, పుతిన్ అందుకు అంగీకరించారని క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. అయితే, చైనా మాత్రం తాను ఎప్పటిలా పాక్‌పక్షమేనని మరోసారి నిరూపించుకుంది. దక్షిణాసియాలో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు తాము ఎప్పుడూ పాక్‌కు మద్దతు ఇస్తామని ఇస్లామాబాద్‌లో చైనా రాయబారి జియాంగ్ జైడాంగ్ తెలిపారు. సోమవారం ఆయన పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీతో భేటీ అయ్యారు. మరోవైపు.. రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ ప్రధాని నరేంద్ర మోదీని సోమవారం కలిసి మాట్లాడారు. సాయుధ దళాల యుద్ధ సన్నద్ధతపై ఆయన ప్రధానికి వివరాలు వెల్లడించినట్లు సమాచారం. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని జైళ్లపై ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉందంటూ నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మరీ ముఖ్యంగా హైప్రొఫైల్ ఉగ్రవాదులు, వారికి సహకరించే స్లీపర్ సెల్ సభ్యులు ఉండే శ్రీనగర్ సెంట్రల్ జైల్, జమ్మూలోని కోట్ బల్వాల్ జైల్ వంటివాటిపై దాడులు జరిగే ప్రమాదం ఎక్కువని సమాచారం అందడంతో భద్రత కట్టుదిట్టం చేశారు. మరోవైపు.. పూంచ్‌లో భారీ దాడికి ఉగ్రవాదులు పన్నిన కుట్రను భద్రతాదళాలు భగ్నం చేశాయి. దాడి కోసం సిద్ధం చేసిన ఐదు ఐఈడీలను, వైర్‌లెస్ సెట్లను స్వాధీనం చేసుకున్నాయి.

#### రిజర్వాయర్ల పూడికతీత

పహల్గాం దాడి వెనుక పాక్ హస్తం ఉన్న నేపథ్యంలో ఆ దేశానికి బుద్ధి చెప్పడానికి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించిన భారత్.. దాయాది దేశాన్ని ఎండగట్టే చర్యలను వేగవంతం చేసింది. అందులో భాగంగా కశ్మీర్‌లోని రెండు ప్రధాన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల (సలాల్, బాగ్లిహార్) నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు రిజర్వాయర్ ఫ్లషింగ్ ప్రక్రియ చేపట్టింది. అంటే జలాశయాల అడుగున పేరుకుపోయిన పూడికను అధిక నీటి ప్రవాహంతో దిగువకు తోసివేయడం. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఈ ప్రక్రియను కిందటివారమే నిర్వహించింది. దీంతోపాటు.. నత్తనడకన సాగుతున్న/నిలిచిపోయిన ఆరు ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు సర్కారు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సహా పలు శాఖల మంత్రులు, సీనియర్ అధికారులతో ఈ వారమే కీలక భేటీ నిర్వహించనున్నట్టు తెలిసింది. ఈ ఆరు ప్రాజెక్టులూ పూర్తి అయిపోతే జమ్మూకశ్మీర్‌లో 10 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. మరింత సాగు, తాగు నీరు అందుబాటులోకి వస్తుంది. మరోవైపు.. పాకిస్థాన్‌కు ఆర్థిక సాయాన్ని నిలిపివేయాలంటూ ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌కు భారత్ విజ్ఞప్తి చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆ బ్యాంకు 58వ వార్షిక సమావేశంలో పాల్గొనేందుకు ఇటలీకి వెళ్లిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. ఈ అంశాన్ని ఏడీబీ చీఫ్ మసాటో దృష్టికి తీసుకెళ్లినట్టు ఆ వర్గాలు వెల్లడించాయి.

### మోదీతో రాహుల్ భేటీ

- సైన్యం సన్నద్ధతపై ప్రస్తావన
- సీబీఐ చీఫ్ ఎంపికపై చర్చలు

న్యూఢిల్లీ, మే 5: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. సౌత్ బ్లాక్‌లోని ప్రధాని కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. పహల్గాం దుర్ఘటన అనంతరం తలెత్తిన పరిస్థితులు, సైన్యం సన్నద్ధతపై రాహుల్‌తో అభిప్రాయాలు పంచుకున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. నిజానికి ఈ సమావేశం సీబీఐ తదుపరి చీఫ్ ఎంపిక కోసం జరిగింది. సీబీఐ చీఫ్‌ను ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ ఎంపిక చేయాల్సి ఉంది. దాంతో రాహుల్‌తో పాటు సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ప్రధాని కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుత సీబీఐ చీఫ్ ప్రవీణ్ సూద్ ఈ నెలలో పదవీ విరమణ చేయాల్సి ఉంది.

### భారత్‌కు దీటుగా బదులిస్తాం

- ఉద్రిక్తతల వేళ పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ వ్యాఖ్య

భారత్ ప్రతీకార చర్యలకు పాల్పడితే దీటుగా బదులిస్తామని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ చెప్పారు. దాడి జరిగిన వెంటనే తమ సైన్యం చురుగ్గా స్పందిస్తుందన్నారు. భారత్ ఏ క్షణంలోనైనా నియంత్రణ రేఖ వెంబడి దాడి చేసే అవకాశం ఉందని, దీనికి దీటుగా బదులిస్తామని పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్యానించారు. మరోవైపు, భారత్, పాక్ సంయమనం పాటించాలని ఐరాస సెక్రటరీ జనరల్ గుటేరస్ సూచించారు. సమస్యకు సైనిక చర్య పరిష్కారం కాదన్నారు.


భారత్-పాక్ మధ్య ఉద్రిక్తల నేపథ్యంలో జవాన్లు దేశ సరిహద్దుకు తరలివెళుతున్నారు. సోమవారం తమిళనాడు నుంచి ప్రత్యేక రైలులో బయల్దేరిన జవాన్లు నెల్లూరు రైల్వేస్టేషన్‌లో కొంతసేపు ఆగారు.

### లోకం తీరు




### దాయాది దొంగ బుద్ధి

- వేరే దేశాల మీదుగా భారత్‌కు సరుకులు

న్యూఢిల్లీ, మే 5: ఉగ్రవాదానికి ఊతమిస్తూ పెడదారి పట్టిన పాకిస్థాన్.. భారత్ తనపై విధించిన వాణిజ్య నిషేధాన్ని అధిగమించడానికి అడ్డదారిని ఎంచుకుంది. నేరుగా మనదేశానికి తన ఉత్పత్తులను పంపే అవకాశం లేకపోవడంతో.. యూఏఈ, సింగపూర్, ఇండోనేసియా, శ్రీలంక తదితర దేశాల గుండా పంపుతోందని ఒక అధికారి వెల్లడించారు. పాకిస్థాన్ నుంచి వచ్చే పండ్లు, ఎండు ఖర్జూరాలు, తోలు ఉత్పత్తులు, వస్త్రాల వంటివాటిని యూఏఈ రీప్యాక్, రీలేబుల్ చేసి భారత్‌కు పంపుతోందని ఆ అధికారి తెలిపారు. కొన్నిరకాల రసాయనాలను సింగపూర్ ద్వారా.. సిమెంట్, సోడా యాష్, వస్త్రాలకు సంబంధించిన ముడిపదార్థాలను ఇండోనేసియా ద్వారా పంపుతోందని వివరించారు. భారత్ నిషేధం విధించినప్పటి నుంచి ఇప్పటిదాకా ఇలా దాదాపుగా రూ.4,200 కోట్ల విలువైన ఉత్పత్తులను పాక్ భారత్‌కు పంపినట్టు సమాచారం.

#### పాక్ సైబర్ దాడులు!

గత కొద్దిరోజులుగా భారత రక్షణ వెబ్‌సైట్లను హ్యాక్ చేయడానికి ప్రయత్నిస్తున్న పాక్ సైబర్ గ్రూపులు.. ఇండియాకు చెందిన మిలటరీ ఇంజనీర్ సర్వీసెస్, మనోహర్ పర్రీకర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్ వెబ్‌సైట్లను హ్యాక్ చేసి సున్నితమైన సమాచారాన్ని పొందినట్టు 'ఎక్స్' వేదికగా ప్రకటించుకున్నాయి! ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్మర్డ్ వెహికల్ నిగమ్ లిమిటెడ్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి, దాంట్లో ఉన్న భారత యుద్ధ ట్యాంకు స్థానంలో పాక్ యుద్ధ ట్యాంకును పెట్టారు. కాగా.. పహల్గాం ఉగ్రదాడి వెనుక తమ హస్తం ఉందంటూ భారత్ దుష్ప్రచారం చేస్తోందని పాక్ తీవ్రంగా మండిపడింది. భారత ప్రచారాన్ని ఖండిస్తూ పాక్ పార్లమెంటు సోమవారం తీర్మానం చేసింది.



### ఓఎంసీ కేసులో..
### నేడు సీబీఐ కోర్టు తీర్పు

- నిందితుల్లో గాలి జనార్దన్‌రెడ్డి, సబితారెడ్డి

బళ్లారి, మే 5(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) ఇనుప గనుల అక్రమ తవ్వకాలకు పాల్పడిందన్న కేసులో సీబీఐ కోర్టు 14 ఏళ్ల తర్వాత మంగళవారం తుది తీర్పు వెలువరించనుంది. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో, అనంతపురం, బళ్లారి రిజర్వ్‌డ్ ఫారెస్ట్ ఏరియా, అనంతపురం జిల్లా ఓబుళాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని ఇనుప గనులను ఓఎంసీ అక్రమంగా తవ్విందని అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం రోశయ్య 2009 డిసెంబరు 7న సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఓఎంసీలో మైనింగ్ కార్యకలాపాలను నిషేధిస్తూ అప్పటి ప్రభుత్వం జీవో 71ను విడుదల చేసింది. ఓఎంసీ అక్రమాల కేసులో అప్పటి ఓఎంసీ ఎండీ బీవీ శ్రీనివాసరెడ్డిని ఏ-1గా, గాలి జనార్దన్ రెడ్డిని ఏ-2గా చేర్చారు. అప్పటి మైనింగ్ డైరెక్టర్ వాల్మీకి రాజగోపాల్, అప్పటి ఐఏఎస్ అధికారి కృపానందం, గాలి జనార్దన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ఎం.అలీఖాన్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై కూడా సీబీఐ కేసు నమోదు చేసింది. 2011లో మొదటి చార్జిషీటు దాఖలు చేసింది. రూ.884.13 కోట్ల ప్రజాధనం లూటీ చేశారని పేర్కొంది. దాదాపు 14 ఏళ్ల తర్వాత కేసు కొలిక్కి వచ్చింది. 219 మంది సాక్షులను విచారించిన సీబీఐ కోర్టు.. 3,400 డాక్యుమెంట్లను పరిశీలించింది. ఎట్టకేలకు మంగళవారం తీర్పు ఇవ్వనుంది.

### 'రాహుల్ పౌరసత్వం' పిటిషన్ రద్దు

లఖ్‌నవూ, మే 5: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పౌరసత్వాన్ని సవాల్‌చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. వేరే న్యాయ మార్గంలో కోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ పిటిషన్‌ను కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త ఎస్ విఘ్నేశ్ శిశిర్ దాఖలుచేశారు. రాహుల్ బ్రిటన్ పౌరుడు అని నిరూపించే పత్రాలు, బ్రిటిష్ ప్రభుత్వం నడిపిన కొన్ని మెయిల్ సందేశాలు తన వద్ద ఉన్నాయని పిటిషనర్ వాదించారు. రాహుల్ ద్విపౌరసత్వం కలిగి ఉన్న కారణంగా లోక్‌సభలో ప్రతిపక్షనేతగానూ, ఎన్నికల్లో అభ్యర్థిగానూ ఆయన అనర్హుడని వాదించారు. ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. పిటిషనర్ లేవనెత్తిన అంశాలను బ్రిటిష్ ప్రభుత్వం దృష్టికి కేంద్ర ప్రభుత్వం తీసుకెళ్లిందని గత నెల 21వ తేదీన జరిపిన విచారణలో పిటిషనర్‌కు కోర్టు తెలిపింది. మే 5(సోమవారం) లోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని ఇప్పటికే ఆదేశించింది. కేంద్రం తరఫున కోర్టుకు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పాండే హాజరయ్యారు. దీనిపై తుది నిర్ణయం తీసుకోవడానికి మరింత గడువు అవసరమని అభ్యర్థించారు. దీంతో కోర్టు పిటిషన్‌ను కొట్టేసింది.

# మా పరిధి చాలా పెద్దది!

### సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య.. బీజేపీ ఎంపీ దూబేపై 'ధిక్కార' విచారణకు నో

- అయితే పరిమిత ఆదేశాలిస్తామని స్పష్టం

న్యూఢిల్లీ, మే 5: సుప్రీంకోర్టుపైన, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నాపైన తీవ్ర విమర్శలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలన్న పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే తమ పరిధి చాలా విస్తృతమైనదని జస్టిస్ ఖన్నా సోమవారం స్పష్టంచేశారు. 'అయితే దీనిపై పరిమిత ఆదేశాలు జారీచేస్తాం. అందులో కారణాలను రికార్డు చేస్తాం. మా అభిప్రాయాలను వ్యక్తీకరిస్తాం. ధిక్కార పిటిషన్‌ను విచారణకు స్వీకరించడం లేదు' అని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతికి, గవర్నర్లకు సుప్రీంకోర్టు గడువు విధించడంపై దూబే తీవ్ర స్థాయిలో విమర్శించిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఖన్నాపైనా ఆరోపణలు చేశారు. ఆయన న్యాయవ్యవస్థను అవమానించేలా మాట్లాడారని.. కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేశారు. ఇది సోమవారం జస్టిస్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. తివారీ వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని 129వ అధికరణ ప్రకారం దూబేపై ధిక్కార చర్యలు ప్రారంభించాలని కోరారు. అత్యున్నత న్యాయస్థాన గౌరవాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉందని, ఇలా వదిలేయడానికి వీల్లేదని.. గతంలో (1991లో) ఢిల్లీ జ్యుడీషియల్ సర్వీసుల కేసులో ధిక్కార చర్యల వినతిని కోర్టు పరిగణనలోకి తీసుకుందని గుర్తుచేశారు (ఆ తీర్పులో.. సుప్రీంకోర్టు పరిధి, అధికారం పరిమితమైనవి కావని.. కోర్టు తన పరిధిని తాను నిర్ణయించగలదని.. అదే ఫైనల్ అని జస్టిస్ కేఎన్ సింగ్, జస్టిస్ కుల్‌దీప్‌సింగ్, జస్టిస్ ఎస్ఎం కస్లీవాల్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది). దీనిపై సీజేఐ స్పందిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. పెండింగ్ బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవలసిందేనంటూ సుప్రీంకోర్టు ఇటీవల చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని అంశాలపై జస్టిస్ ఖన్నా కీలక వ్యాఖ్యలు చేశారు. వీటిని ఝార్ఖండ్‌లోని గొడ్డా లోక్‌సభ సభ్యుడు దూబే, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తప్పుబట్టారు. 'భారత ప్రధాన న్యాయమూర్తిని రాష్ట్రపతి నియమిస్తారు. మిమ్మల్ని నియమించే అథారిటీకి మీరెలా ఆదేశాలిస్తారు? ఈ దేశంలో చట్టాలు చేసేది పార్లమెంటు. పార్లమెంటును మీరెలా శాసించగలరు? 3 నెలల్లో రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలని ఏ చట్టం చెబుతోంది. దేశాన్ని అరాచకం వైపు తీసుకెళ్లాలని మీరు (కోర్టు) భావిస్తున్నారా? దేశంలో మత యుద్ధాలకు సుప్రీంకోర్టే కారణం. తన పరిధులు దాటి వ్యవహరిస్తోంది. ప్రతిదానికీ సుప్రీంకోర్టుకే వెళ్లేటట్లయితే ఇక పార్లమెంటును, అసెంబ్లీని మూసివేయాలి' అని దూబే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు కోర్టు పరువుకు నష్టం కలిగించేవిగా.. రెచ్చగొట్టేవిగా.. విద్వేషపూరితంగా ఉన్నాయని, ఆయనపై ధిక్కార చర్యలు తీసుకోవలసిందేనని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కూడా కోరింది. ఈ దాడి ఓ సంస్థగా సుప్రీంకోర్టుపైనే గాక.. వ్యక్తిగా సీజేఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నాపై కూడా అని.. ఇది ఆమోదయోగ్యం కాదని.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తీర్మానం కూడా ఆమోదించింది. ఆయనపై ధిక్కార చర్యలకు అనుమతివ్వాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణికి సైతం ఓ లాయర్ లేఖ రాశారు. దూబే వ్యాఖ్యలు వ్యక్తిగతమని బీజేపీ కూడా పేర్కొంది. ఇదిలా ఉండగా, సుప్రీంకోర్టు నిర్ణయం తర్వాత.. పిటిషనర్ తివారీని దూబే తాజాగా టార్గెట్ చేశారు. ఆయన ఆశలన్నీ కన్నీటిలో కొట్టుకుపోయాయంటూ ఓ హిందీ గీతాన్ని 'ఎక్స్'లో ఉటంకించారు.


నిశికాంత్ దూబే



### ఎర్రకోట ఒక్కటే అడుగుతున్నారేం!

- తాజ్‌మహల్, ఫతేపూర్ సిక్రీలను ఎందుకు అడగట్లేదు?
- మొఘల్ వారసురాలిని ప్రశ్నించిన సుప్రీం.. పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, మే 5: ఎర్రకోటను తనకు అప్పగించాలని మొఘల్ చక్రవర్తుల వారసురాలు చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. చిట్టచివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 మునిమనవడు బెదర్ భక్త్ భార్య సుల్తానా బేగం దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై దిగ్భ్రాంతికి గురైన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా.. 'ఎర్రకోట మాత్రమే ఎందుకు? ఫతేపూర్ సిక్రీ, తాజ్‌మహల్‌లను ఎందుకు అడగట్లేదు?.. మీరు దీని గురించి వాదించాలనుకుంటున్నారా?' అని ప్రశ్నించారు. పిటిషన్‌ను కొట్టివేశారు. సుల్తానా బేగం ప్రస్తుతం కోల్‌కతా సమీపంలోని హౌరాలో నివసిస్తున్నారు. ఎర్రకోటకు అసలైన యజమానులైన మొఘల్ చక్రవర్తుల ప్రత్యక్ష వారసురాలు అనే కారణంతో దాన్ని తనకు అప్పగించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తనకు ఆర్థిక సాయం చేయాలని ఆమె కోరారు. కాగా, సుల్తానా బేగం ఈ అంశంపై కోర్టును ఆశ్రయించడం ఇదే తొలిసారి కాదు. 2021లో ఆమె ఇదే డిమాండ్‌తో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన భర్త మొఘల్ వారసుడని, బహదూర్ షా వారసుడిగా బెదర్‌ను 1960లో ప్రభుత్వమే గుర్తించిందని చెప్పారు. ఆమె అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది.

### గుర్తింపులేని రాజకీయ పార్టీలకు విరాళాల పేరిట పన్ను ఎగవేతలు

- దాతలపై ఐటీశాఖ కొరడా.. రూ.1,400 కోట్ల పన్ను వసూలు

న్యూఢిల్లీ, మే 5: రిజిస్టర్ అయి ఉండి గుర్తింపులేని రాజకీయ పార్టీలకు (ఆర్‌యూపీపీలు) విరాళాలు ఇస్తూ భారీగా పన్ను ఎగవేతలకు పాల్పడిన దాతలపై ఐటీ శాఖ కొరడా ఝుళిపిస్తోంది. 2022 నుంచి 2024 వరకు ఇలా విరాళాలిచ్చిన 63వేల మంది దాతల నుంచి రూ.1,400 కోట్లను రికవరీ చేసింది. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర లేదా జాతీయ పార్టీలుగా అర్హత కలిగి ఉండటానికి అవసరమైన ఓట్ల శాతాన్ని పొందలేని పార్టీలను ఆర్‌యూపీపీలుగా వ్యవహరిస్తారు. దాతల నుంచి విరాళాలు పొందే ఆర్‌యూపీపీలతోపాటు రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే దాతలకు పన్ను మినహాయింపులు కల్పిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని దాతలు పన్ను ఎగవేతలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. 2022-2023, 2023-2024లో 3,264కు పైగా ఆర్‌యూపీపీలు రూ.10వేల కోట్లకుగాపైగా ఎన్నికల విరాళాల అందుకున్నట్టు తెలుస్తోంది.

### గాజాను పూర్తిగా ఆక్రమించేద్దాం

- కొత్త ఆపరేషన్‌కు ఇజ్రాయెల్ క్యాబినెట్ ఆమోదం

టెల్‌అవీవ్, మే 5: హమాస్ ఆధీనంలో ఉన్న గాజాను పూర్తిస్థాయిలో ఆక్రమించుకోవాలని ఇజ్రాయెల్ నిర్ణయించింది. సోమవారం జరిగిన 'భద్రతపై ఇజ్రాయెల్ క్యాబినెట్ కమిటీ' భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 50శాతం గాజా ఇజ్రాయెల్ ఆధీనంలో ఉండగా.. ఉత్తరాదిని కూడా పూర్తిస్థాయిలో ఆక్రమించాలని తాజా భేటీ నిర్ణయించింది. అయితే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వచ్చే వారం పశ్చిమాసియాలో పర్యటించనున్నారు. 13, 14 తేదీల్లో సౌదీ అరేబియా, 15న ఖతార్, 16న యూఏఈలను ఆయన సందర్శిస్తారు. ఆ తర్వాతే తమ ఆపరేషన్ ప్రారంభిస్తామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ బందీలను 16వ తేదీలోగా విడుదల చేయాలని, అలాగైతేనే కాల్పుల విరమణపై చర్చిస్తామని పేర్కొన్నాయి. లేదంటే తమ ఆపరేషన్‌ను ప్రారంభిస్తామని వెల్లడించాయి.

# వీడియో కాల్ ద్వారా వైద్యం చేసిన నర్సు

- నెలలు నిండని ఓ గర్భిణికి చికిత్స
- గర్భంలోనే కవల పిల్లల మృతి, తల్లి క్షేమం
- ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన
- ఆస్పత్రిని సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారి

ఇబ్రహీంపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): పిల్లల కోసం ఆరేళ్ల నిరీక్షణ.. ఎన్నెన్నో ఆశలు.. చివరికి ఆమె గర్భవతైంది. కానీ, ఐదు మాసాలకే ఆశలు అడియాసలయ్యాయి. వాట్సాప్ వీడియో కాల్ ద్వారా నెలలు నిండని ఓ గర్భిణికి నర్సు చేసిన వైద్యం వికటించి కవల పిల్లలు మృతి చెందారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని మంచాల రోడ్డులో ఉన్న విజయలక్ష్మి ఆస్పత్రిలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన బుట్టి కీర్తి, గణేష్ దంపతులకు పెళ్లయి ఆరేళ్లయినా పిల్లలు కలుగలేదు. దీంతో వైద్యుల పర్యవేక్షణలో ఐవీఎఫ్ పద్ధతిలో కీర్తి గర్భం దాల్చింది. కాగా, ఐదు నెలల గర్భంతో ఉన్న ఆమెకు ఒక్కసారిగా నొప్పులు రావడంతో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు విజయలక్ష్మి ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యురాలు డా.అనూషా రెడ్డి అందుబాటులో లేకపోవడంతో విషయాన్ని నర్సు ఆమెకు తెలియజేసింది. దీంతో వీడియో కాల్ ద్వారా డా.అనూషారెడ్డి సూచనలతో నర్సు చికిత్స చేయడం ప్రారంభించింది. ఈ క్రమంలో కీర్తికి తీవ్ర రక్తస్రావం కావడంతో పాటు వైద్యం వికటించి గర్భంలో కవలలు మృతి చెందారు. వెంటనే వైద్యురాలు డా.అనూషారెడ్డి ఆస్పత్రికి చేరుకుని కీర్తికి అత్యవసర చికిత్స చేసి పర్యవేక్షణలో ఉంచారు. కాగా, ఆస్పత్రి బిల్లు రూ.30 వేలు అయ్యిందని, దానిని కట్టాల్సిందిగా కీర్తి కుటుంబ సభ్యులకు ఆస్పత్రి యాజమాన్యం సూచించింది. అయితే, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే కీర్తి గర్భంలో కవల పిల్లలు మృతి చెందారని ఆరోపిస్తూ సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు, జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డా. వెంకటేశ్వరరావు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వైద్యురాలు లేకుండా నెలలు నిండని గర్భిణికి నర్సు వైద్యం చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన వైద్యాధికారి వెంటనే ఇన్ పేషెంట్లను పంపించి వేసి ఆస్పత్రికి సీజ్ చేశారు. తదుపరి విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఆస్పత్రిలో విచారణ చేస్తున్న వైద్యాధికారి డా.వెంకటేశ్వరరావు


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంఘాల నేతలు

## బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించేలా
# కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడండి

- గవర్నర్‌కు బీసీ సంఘాల నేతల విజ్ఞప్తి

హైదరాబాద్, పంజాగుట్ట, మే 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపేలా గవర్నర్ విశిష్ట అధికారాలను ఉపయోగించాలని బీసీ సంఘాల నేతలు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. బీసీ సంఘాల ప్రతినిధుల బృందం సోమవారం గవర్నర్‌తో భేటీ అయ్యారు. దేశంలో సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసి, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా సహకరించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బీసీ బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు గవర్నర్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేస్తామని వెల్లడించడం బీసీల పోరాట విజయంగా భావిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పంపిన 42 శాతం బీసీ బిల్లును కేంద్రం ఆమోదించి తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్లో చేర్చి చట్ట రూపంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పెంచేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. బీసీ సంఘాల నాయకులు కుందారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కురుమ, మని మంజరి సాగర్, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు గవర్నర్‌ను కలిశారు.

# సరస్వతి పుష్కరాల్లో 'జాయ్ రైడ్'

- హెలికాప్టర్ నుంచి పుష్కరాలను వీక్షించేలా ఏర్పాటు
- ఒక్కొక్కరికి రూ.4500 టికెట్.. 6-7 నిమిషాల ప్రయాణం

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మే 15 నుంచి 26 వరకు జరగబోయే సరస్వతి పుష్కరాల్లో హెలికాప్టర్ ప్రయాణం అందుబాటులోకి రానుంది. పుష్కరాలకు వచ్చిన భక్తులు కాళేశ్వరం ఆలయం, పుష్కర ఘాట్‌లు, చుట్టూ ఉన్న పచ్చటి అందాలను గగనతలం నుంచి వీక్షించేలా రాష్ట్రప్రభుత్వం 'జాయ్‌రైడ్'ను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఒకేసారి 6 గురు ప్రయాణించేందుకు వీలుగా ఎయిర్‌బస్ హెచ్-125 మోడల్ హెలికాప్టర్‌ను వినియోగించనుంది. టికెట్ ధరను ఒక్కొక్కరికీ రూ.4,500 చొప్పున ఖరారు చేయగా.. ప్రయాణ సమయాన్ని 6-7 నిమిషాలుగా నిర్ణయించారు. హెలికాప్టర్ ప్రయాణాలకు అవసరమైన సాంకేతిక అనుమతులు, ఇతరత్రా వ్యవహారాలు మొత్తం ఇప్పటికే పూర్తయ్యాయి. ఉదయం నుంచి సూర్యాస్తమయం వరకే జాయ్‌రైడ్‌లను నిర్వహించనున్నారు. కాగా, ఈ హెలికాప్టర్ ప్రయాణాల బాధ్యతలను బెంగళూరుకు చెందిన ఓ సంస్థకు అప్పగించారు. జాయ్‌రైడ్‌లకు అవసరమైన సాంకేతిక అనుమతులను సదరు సంస్థే ఏర్పాటు చేసుకుంటుంది. పుష్కర ఘాట్‌లకు దగ్గర్లోనే హెలికాప్టర్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ, పర్యాటకశాఖలతో పాటు సివిల్ ఏవియేషన్ విభాగం సంయుక్తంగా హెలికాప్టర్ ప్రయాణాలను పర్యవేక్షించనున్నాయి. గతంలో మేడారం జాతరలోనూ దేవాదాయశాఖ హెలికాప్టర్ ప్రయాణాలను ఏర్పాటు చేసింది. అప్పుడు భక్తుల నుంచి మంచి ఆదరణ రావడంతో సరస్వతి పుష్కరాల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. కాగా, బెంగళూరు నుంచి కాళేశ్వరానికి మళ్లీ ఇక్కడి నుంచి అక్కడకు హెలికాప్టర్ ఖాళీగా వచ్చి, వెళ్లాల్సిన నేపథ్యంలో రూ.20లక్షలను ప్రభుత్వం చెల్లించనుంది. అదే విధంగా హెలిప్యాడ్‌కు దగ్గర్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక బృందాలను అందుబాటులో ఉంచనుంది. హెలికాప్టర్ ప్రయాణ బాధ్యతలను తీసుకున్న సంస్థ గతంలో 15 వేల మంది భక్తులకు జాయ్ రైడ్‌లను అందించిందని వెల్లడించింది. టికెట్ల బుకింగ్ కోసం టోల్ ఫ్రీ నంబరును త్వరలో ప్రకటించనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

# రాష్ట్రంలో భిన్న వాతావరణం

**ఎండకు అల్లాడుతున్న జనం.. వడదెబ్బకు ముగ్గురి మృతి.. పలు జిల్లాల్లో గాలి వాన బీభత్సం**

(ఆంధ్రజ్యోతి నెట్ వర్క్)

రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు మండుతున్న ఎండలతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతుండగా, మరోవైపు ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టిస్తోంది. సోమవారం వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అత్యధికంగా 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవగా, జోగుళాంబ గద్వాల జిల్లాలో 42 డిగ్రీలు, హైదరాబాద్‌లో 41 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. పగటిపూట ఎండకు బయటకు రావాలంటేనే జనం భయపడుతున్నారు. అయితే ఓ వైపు ఎండ మండుతుండగా మరోవైపు గాలి వాన బీభత్సం సృష్టిస్తోంది. పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. హైదరాబాద్ నగరంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. ఉప్పల్, షేక్‌పేట, శేరిలింగంపల్లి, బండ్లగూడ ప్రాంతాల్లో భారీ ఈదురుగాలులతో వర్షం కురిసింది. లంగర్‌హౌజ్‌లో అత్యధికంగా 2.8, ఆసిఫ్‌నగర్‌లో 2.7 సెం.మీల వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏకధాటిగా గంటన్నర పాటు వర్షం కురిసింది. అకాల వర్షంతో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తడిసి ముద్దయ్యింది. సంచులలో నింపిన ధాన్యంతో పాటు ఆరబెట్టిన ధాన్యం వర్షానికి పూర్తిగా నీటిపాలైంది. దీంతో సంచులలో ఉన్న ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. జగిత్యాల జిల్లాలోని వెల్గటూర్ మండలంలో వడగళ్ల వాన కురిసింది. ఈదురు గాలులకు మామిడి నేల రాలింది. నువ్వు పంట నేలవాలింది. పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాగా, ఎండలతో వడదెబ్బకు గురై ఇద్దరు మహిళా కూలీలు, ఓ రైతు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో అక్కి పార్వతి (51) అనే మహిళా కూలీ నాలుగు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు, వడగాలులకు వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురైంది. సోమవారం పరిస్థితి విషమించి మరణించింది. నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండల ఆదిరాల గ్రామానికి చెందిన మొల్కలపల్లి నర్సమ్మ (50) శనివారం ఉపాధి హామీ పని చేయడానికి వెళ్లింది. ఎండలో పనిచేయడం వల్ల వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన అత్తిని గంగరాజం (45) అనే రైతు రెండు రోజుల నుంచి వరి కోత పనులు చేయిస్తున్నాడు. దీంతో ఎండ దెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం పరిస్థితి విషమించి మృతిచెందాడు.


నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం

### నేడు రేపు వర్షసూచన

రాష్ట్రంలో మంగళ, బుధ వారాల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, నిర్మల్, కామారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, పెద్దపల్లి, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జనగాం, యాదాద్రి, నల్గొండ, గద్వాల, వనపర్తి, నారాయణపేట, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రానున్న మూడు రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదరు గాలులతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఈ మూడు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీచేసింది.

# ఆర్టీసీ బస్సులో కల్లు తీసుకెళ్లకూడదా ?

- ఎవరా రూల్ పెట్టారు ?.. కండక్టర్, డ్రైవర్‌తో మహిళ వాగ్వాదం
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో

నల్లగొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో కల్లు తీసుకెళ్లకూడదని ఎవ రు రూల్ పెట్టారంటూ ఓ మహిళ ఏకంగా బస్సు ఎదుట నిరసన వ్యక్తం చేసింది. ఆదివారం సాయం త్రం నల్లగొండ జిల్లా నకిరేకల్ శివారులో జరిగిన ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సూర్యాపేట నుంచి నల్లగొండ వెళ్తుండగా నకిరేకల్ వద్ద ఓ మహిళ రెండు సంచులతో బస్సు ఎక్కింది. ఆమె తీసుకువచ్చిన సంచుల్లో కల్లు బాటిల్ ఉండటంతో మహిళా కండక్టర్ అభ్యంతరం చెప్పింది. ఇదే సమయంలో డ్రైవర్ కూడా జోక్యం చేసుకుని కల్లు బాటిళ్లతో బస్సు ఎక్కవద్దని అడ్డు చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన మహిళ తనను ఎందుకు కల్లు తీసుకెళ్లనివ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేసింది. బస్సుకు అడ్డంగా నిలబడి ముందుకు కదలనివ్వకుండా కొద్దిసేపు ఆందోళన చేసింది. అనంతరం ఆ మహిళ ఆటోలో గమ్యస్థానాన్ని బయలుదేరింది. ఈ విషయమై ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో కల్లును తీసుకెళ్లడానికి అనుమతి లేదని తెలిపారు.

# కర్రెగుట్టల్లో పేలిన ప్రెజర్ బాంబ్

- ముగ్గురు జవాన్లకు స్వల్ప గాయాలు

చర్ల, వెంకటాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ములుగు జిల్లా వెంకటాపురం సమీపంలో గల కర్రెగుట్టల్లో సోమవారం ప్రెజర్ బాంబ్ పేలడంతో ముగ్గురు జవాన్లు స్వల్పంగా గాయపడ్డారు. గత నెల 21 నుంచి మావోయిస్టుల కోసం కర్రెగుట్టల్లో కూంబింగ్ ఆపరేషన్ జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం కేంద్ర బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబ్ పేలడంతో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. వెంటనే వారిని హెలీకాప్టర్ ద్వారా బీజాపూర్ తరలించారు.

# సబ్ రిజిస్ట్రార్‌పై యువకుడి దాడి

- రిజిస్ట్రేషన్ విషయంలో వాగ్వాదం.. చెంపపై దెబ్బ
- పెద్దఅంబర్‌పేట్‌లో ఘటన.. యువకుడిపై కేసు నమోదు


హైదరాబాద్/ హయత్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్‌పై ఓ యువకుడు దాడి చేశాడు. ఓ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సబ్‌రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగి ఆయన విచారణ జరిపిస్తానని చెబుతుండగానే ఆయన చెంపపై కొట్టాడు. పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన పి. శ్రీనివాస్ సోమవారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. సబ్‌రిజిస్ట్రార్ రవీంద్రనాయక్ వద్దకు వెళ్లి డాక్యుమెంట్ డబుల్ రిజిస్ట్రేషన్‌లపై మాట్లాడాడు. సర్వే నం.154లో తాను 2012లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాటు డాక్యుమెంటును మళ్లీ 2025 జనవరిలో ఎందుకు రెలింక్విష్‌మెంట్ చేశారంటూ శ్రీనివాస్ సబ్‌రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగాడు. లీగల్‌గా పరిశీలించే రెలింక్విష్‌మెంట్ డీడ్ చేశానని సబ్ రిజిస్ట్రార్ చెబుతుండగానే కోపంతో శ్రీనివాస్ ఆయన చెంపపై కొట్టాడు. వెంటనే అక్కడున్న వారు వారిద్దరినీ సముదాయించారు. డాక్యుమెంట్‌పై విచారణ జరుపుతానని చెబుతుండగానే తనపై శ్రీనివాస్ దాడి చేశాడని సబ్‌రిజిస్ట్రార్ రవీంద్రనాయక్ తెలిపారు. ఏదైనా తప్పు జరిగితే జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయాలే తప్ప దాడి చేస్తారా అని ప్రశ్నించారు. సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు.

### సబ్‌రిజిస్ట్రార్‌పై దాడి హేయం: టీజీవో

విధి నిర్వహణలో ఉన్న సబ్ రిజిస్ట్రార్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) పేర్కొంది. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి సత్యానారాయణ, సహాధ్యక్షుడు బ్యాగరి శ్యామ్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ విధివిధానాల ప్రకారం పనిచేస్తారని, ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి కాని భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని అన్నారు. దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ఆడపిల్ల పుట్టిందని అదనపు కట్నం అడిగారు

- అత్తింటి వేధింపులు తాళలేక బాలింత ఆత్మహత్య
- భూపాలపల్లి జిల్లా ముచినిపర్తి గ్రామంలో ఘటన


నిరూష (ఫైల్)

చిట్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లకు జన్మనిచ్చినందుకు తమకు అదనంగా రూ. లక్ష కట్నం ఇవ్వాలని భర్త, అతని కుటుంబసభ్యులు వేధిస్తుండడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ బాలింత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ హృదయ విదారక ఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని ముచినిపర్తి గ్రామంలో జరిగింది. ముచినిపర్తి గ్రామానికి చెందిన కత్తికొండ శంకర్, లక్ష్మి దంపతుల రెండో కుమార్తె నిరూష (26)ను వరంగల్ దేశాయిపేటకు చెందిన మునుగొండ సాంబయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు ప్రశాంత్‌కు ఇచ్చి గత ఏడాది వివాహం జరిపించారు. కాగా, ఇరవై రోజుల క్రితం నిరూషకు ఆడపిల్ల పుట్టింది. ఈ క్రమంలో నిరూష ఆడపిల్లకు జన్మనిచ్చినందుకు తమకు అదనంగా రూ.లక్ష కట్నం ఇవ్వాలని ఆమె తల్లిదండ్రులపై ప్రశాంత్ కుటుంబసభ్యులు ఒత్తిడి చేశారు. ఆదివారం భర్తతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి నిరూష ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చిట్యాల ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ నిరూష సోమవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌తో పాటు అతని కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఉత్తర తెలంగాణలో స్వల్ప భూకంపం

**రిక్టర్ స్కేల్‌పై 3.8 తీవ్రత.. భయంతో రోడ్లపైకి వచ్చిన ప్రజలు**

- ఆ వెంటనే ఈదురుగాలులు
- విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కరీంనగర్, నిర్మల్, దుబ్బాక, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో సోమవారం సాయంత్రం స్వల్పంగా భూమి కంపించింది. నిర్మల్, నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాలపై ఈ ప్రభావం కనిపించింది. సోమవారం సాయంత్రం 6.50 గంటల సమయంలో వచ్చిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.8గా నమోదైంది. భూకంప కేంద్రం ఆసిఫాబాద్ వద్ద ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో భూకంపం వచ్చిన కాసేపటికే ఈదురు గాలులు వీయడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయమేర్పడింది. భయంతో ప్రజలు వీధుల్లోకి పరుగులు తీశారు. గత నెలలోనే 10-17 తేదీల మధ్య ఈ ప్రాంతాల్లో భూకంపం రానున్నట్లు శాస్త్రవేత్తలు ముం దుగానే హెచ్చరించారు. అప్పట్లో భూకంపం రాకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అనూహ్యంగా సోమవారం స్వల్ప భూప్రకంపనలు, ఈదురు గాలులతో ప్రజలు ఆందోళన చెందారు. కరీంనగర్‌లోని కొత్తపల్లి, చొప్పదండి, తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం, గంగాధర, రామడుగు మండలాల్లో.. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి, మల్లాపూర్, ఎండపల్లి, వెల్గటూర్ మండలాల్లో.. రాజన్న-సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని, సుల్తానాబాద్, ధర్మారం, పాలకుర్తి, కమాన్‌పూర్ మండలాలు, ఆసిఫాబాద్‌లోని రెబ్బెన మండలం, మంచిర్యాల జిల్లా జన్నారం మండలాల్లో భూప్రకంపనలు వచ్చాయి. జగిత్యాలలోని మునిసిపల్ కార్యాలయంలో భూకంపంతో ఫైళ్లు, టేబుళ్లు కదలగా.. మునిసిపల్ కమిషనర్ స్పందన, ఉద్యోగులు బయటకు వచ్చారు. జగిత్యాల మండలం తిప్పన్నపేటలో ఓ ఇంటి గోడలకు పగుళ్లు రాగా.. భీమారంలోని హనుమాన్‌వాడలో ఓ ఇంటి పైకప్పులు స్వల్పంగా కూలిపోయాయి. అటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోని ఖానాపూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, సిరికొండ ప్రాంతాల్లో 2 సెకన్లపాటు భూమి కంపించినట్లు సీసీకెమెరాల్లో రికార్డయింది. ఈ ప్రాంతాల్లో రాత్రిళ్లు కూడా భయంతో ప్రజలు బయటే పడిగాపులు కాస్తున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటలో సాయంత్రం 6.59-7.01 గంటల మధ్య రెండు సెకన్లపాటు భూమి కంపించింది. ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా భూకంపం ప్రభావం కనిపించింది.


నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో భూకంపం భయంతో రోడ్ల పైకి వచ్చిన జనం

# మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రజాస్వామిక హక్కు

- కేంద్రం శాంతియుత వాతావరణం ఏర్పాటు చేయాలి
- పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం

నల్లకుంట, మే 5(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రజల ప్రజాస్వామిక హక్కు అని పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం చెప్పారు. చర్చలు ఉండవని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పడం సరికాదన్నారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, కార్యవర్గ సభ్యులు డి.సురేష్ కుమార్, జక్క బాలయ్యలతో కలిసి ఆయన మాట్లాడారు. మధ్యభారతంలో ఉన్న కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం కోసం ఆపరేషన్ కగార్ కొనసాగుతుందని ఆరోపించారు. 16 నెలల కాలంలో 52 ఎన్‌కౌంటర్లలో 480 మందిని పాలకులు హత్య చేశారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం ఏర్పాటు చేయాలని కోరారు.

# పిల్లల్ని చంపి, తండ్రి ఆత్మహత్య

- ఇంట్లోంచి దుర్వాసన.. పోలీసులకు స్థానికుల సమాచారం
- భార్య గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోవడంతోనే దురాగతం
- 10 పేజీల సూసైడ్ నోట్.. సంగారెడ్డి జిల్లాలో ఘటన

కొండాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గొడవలు అభంశుభం తెలియని వారి బిడ్డల ప్రాణాలను బలిగొన్నాయి. దంపతులు తరచూ మాటామాటా అనుకుంటుండటం, భార్య అలిగి ఇంట్లోంచి వెళ్లిపోవడంతో ఆ భర్త దారుణానికి ఒడిగట్టాడు. తన కూతురు, కుమారుడిని గొంతునులిమి చంపేసి, తాను ఆత్మహత్య చేసుకున్నాడు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలో ఈ ఘటన వెలుగుచూసింది. మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో లభించడంతో నాలుగురోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. సీఐ వెంకటేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మండలంలోని గారకుర్తి గ్రామానికి చెందిన బాయికాడి సుభాష్(45) సదాశివపేట మండలం ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సంగారెడ్డి మునిసిపాలిటీ ఎంఆర్ఎఫ్ కాలనీలో భార్య మంజుల, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. సుభాష్, మంజుల మధ్య మనస్పర్థలు పెరిగాయి. భర్త తీరు నచ్చక మంజుల ఇంటి నుంచి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన సుభాష్.. ఇంట్లోనే కుమారుడు ఆర్యన్(13), కూతురు ఆరాధ్య(5)ను గొంతు పిసికి చంపాడు. అనంతరం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లోంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు సోమవారం పోలీసులకు సమాచారమిచ్చారు. వారొచ్చి ఇంటి తలుపులు బద్దలుకొట్టి లోపల చూసేసరికి పిల్లలు ఆర్యన్, ఆరాధ్య, సుభాష్ మృతదేహాలు కనిపించాయి. సుభాష్ రాసిన పది పేజీల సూసైడ్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## గత్యంతరం లేక...

న్యాయస్థానాలతో మొట్టికాయలు వేయించుకోవడం, అదికూడా ఎన్నికలు ఇంకో ఏడాదిలో ఉండగా ఏ ప్రభుత్వానికైనా ఇబ్బందికరమైన విషయమే. తమిళనాడు మంత్రివర్గంనుంచి ఇటీవల ఇద్దరు మంత్రులు రాజీనామా చేయడం వెనుక చాలా అంశాలు పనిచేశాయి. ఓ వారం గడువు ఇచ్చి, పదవికావాలో, జైలుకావాలో తేల్చుకోమని సుప్రీం కోర్టు చెప్పిన తరువాత, తన బెయిల్ రద్దుకావడం ఖాయమని సెంథిల్ బాలాజీకి అర్థమైపోయింది. సెంథిల్ విషయంలో డీఎంకె ప్రభుత్వం ఆది నుంచీ ఎంత నిస్సిగ్గుగా వ్యవహరిస్తూవచ్చిందో తెలియనిదేమీ కాదు. మరో మంత్రి పొన్ముడి కూడా హిందూమత సంబంధిత వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా మద్రాస్ హైకోర్టుతో చీవాట్లు తిని రాజీనామా చేయాల్సి వచ్చింది. ఏడాదిలో ఎన్నికలున్న నేపథ్యంలో, న్యాయస్థానాల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న మంత్రులను గ్రక్కున విడవకపోతే, వారి నిష్క్రమణ వల్ల రేపటి ఎన్నికల్లో కలిగే రాజకీయనష్టం కంటే ప్రజల్లో ముందుగానే అప్రదిష్టపాలవుతామన్న భయం డీఎంకె అధినాయకత్వాన్నీ వెంటాడి ఉంటుంది.

వీరి రాజీనామాలను డీఎంకె నాయకులు ఏ విధంగానైనా సమర్థించుకోవచ్చును గానీ, న్యాయస్థానాలే వీళ్ళిద్దరినీ బయటకు గెంటేశాయన్నది వాస్తవం. సెంథిల్ రాజీనామా విషయం తెలియగానే, ఆయన బెయిల్ రద్దు కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. క్యాష్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో ఉన్న మంత్రిగారు బయటవుంటే అందరినీ ప్రభావితం చేస్తారు కనుక, మళ్ళీ జైలుకు పంపేయాలని ఒక బాధితుడితోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ కూడా కోరిన విషయం తెలిసిందే. కేసు తేలే వరకూ సెంథిల్‌కు మళ్ళీ మంత్రిపదవి ఇవ్వకూడదన్న నిబంధన విధించాలంటూ న్యాయమూర్తిని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థిస్తూ, ఆ నియమం లేకుంటే మరో నెలలో, అంటే, మే 24న సదరు న్యాయమూర్తి రిటైర్ అయిన మర్నాడే సెంథిల్ మళ్ళీ మంత్రి అయిపోవచ్చునని ఓ హెచ్చరిక కూడా చేశారు. అదేకనుక జరిగితే అప్పుడు మళ్ళీ బెయిల్ రద్దుకోసం రండి అంటూ న్యాయమూర్తి అన్నారు. నిజానికి, సెంథిల్ బాలాజీ విషయంలో డీఎంకె ఆదినుంచీ అదేరీతిన వ్యవహరిస్తూ వచ్చింది. 2023 జూన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఈయనను అరెస్టుచేసింది.

ఈ కేసులో ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారించినప్పటికీ, దర్యాప్తు సాగక, బాలాజీ అన్యాయంగా జైల్లో మగ్గిపోతున్నారని, 21వ అధికరణ ఉల్లంఘన జరుగుతోందని చెప్పి సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు గత ఏడాది సెప్టెంబర్‌లో బెయిల్ మంజూరుచేసింది. డీఎంకె శ్రేణుల ఘన స్వాగత సత్కారాల మధ్య జైలు నుంచి బయటకు వచ్చిన సెంథిల్‌ను నలభై ఎనిమిదిగంటల్లోనే స్టాలిన్ మళ్ళీ మంత్రిని చేసేశారు. సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మాత్రమే ఇచ్చిందనీ, నిర్దోషి అనలేదని స్టాలిన్‌కు తెలియకపోదు.

జయలలిత హయాంలో ప్రభుత్వ రవాణాసంస్థలో ఉద్యోగాలు అమ్ముకున్న ఆరోపణలమీద సిట్ దర్యాప్తులో సెంథిల్ కుట్రంతా వెలుగు చూసి న్యాయస్థానాలకు చేరింది. నిజానికి, సెంథిల్ అవినీతిమీద విపక్ష నేతగా స్టాలిన్ స్వయంగా పోరాడారు. తాను శాసనసభలో సాక్ష్యాలు సమర్పించినా చర్యలు లేనందుకు జయలలిత ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆ తరువాత జయలలిత దూరం పెడితే డీఎంకెలో చేరిన సెంథిల్‌ను చేరదీసి, మరింత నిస్సిగ్గుగా ఆయన పక్షాన వ్యవహరించడం ఆరంభించారు.

సెంథిల్ పదవిలో ఉంటే దర్యాప్తు ప్రక్రియకు విఘాతం కలుగుతుందంటూ అప్పట్లో రాజ్‌భవన్ సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ప్రకటన ఇప్పుడు చాలామందికి గుర్తుకొస్తున్నది. సెంథిల్ జైల్లో ఉన్నా కూడా ఎనిమిదినెలల పాటు పోర్టుఫోలియో లేని మంత్రిగా కొనసాగారు. క్యాష్ ఫర్ జాబ్స్, మనీ లాండరింగ్ ఆరోపణలతో పాటు, అంతకుపూర్వంనుంచే ఆయనపై అనేక క్రిమినల్ కేసులున్నాయి. అటువంటి వ్యక్తిని ఇప్పుడు సుప్రీంకోర్టు ఆగ్రహం నేపథ్యంలో పదవినుంచి తప్పించినప్పటికీ, ఒక అవినీతిపరుడిని వెనకేసుకొచ్చిన అప్రదిష్ఠ స్టాలిన్‌కు తప్పదు. మరో మంత్రి పొన్ముడి సైతం ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో ఇరుక్కొని, కేవలం న్యాయస్థానాల ఉపశమనాల కారణంగా బయట తిరుగుతూ, చిత్తం వచ్చినట్టు మాట్లాడుతూ స్వేచ్ఛను దుర్వినియోగం చేసినవారే. కోర్టుల కారణంగా ఈ ఇద్దరు మంత్రులను వదిలించుకున్నంత మాత్రాన స్టాలిన్‌కు అంత సులభంగా మచ్చ తొలిగిపోదు.

# పహల్గాంపై ప్రతీకారానికి నిరీక్షణ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 'మన్ కి బాత్' ప్రసంగం (ఏప్రిల్ 27)లో ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాద దాడి, దాని అనంతర పరిణామాల గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఆయన ఇలా అన్నారు: 'మీతో నా మనసులోని మాట పంచుకుంటున్న వేళ నా హృదయం తీవ్ర వేదనతో నిండి ఉంది. పహల్గాంలో ఉగ్రదాడి ప్రతి భారతీయుని హృదయాన్ని గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందినవారైనా, ఏ భాష మాట్లాడేవారైనా ఆ ఉగ్రదాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు. ఆ ఉగ్రదాడి చిత్రాలను చూస్తుంటే ప్రతి భారతీయుని రక్తం మరిగిపోతోంది'.



■ పి. చిదంబరం

నూట నలభై కోట్లకు పైగా భారతీయుల మనోభావాలను ప్రధానమంత్రి వ్యక్తం చేశారు. దేశ సమైక్యత, సమస్త భారత ప్రజల సంఘీభావం, దృఢసంకల్పం ఉగ్రవాదంపై పోరులో అతి పెద్ద బలం అని ఆయన అన్నారు. ఒక జాతిగా భారత్ తన సంకల్ప బలాన్ని నిరూపిస్తుందని ఆయన వాగ్దానం చేశారు. ప్రధానమంత్రి దృఢ నిశ్చయాన్ని నేను హర్షిస్తున్నాను. ఆయన ఉత్తేజకర మాటలు కేవలం మాటలుగా మిగిలిపోవని ఆశిస్తున్నాను.

ప్రధానమంత్రి తన ప్రసంగంలో చెప్పినవన్నీ యథార్థాలు కావేమో?! పహల్గాం దాడికి ముందు కశ్మీర్‌లోని పరిస్థితుల గురించి ఆయన ఇలా చెప్పారు: 'కశ్మీర్‌లో మళ్లీ ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. పాఠశాలలు, కళాశాలలు సరికొత్త విద్యావాతావరణంతో మళ్లీ కళకళలాడుతున్నాయి. నిర్మాణ రంగ కార్యకలాపాలు మునుపెన్నడూ లేని విధంగా వేగం పుంజుకున్నాయి. ప్రజాస్వామ్యం మరింతగా శక్తిమంతమవుతోంది. పర్యాటకులు వెల్లువెత్తుతున్నారు. ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. యువత ఉపాధికి కొత్త అవకాశాలను సృష్టించడం జరుగుతోంది..' అందరూ ఆయనతో ఏకీభవించడం కష్టం. అంతెందుకు, మోదీయే తన మాటలపై ప్రగాఢంగా ఆలోచించుకుంటే తాను చెప్పినవి అతిశయోక్తులు అని తప్పక భావిస్తారు! మరింత వివరంగా చూద్దాం:

కశ్మీర్‌లో శాంతి ఒక సుదూర లక్ష్యంగా ఉన్నది. ఏప్రిల్ 24, 2025న జరిగిన అఖిలపక్ష సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ అధికారులు నివేదించిన వివరాల ప్రకారం జూన్ 2014 నుంచి మే 2024 మధ్య కాలంలో 1643 ఉగ్రవాద సంఘటనలు సంభవించాయి. 1925 చొరబాటు ప్రయత్నాలు జరిగాయి, వాటిలో 726 ప్రయత్నాలు సఫలమయ్యాయి; ఉగ్ర దాడుల్లో 576 మంది భద్రతా దళ సిబ్బంది మరణించారు. పాఠశాలలు విద్యావాతావరణంతో కళకళలాడడం లేదు. విద్యారంగ పరిస్థితులపై ప్రథమ్ అనే ఎన్జీఓ ఏటా ప్రచురించే ప్రామాణిక నివేదిక ప్రకారం కశ్మీర్‌లో 2018 అనంతరం ప్రాథమిక పాఠశాలల్లో చేరే వారి సంఖ్య తగ్గిపోయింది. ఉన్నత పాఠశాల బాలల్లో ఏడవ తరగతి వాచకాలు తప్పుల్లేకుండా చదివే బాలల శాతం చాలా తక్కువగా ఉంది.

ప్రజాస్వామ్యం మరింతగా శక్తిమంతమవుతుందన్న వాదనను గట్టిగా సవాల్ చేయవలసివుంది. జమ్మూ-కశ్మీర్‌ను ఒక కేంద్రపాలిత ప్రాంతంగా కుదించివేసిన అనంతరం ప్రజాస్వామ్యం బాగా క్షీణించిపోయింది. జమ్మూ-కశ్మీర్ ఇప్పుడు ఒక అర్ధ ప్రజాస్వామిక వ్యవస్థ మాత్రమే. ఎందుకని? కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్ విస్తృత అధికారాలు చెలాయిస్తుండగా ప్రజలు ఎన్నుకున్న మంత్రి మండలికి, ప్రజాప్రతినిధులకు కనీస అధికారాలనూ నిరాకరిస్తున్నారు! కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని రద్దు చేయడం (అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామన్న హామీ హామీగానే ఉండిపోయింది) తమను అవమానించడమేనని కశ్మీరీలు భావిస్తున్నారు. ఆ అగౌరవం ఇంకా కొనసాగుతుండడం పట్ల వారు అమితంగా మనస్తాపం చెందుతున్నారు. మాటల్లో చెప్పలేనంతగా బాధపడుతున్నారు. జమ్మూ-కశ్మీర్‌లో 2023–24లో నిరుద్యోగిత అధికారిక గణాంకాల ప్రకారమే 6.1 శాతంగా ఉన్నది. తలసరి ఆదాయం కూడా జాతీయ సగటు తలసరి ఆదాయం కంటే తక్కువ. అయితే కశ్మీర్‌కు వస్తున్న పర్యాటకుల సంఖ్య బాగా పెరుగుతోందన్న వాదన వాస్తవమే. అయితే ఉగ్రవాద దాడితో పర్యాటకుల వెల్లువ నిలిచిపోయింది. సామాన్య కశ్మీరీల ప్రయోజనాలకు తీవ్ర భంగం వాటిల్లింది.

పహల్గాంలో ఉగ్రవాద దాడి చోటుచేసుకున్న వెనువెంటనే ఆసేతు హిమాచలం అన్ని వర్గాల ప్రజలు తమంతట తామే అంతర్ ప్రేరణతో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి చర్య చేపట్టినా తాము సంపూర్ణంగా మద్దతునిస్తామని కాంగ్రెస్, ఇతర రాజకీయ పక్షాలు స్పష్టంగా ప్రకటించాయి. ఆ సంఘీభావం ఇప్పుడు అంత దృఢంగా లేనట్టు కనిపిస్తోందంటే అందుకు ప్రభుత్వాన్నే తప్పుపట్టవలసి ఉంది. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. పహల్గాం దాడిపై ప్రభుత్వం దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందేగానీ ప్రగాఢ పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. ప్రభుత్వంలో బాధ్యతాయుత స్థానాలలో ఉన్నవారెవరూ భద్రతా ఏర్పాట్లలో తీవ్ర లొసుగులు లోపాలు ఉన్న వాస్తవాన్ని అంగీకరించలేదు. సౌదీ అరేబియాలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక పర్యటనను మధ్యలోనే ముగించుకుని స్వదేశానికి తిరిగివచ్చారుగానీ వెన్వెంటనే పహల్గాంనుగానీ శ్రీనగర్‌నుగానీ సందర్శించలేదు. కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అయితే ప్రధానమంత్రి ఆ సమావేశానికి హాజరు కాకుండా ఒక ర్యాలీలో పాల్గొనేందుకు పాట్నా వెళ్లారు. పహల్గాంపై




**ప్రజాస్వామ్య వ్యవస్థలో జాతీయ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునేది ప్రధానమంత్రి. ఆ నిర్ణయాలను అమలుపరిచేది సైనిక దళాలు. పహల్గాంపై భారత్ ప్రతిస్పందన కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్న శత్రు ప్రభుత్వాలు, ప్రభుత్వేతర వ్యక్తులు, సంస్థలపై నిర్ణయాత్మక నిరోధక ప్రభావం చూపేదిగా ఉండితీరాలి.**

ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల తదాది పార్టీలు, వ్యక్తులు భిన్న వైఖరులతో ప్రతిస్పందిస్తున్నారు. 'పహల్గాం విషాదాన్ని తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునేందుకు భారతీయ జనతా పార్టీ తన అధికారిక, పరోక్ష సామాజిక మాధ్యమ వేదికల ద్వారా ప్రయత్నిస్తోందని, ఐక్యత, సంఘీభావం అవసరమైన సమయంలో విభేదాలను రెచ్చగొట్టడం ద్వారా ప్రజల్లో విభజనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని' కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేయబట్టింది. ఆ తీర్మానం ఇంకా ఇలా పేర్కొంది: 'పహల్గాంలో భద్రతా ఏర్పాట్లను ఛేదించి ఉగ్రవాదులు తమ ఘాతుకానికి పాల్పడడానికి గూఢచార వర్గాల వైఫల్యమే ప్రధాన కారణమని భావించక తప్పదు. ఈ వైఫల్యానికి దారితీసిన పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లలో లోపాలను సమగ్రంగా విశ్లేషించాలి'.

పహల్గాం ఘటనపై తక్షణమే ప్రతీకార చర్యలు చేపట్టాలనే డిమాండ్లు సహజంగానే వెల్లువెత్తుతున్నాయి. యుద్ధోన్మాద ప్రకటనలపై కశ్మీర్ వ్యవహారాలపై నిపుణుడు, గూఢచార సంస్థ 'రా' మాజీ అధిపతి అయిన ఎఎస్ దులాత్ ప్రతిస్పందిస్తూ 'యుద్ధం ఒక ప్రత్యామ్నాయం కాదు. యుద్ధం అసలు ఒక చివరి ప్రత్యామ్నాయం కూడా కాదు, అదొక చివరి చెడ్డ ప్రత్యామ్నాయం' అని స్పష్టం చేశారు. సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడంపై పాకిస్థాన్‌లో మాజీ హైకమిషనర్ శరత్ సబర్వాల్ ప్రతిస్పందిస్తూ, ఇది ఇప్పుడు చేపట్టవలసిన చర్య అని తాను భావించడం లేదని, అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించేందుకు తాను సుముఖంగానే ఉన్నానని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి కూడా దాడికి పాల్పడిన 'ది రెసిస్టెన్స్ ఫోర్స్' (టిఆర్ఎఫ్)ను గానీ, లష్కరే తోయిబాను గానీ తప్పుపట్టలేదు. చైనా వైఖరి సైతం ఎంతమాత్రం నిష్పాక్షికంగా లేదు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు పాకిస్థాన్ దృఢ సంకల్పంతో చర్యలు చేపట్టడాన్ని చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి ప్రశంసించారు. తమ జాతీయ భద్రతపై పాక్ ఆందోళనలు న్యాయసమ్మతమైనవని ఆయన అన్నారు. తన భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవడంలో పాకిస్థాన్‌కు చైనా మద్దతునిస్తుందని వాంగ్ యి అన్నారు.

పహల్గాం ఉగ్ర దాడి సంభవించి పదమూడు రోజులు గడిచిపోయాయి. గతంలో వలే ఇప్పుడు కూడా పాక్ భూభాగాలలోని ఉగ్రవాదుల స్థావరాలపై 'సర్జికల్ స్ట్రైక్స్' నిర్వహించడం చకితపరిచే ఘటనలు కాబోవని మెరుపు దాడులకు పాల్పడే విమానాలను పాక్ సైనిక దళాలు ముందుగానే పసిగట్టి అడ్డుకుంటాయని సైనిక నిపుణులు గట్టిగానే చెబుతున్నారు. అటువంటి దాడుల ఫలితాలు ఆశించినవిగా ఉండకపోవచ్చని కూడా నిపుణులు అంటున్నారు. భారత్ సైనిక పాటవ ఆధిక్యత దృష్ట్యా సర్జికల్ స్ట్రైక్స్‌కు ఇతర ప్రత్యామ్నాయాలు ఉన్నాయని విశ్వసిస్తున్నాను. పహల్గాం దాడులకు ప్రతిస్పందనగా ఎప్పుడు? ఎలా? ఎలాంటి చర్య తీసుకోవాలి? అనే విషయమై సైనిక దళాలకు ప్రధానమంత్రి సంపూర్ణ స్వేచ్ఛనిచ్చినట్టు ఒక అధికారిక ప్రకటన పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో జాతీయ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునేది ప్రధానమంత్రి. ఆ నిర్ణయాలను అమలుపరిచేది సైనిక దళాలు. పహల్గాంపై భారత్ ప్రతిస్పందన.. కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్న శత్రు ప్రభుత్వాలు, ప్రభుత్వేతర వ్యక్తులు, సంస్థలపై నిర్ణయాత్మక నిరోధక ప్రభావం చూపేదిగా ఉండితీరాలి. అటువంటి చర్య కోసం భారత్ నిరీక్షిస్తోంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

## 'అంతరిక్ష' విజ్ఞాని కస్తూరి రంగన్

భారతీయ అంతరిక్ష విజ్ఞాన వినీలాకాశంలో ఓ ధ్రువతార డా. కృష్ణస్వామి కస్తూరి రంగన్. ఆయన ఇటీవల (2025 ఏప్రిల్ 25న) కన్నుమూసిన విషయం విదితమే. 1994–2003 మధ్యకాలంలో 'ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్' (ఇస్రో)ను విజయవంతంగా ముందుకు నడిపిన ద్రష్ట. 84 ఏళ్ల వయసులో కన్నుమూసే నాటికి కూడా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్, ఎన్ఐఐటి యూనివర్సిటీలకు కస్తూరి రంగన్ ఛాన్సలర్‌గా ఉన్నారు. అంతకుముందు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఛాన్సలర్, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యత్వం, ప్లానింగ్ కమిషన్ సభ్యత్వం, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ డైరెక్టర్. వీటన్నిటికీ మించి 'న్యూ ఎడ్యుకేషన్ పాలసీ–2020' కమిటీకి ఛైర్మన్.. ఇలా కస్తూరి రంగన్ అందించిన సేవలు ఎనలేనివి.

భారతదేశపు తొలి ప్రయోగాత్మక భూ అధ్యయన ఉపగ్రహాలైన భాస్కర–1, 2లకు సంబంధించి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గానూ, తర్వాత రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ (ఐఆర్ఎస్–1ఎ)కు పర్యవేక్షకుడిగానూ ఆయన బాధ్యతలు నిర్వహించారు. తర్వాత సారథిగా పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ అలాగే పోలార్ శాటిలైట్స్‌ను విజయవంతం చేశారు. వ్యవసాయం, అటవీ సంపద, టౌన్ ప్లానింగ్, నీటి వనరుల నిర్వహణ, చేపల పెంపకం, ఆరోగ్యం, విద్య వంటి మంత్రిత్వ శాఖలకు దోహదపడే నేషనల్ నేచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ సిస్టమ్స్ ద్వారా సామాన్య జనానికి అంతరిక్ష విజ్ఞానం ఎలా సాయం చేయగలదో చేసి చూపించారు. 1999 నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా మే 11న చేసిన ప్రసంగంలో చంద్రుడి చుట్టూ ప్రదక్షిణం చేయగల కృత్రిమ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ ద్వారా ఎలా సాధించగలమో వివరించారు. నాలుగేళ్ల తర్వాత ఆ దార్శనిక ప్రసంగమే చంద్రాయన్–1 ప్రాజెక్ట్ రిపోర్టుగా రూపుదాల్చింది. 2003 ఆగస్టు 15న అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో దీని గురించి తొలుత ప్రస్తావించారు.



మనదేశంలో 1962లో అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. ఈ ఇస్రోకు విక్రమ్ సారాభాయ్, ఎంజీకే మీనన్, సతీష్ ధావన్, యుఆర్ రావు తర్వాత 1994లో కస్తూరి రంగన్ ఛైర్మన్‌గా పగ్గాలు చేపట్టారు. భూగ్రహాన్ని పరిశీలించేందుకు, సమాచారం సేకరణ, బట్వాడా కోసం వినియోగించిన ఉపగ్రహాలు, వాటిని ప్రయోగించే రాకెట్లు, అంతరిక్ష విజ్ఞానం నుంచి ఆదాయం వంటివన్నీ ఆయన హయాంలో సుసాధ్యమైనవే. ఎడ్యుశాట్, ఇన్‌శాట్, జీ శాట్, రిసోర్స్ శాట్, ఆస్ట్రో శాట్, ఒకే రాకెట్ ద్వారా ఒకేసారి పలు ఉపగ్రహాలను ప్రయోగించడం వంటివి ఆయన సాధించిన విజయాల మైలురాళ్లు. 1999లోనే ఇన్సాట్–2ఇ లోని 10 ట్రాన్స్‌పాండర్లను లీజుకి ఇవ్వడం ద్వారా మనం ప్రాంతీయ భాషల్లో సైతం కేబుల్ టీవీని చూడగలిగాం. అంతేకాదు, సుమారు 47 దేశాలకు భారతీయ టీవీ ఛానెళ్ల కార్యక్రమాలు చేరగలిగాయి. 'షార్' సెంటర్లో ఉపగ్రహాలను ప్రయోగించేందుకు మరో లాంచింగ్ పాడ్ ఏర్పాటు ప్రయత్నాలు, చంద్రయాన్ ప్రాజెక్టు పురుడు పోసుకోవడం ఆయన చలువే. అందుకే ఈ విజయ గాథను 'కస్తూరి రంగన్ మ్యాజిక్' అని ఆయన మిత్రులు, సిబ్బంది కొనియాడుతూ ఉంటారు.

కస్తూరి రంగన్ వ్యక్తిగత జీవితాన్ని పరిశీలిస్తే.. కొచ్చిన్ సంస్థాన ప్రాంతంలోని ఎర్నాకులంలో 1940 అక్టోబర్ 24న సీ.ఎం. కృష్ణస్వామి అయ్యర్, విశాలాక్షి దంపతులకు కస్తూరి రంగన్ జన్మించారు. కృష్ణస్వామి అయ్యర్ 'టాటా'తో పాటు ఇండియన్ ఎయిర్‌లైన్స్ కార్పొరేషన్‌లో పనిచేశారు. చిన్న వయసులోనే తల్లిని కోల్పోయారు. అక్కడే శ్రీరామ వర్మ హైస్కూల్ విద్య, రామ్ నారాయణ రుయా కాలేజ్‌లో డిగ్రీ చదివారు. అటు పిమ్మట బొంబాయి యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ (ఫిజిక్స్) పూర్తి చేశారు. అనంతరం అహ్మదాబాద్‌లోని విక్రం సారాభాయ్ డైరెక్టర్‌గా ఉన్న 'ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీ'లో హై ఎనర్జీ ఎక్స్ రే, గామా రే ఆస్ట్రానమి'కి సంబంధించి 1967లో పీహెచ్‌డి పూర్తి చేశారు. 1969లో కస్తూరి రంగన్‌కు లక్ష్మితో వివాహమైంది. తొలుత 1967లో రీసెర్చ్ అసోసియేట్‌గా ఉద్యోగాన్ని ప్రారంభించి, 1971లో బెంగళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్‌లో ఫిజిసిస్ట్‌గా చేరారు. అలా 35 ఏళ్లు అక్కడే పని చేసి ఇస్రో ఛైర్మన్‌గా, స్పేస్ కమిషన్ బాధ్యులుగా, డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ సెక్రటరీగా పని చేసి 2003లో పదవీ విరమణ చేశారు.

కస్తూరి రంగన్ తన జీవితాన్నంతా పరిశోధనకే అంకితం చేశారు. తొలుత ఎర్నాకులం, తర్వాత బొంబాయి, అనంతరం అహ్మదాబాద్‌లో, తర్వాత నాలుగు దశాబ్దాలకు పైగా బెంగళూరులో గడిపి అక్కడే కన్నుమూశారు. 240 పరిశోధనా పత్రాలు కలిగిన కస్తూరి రంగన్‌కు 27 యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లతోపాటు ప్రభుత్వం నుంచి పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ గౌరవాలు కూడా లభించాయి. రంగన్ రచించిన 'స్పేస్ అండ్ బియాండ్' అనే పుస్తకం అంతరిక్ష విజ్ఞానం, విద్యా రంగం గురించి ఆయన చేసిన కృషిని వివరిస్తుంది.

• డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి పూర్వ సంచాలకులు

# సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా..

ఈ మధ్య విడుదలైన 'వార్షిక విద్యాస్థితి నివేదిక' (ASER 2024) ప్రకారం తెలంగాణలో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న దాదాపు సగం మంది విద్యార్థులు రెండో తరగతి పుస్తకాన్ని చదవడంలో విఫలం అయ్యారు! 2014లో కేవలం 27 శాతంగా ఉన్న ఈ పరిస్థితి 2024 నాటికి 50శాతానికి పెరిగింది. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు ఏ మేరకు సాధించబడ్డాయో ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. ఈ నివేదికలో బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల కంటే తెలంగాణ దిగువ స్థానంలో నిలవడం విచారకరం. జాతీయస్థాయిలో ప్రతి ఏడాది నిర్వహించే 'నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే'లోనూ మన రాష్ట్రానిది ఇదే పరిస్థితి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'పాఠశాలల పనితీరు గ్రేడింగ్ సూచిక'లో తెలంగాణ క్రింది నుంచి ఆరో స్థానంలో ఉండడం మన విద్యావ్యవస్థపై జరిగిన విధ్వంసం స్థాయిని కళ్లకు కట్టినట్లుగా చూపుతోంది.




కర్ణుడి చావుకి సవాలక్ష కారణాలు అన్నట్టు విద్యారంగంలో ఈ పరిస్థితి నెలకొనడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది.. విద్యపై గత పాలకుల నిర్లక్ష్యం. టీచర్ల నియామకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇక ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల సంగతి సరేసరి. డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈఓ వంటి పర్యవేక్షణాధికారుల పోస్టులనూ భర్తీ చేయలేదు. దీంతో బడులపై పర్యవేక్షణ కరువైంది. నాటి ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించిన కేజీ టు పీజీ విద్య కేవలం ఆ పార్టీ నాయకుల జేబులు నింపడానికే అన్నట్టు మారింది. కేజీబీవీ, సర్వశిక్షా అభియాన్, అంగన్వాడీలలో పని చేస్తున్న ఉద్యోగులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల పట్ల అవమానకరంగా వ్యవహరించింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయంతో నాది ప్రత్యేక అనుబంధం. నేను ఎమ్మెల్యేగా గెలిచాక ఓ కార్యక్రమం కోసం యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి వెళ్లాను. ఒకప్పుడు నేను చూసిన ఓయూ వేరు. ఇప్పటి ఓయూ వేరు. గురువులు లేక చాలా డిపార్ట్మెంట్లు మూతపడ్డాయి. ఉస్మానియా యూనివర్సిటీ పరిస్థితే ఇలా ఉంటే ఇక మిగిలిన కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ వంటి యూనివర్సిటీల పరిస్థితి చెప్పనవసరం లేదు.

ఉద్యమ సమయంలో ప్రొఫెసర్లతో కలిసి నడిచిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వకుండా వారిని అవమానపరిచారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదం ప్రాతిపదికనే తెలంగాణ ఉద్యమం కొనసాగింది. కేసీఆర్ ఇంట్లో అందరికీ నియామకాలు జరిగాయి. కానీ రాష్ట్రంలోని నిరుద్యోగులకు మాత్రం శూన్యమే మిగిలింది.

'అణగారిన బతుకుల్లో వెలుగులు నింపేది విద్యే' అనే అంబేడ్కర్ సిద్ధాంతాన్ని బలంగా నమ్మే కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న విద్యారంగాన్ని చక్కదిద్దే ప్రయత్నాలు మొదలుపెట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో విద్యాశాఖకు 23,108 కోట్లు కేటాయించడం ఈ ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. టీచర్స్ పదోన్నతులు, బదిలీలను చేపట్టింది. విద్యా రంగాన్ని పునరుద్ధరించడానికి 2024 సెప్టెంబర్ 4న తెలంగాణ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని ఛైర్మన్‌గా నియమించింది.

అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే దాదాపు యాభై వేలకు పైచిలుకు ఉద్యోగాలకు పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చింది. అందులో టీచర్, లెక్చరర్ ఉద్యోగాలు కూడా ఉన్నాయి. చరిత్రలో నిలిచేలా రాష్ట్రంలో 58 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల'లను నెలకొల్పాలని సంకల్పించడం ఓ శుభ పరిణామం. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, కస్తూర్బా పాఠశాలల్లో డైట్ చార్జీలను పెంచింది. రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు వీసీలను నియమించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి సంబంధించిన మార్గదర్శకాలకు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లతో సమానంగా మన రాష్ట్ర ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సును 65కు పెంచింది. యువతలో నైపుణ్యాలు పెంపొందించాలనే ప్రణాళికతో రాష్ట్రంలో "స్కిల్ యూనివర్సిటీ"లను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించింది.

ఉద్యోగ నియామకాల క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల కల్పనపై తనకున్న చిత్తశుద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం చాటుకుంది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. అయితే.. విద్య అనేది సమాజ ఉమ్మడి ప్రయత్నాల ద్వారా విజయవంతమయ్యే కార్యక్రమం. కాంగ్రెస్ పాలనలో ఒక యజ్ఞంలా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలి. అప్పుడే సంపూర్ణ ఫలాలు పొందగలుగుతాం.

○ డా. మేడిపల్లి సత్యం
శాసనసభ్యులు, చొప్పదండి నియోజకవర్గం

# పొంచి ఉన్న 'కృష్ణా' జలకాటకం!

సుప్రీంకోర్టు స్టే ఉన్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్–2 తుది తీర్పు(2013)పై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేందుకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సన్నాహాలు చేస్తున్నారు. బేసిన్‌లోని రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించి తీర్పును గెజిట్ నోటిఫికేషన్ చేయదలచారు. ఇదే జరిగితే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి పంగనామాలు మిగులుతాయి. ఈ నెల ఏడవ తేదీన బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేశారు. వాస్తవంలో కర్ణాటక ఆల్మట్టి జలాశయం నిర్మించిన తర్వాత కృష్ణకు వరద ఆలస్యంగా వస్తోంది. ఈ తీర్పు నోటిఫై జరిగి, ఆల్మట్టి ఎత్తు 525 మీటర్లకు పెరిగితే, ఇంతే సంగతులు. పైగా వర్షాభావ నీటి సంవత్సరాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఈ తీర్పు ద్వారా ఎగువ రాష్ట్రాలు పొందిన లబ్ధికి వ్యతిరేకంగా కొంత చురుకుగా వ్యవహరించారు. కాని రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన కేసీఆర్ ఎగువ రాష్ట్రాలు పొందిన లబ్ధి గురించి పట్టించుకోవడం మానేశారు.

కేసీఆర్ భావోద్వేగాలు పెంచి పోషించే వ్యూహం రచించి, కృష్ణ నదీ జలాల వాటాల గురించి అవశేష ఆంధ్రప్రదేశ్‌తో వాదులాటకు దిగారు. తుదకు 2020లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని బుట్టలో వేసుకొని తిరిగి ఉభయ రాష్ట్రాల మధ్య కృష్ణ నదీ జలాల పంపిణీకి ట్రిబ్యునల్ నియామకం గురించి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందారు. ఈ ప్రతిపాదన కేంద్ర న్యాయశాఖ వద్ద మూడేళ్ల కాలం దస్త్రాలకే పరిమితమవగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2023 తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఏకంగా ట్రిబ్యునల్ నియామకానికి ఆమోదం తెలిపి, ఆంధ్రప్రదేశ్ గొంతు కోసింది.

గమనార్హమైన అంశమేమంటే ఇదే ట్రిబ్యునల్ రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు 2015 నుంచి విచారణ జరుపుతుండగా, 1956 అంతర్ రాష్ట్ర జల వివాద చట్టం సెక్షన్ 3 కింద అదనపు అంశాలు జోడించి, విధి విధానాలతో విచారణకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్ రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు రెండు రాష్ట్రాలు కోరిన 31 అంశాలు పక్కన బెట్టి, తాజాగా కేంద్రం జారీ చేసిన ఆదేశాల మేరకు విచారణ సాగిస్తోంది. ఇదంతా ఎందుకంటే, తాజాగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గైకొంటున్న చర్యలు ఫలిస్తే, రెండు తెలుగు రాష్ట్రాలకూ ప్రమాదం పొంచి ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక లబ్ధి పొందుతాయి. పైగా అదనంగా 258 టియంసిల నికర జలాలు ఎగువ రాష్ట్రాలు తన్నుకుపోతాయి. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల జల వనరులు శాఖ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయడంలోని ఆంతర్యమేమిటి? ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆల్మట్టి ఎత్తు 525 మీటర్లకు పెంచుతామని రైతుల సమావేశంలో ప్రకటించారు. దానికి, కేంద్ర మంత్రి చొరవకు ఏమైనా సంబంధముందా?

బచావత్ ట్రిబ్యునల్ తీర్పు కాల పరిమితి ముగిసిన తరువాత 2004లో నియామకమైన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో తుది తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర శరాఘాతంగా ఉండడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకెక్కింది. సుప్రీంకోర్టు ఈ తీర్పుపై స్టే విధించడంతో కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు యథాతథస్థితి కొనసాగుతోంది. అయితే రాష్ట్ర విభజన తర్వాత 2015లో తెలంగాణ కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయింది. గత రెండు మూడేళ్లుగా మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో స్టే వెకేట్ చేయించేందుకు శతవిధాల విఫల యత్నాలు చేశాయి. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు కనీసం షరతులతో ఆల్మట్టి ఎత్తు పెంచుకొనేందుకు అనుమతి ఇవ్వమని సుప్రీంకోర్టును కోరింది. కాని జరగలేదు. ఇప్పుడు తాజాగా కేంద్ర జల శక్తి శాఖ మంత్రి ఏకాభిప్రాయం సాధనకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయనకు ఇప్పుడు ఎందుకు ఈ ఆలోచన వచ్చిందో, దీని వెనుక ఎవరు ఉన్నారో తెలియదు.

**కేంద్ర జలశక్తి మంత్రి ఏర్పాటు చేసే సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ కూడా ఏకాభిప్రాయ ప్రకటనను గట్టిగా వ్యతిరేకించవలసి ఉంది. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఇతర జల వివాదాలు ఈ సమిష్టి పోరాటానికి అడ్డు రాకూడదు. ఏకాభిప్రాయ సాధన పేరుతో కేంద్రం ఇతర తాయిలాలతో మభ్యపరిస్తే మాత్రం ఉభయ తెలుగు రాష్ట్రాల కొంపలు కొల్లేరవుతాయి.**



దేశంలో ఏ నదీ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినా నదికి ఆఖరుగా ఉండే రాష్ట్రం నీటి ఎద్దడి రోజుల్లో వాడుకొనేందుకు మిగులు జలాలు కేటాయించే సంప్రదాయముంది. వర్షాభావ రోజుల్లో ఆ నీరే గతి. కాని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కృష్ణ నదిలో చుక్క మిగులు నీళ్ల లేకుండా మొత్తం బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య పంపకం చేసింది. మిగులు జలాలు ఉండి వుంటే నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఈ స్థాయిలో నీటి వివాదాలు ఉండేవి కావు. పైగా క్యారీ ఓవర్ అనే హెడ్ కాకుండా మిగిలిన రెండు రాష్ట్రాలకు కేటాయించిన నీటిని నేరుగా వాడుకొనే అవకాశం కల్పించింది. కనీసం ఇతర రాష్ట్రాలతో సమానంగా ఇంచుమించు కేటాయింపులు లేకుండా కేవలం 38 టీయంసీలు మాత్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది.

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఏర్పాటు చేసే సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ కూడా ఏకాభిప్రాయ ప్రకటనను గట్టిగా వ్యతిరేకించవలసి ఉంది. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఇతర జల వివాదాలు ఈ సమిష్టి పోరాటానికి అడ్డు రాకూడదు. ఏకాభిప్రాయ సాధన పేరుతో కేంద్రం ఇతర తాయిలాలతో మభ్యపరిస్తే మాత్రం రెండు రాష్ట్రాల కొంపలు కొల్లేరవుతాయి.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పు నోటిఫై చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయాలి. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఉంది. అలాంటి వివాదాన్ని కోర్టు బయట పరిష్కారానికి పూనుకుంటున్న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి, కేసులున్నా, సుప్రీంకోర్టు స్టే లేని వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పు ఎందుకు నోటిఫై చేయలేదో అర్థం కాదు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు నోటిఫై కోసం మహారాష్ట్ర, కర్ణాటక ముఖ్యమంత్రుల స్థాయిలో చర్యలు ఉంటున్నాయి, ఫాలో అప్ చేస్తున్నారు. ఏపీ కూడా లాబీయింగ్ మొదలు పెట్టి ఉంటే వంశధార ట్రిబ్యునల్ ఇంకా పెండింగ్‌లో ఉండేది కాదు. ఇప్పటికైనా ఏపీ ఇంజనీరింగ్ అధికారులు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్–2 తీర్పు నోటిఫైకి వ్యతిరేకంగా పోరాడుతూ, అదే సమయంలో సుప్రీంకోర్టు స్టే లేని వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పు నోటిఫై చేయించుకోవాలి. ఇదే జరిగితే అతి తక్కువ నిధులతో వంశధార, నాగావళి నదులు అనుసంధానికి మార్గం సుగమం అవుతుంది.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

# ఖర్చు తడిసిమోపెడు!

## భారంగా మారిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ



- నెలల తరబడి అందని సరుకుల బిల్లులు
- చెల్లింపుల విషయంలో ప్రభుత్వం మీనమేషాలు
- కూరగాయలు, గ్యాస్ సిలిండర్, స్టేషనరీ కొనుగోలుకు అవస్థలు
- ఏడాదికోసారి మొత్తంగా చెల్లిస్తున్న ప్రభుత్వం
- అప్పటివరకు టీచర్లే చెల్లిస్తున్న వైనం
- భవనాల అద్దె భారానికి తోడు మరో భారం

హనుమకొండ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. నెలవారి బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తోంది. అంగన్‌వాడీ టీచర్లే ఖర్చులు భరించి ఆపై నిధుల విడుదల కోసం పడిగాపులు కాచే దుస్థితికి గురి చేస్తోంది. ఒక వైపు భవనాల అద్దె భారంగా మారగా.. ఇది చాలదన్నట్లు కూరగాయలు, గ్యాస్ సిలిండర్, స్టేషనరీ బిల్లులు కూడా చెల్లించుకోవడం టీచర్లకు ఆర్థికంగా పెను సమస్యలు సృష్టిస్తోంది. ఏడాదికోసారి ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేస్తుండగా.. వేతనాలే నెలవారీగా అందని టీచర్లు ఈ భారాన్ని భరించలేకపోతున్నారు. గర్భిణులు, బాలింతలు, 0 నుంచి 6 ఏళ్ల వయసు పిల్లల పోషకాహారం, ఆరోగ్యం, విద్య లక్ష్యంతో నిర్వహిస్తున్న అంగన్వాడీ సెంటర్ల దుస్థితిని ప్రభుత్వం మార్చాలనే విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. అంగన్వాడీ టీచర్లు తమ వేతనాల నుంచే పెట్టిన పెట్టుబడి బిల్లుల రూపంలో ఏడాదికి ఒకేసారి అందుతున్నాయి.

### ఏడాదిగా వేచి చూడాల్సిందే..

అంగన్వాడీ కేంద్ర నిర్వహణకు అవసరమయ్యే సరుకులు, ఇతర సామగ్రి బిల్లులు నెలవారీగా చెల్లింపులు జరగడం లేదు. అంగన్వాడీ కేంద్రాలకు నాలుగు నెలలకు ఒక గ్యాస్ సిలిండర్ వంట కోసం సరఫరా జరుగుతోంది. మొత్తంగా ఏడాదికి మూడు సిలిండర్లు సరఫరా అవుతాయి. వీటి బిల్లులు కూడా ఒకేసారి మొత్తంగా చెల్లింపు జరుగుతోంది. ఇక ప్రతీరోజు కూరగాయల కొనుగోలు ఖర్చు నెల మొత్తంగా లెక్కలోకి తీసుకొని ఆ మేరకు బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. అదే విధంగా న్యాప్‌కిన్స్, చీపుర్లు, ఫినాయిల్ తదితర స్టేషనరీ బిల్లుగా నెలకు రూ.100 అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే ఈ మూడు విభాగాల బిల్లులు ఎప్పటికప్పుడు కాకుండా సంవత్సరం దాకా ప్రభుత్వం పొడిగిస్తూ వస్తోంది.

### భవనాల అద్దె భారం

అంగన్వాడీ భవనాల అద్దె భారాన్నే టీచర్లు చెల్లించి.. ఆపై ప్రభుత్వం నుంచి ఆలస్యంగా పొందుతున్నారు. ఈ బిల్లులు కూడా ఆరు నెలల వరకు పడుతోంది. ఈసమస్య చాలదన్నట్లు కూరగాయలు, స్టేషనరీ, గ్యాస్ సిలిండర్ బిల్లులను కూడా టీచర్లు ప్రతీ నెల భరించాల్సి వస్తోంది. ఆపై ప్రభుత్వం విడుదల చేశాక సర్దుబాటు చేసుకునే కష్టాలకు గురవుతున్నారు. అంగన్వాడీ టీచర్‌కు నెలకు వేతనంగా రూ.13,600 ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇందులో నుంచే టీచర్లు రూ.3 నుంచి 5వేలు అద్దెను ముందుగా తామే భరిస్తున్నారు. ఇక గ్యాస్ సిలిండర్‌కు రూ.950గా మూడు సిలిండర్లకు రూ.2,850 ముందుగా టీచర్లే చెల్లిస్తున్నారు. ఇక కూరగాయల బిల్లు సుమారుగా నెలకు రూ.1500 చొప్పున యేటా రూ.18,000 తామే భరించాల్సి వస్తోంది. నెల స్టేషనరీ బిల్లు రూ.100 సంవత్సరం పొడవునా రూ.1200 కూడా వేతనాల నుంచే చెల్లించాల్సి వస్తోంది. వీటి మొత్తం యేటా రూ.22,050 టీచర్లే తొలుత చెల్లించి ప్రభుత్వం నిధులు విడుదల చేసే వరకు వేచి చూడాల్సి వస్తోంది. దీంతో పాటు అంగన్వాడీ భవనాల అద్దె రూ.3వేల నుంచి రూ.5వేల వరకు చెల్లించాల్సి రావడంతో టీచర్లకు అందే వేతనం రూ.13,600 నుంచి సగం వేతనం చెల్లింపులకే సరిపోతోంది. వేతనాలు కూడా నెలవారీగా అందని పరిస్థితే. ఈ ఆర్థిక లోటు భర్తీ కోసం ప్రభుత్వం విడుదల చేసే నిధుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఏడాదికి కనికరించి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ముందుగా పెట్టిన పెట్టుబడి చేతికి అందుతుంది. కానీ అప్పటి వరకు ముందస్తుపెట్టుబడి ఖర్చులు పోను చేతికి సగం వేతనమే అందడం వల్ల తమ బతుకులు ఎలా అంటూ టీచర్లు ప్రశ్నిస్తున్నారు.

### సిలిండర్లను ఉచితంగా అందజేయాలి..

అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను ఉచితంగానే సరఫరా చేయాలనే డిమాండ్‌ను అంగన్వాడీ టీచర్లు వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే తాము ముందస్తు చెల్లించి ఆపై నిధుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండదని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఉచిత సేవలు అందిస్తున్న క్రమంలో సెంటర్లకు ఇవ్వాల్సిన ఆలోచన చేయాలని సూచిస్తున్నారు. ఇక టీచర్ల వేతనాలు, భవనాల అద్దె, కూరగాయల ఖర్చు, స్టేషనరీ బిల్లులు కూడా నెల వారిగా సక్రమంగా విడుదల చేస్తే మేలుగా ఉంటుందని టీచర్లు వేడుకుంటున్నారు.

# భద్రకాళి అమ్మవారికి గంధోత్సవం

- సామ్రాజ్య లక్ష్మిగా అలంకరణ
- ఉభయ సేవాదాతలుగా పద్మశాలి సంఘం
- పూజలో పాల్గొన్న మేయర్ దంపతులు, జిల్లా అధ్యక్షుడు రవీందర్



గంధంతో అలంకరించిన భద్రకాళి అమ్మవారి ఉత్సవమూర్తి

వరంగల్ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి నిత్యపూజ, చతుష్టానార్చన, పారాయణం, హోమాలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉభయ సేవాదాతలుగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంధోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో కుల బాంధవులందరు, నాయకులు పాల్గొనగా నగర మేయర్ గుండు సుధారాణి, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పూజల అనంతరం అమ్మవారికి మహా మంగళహారతి నిర్వహించారు. కుల బాంధవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పద్మశాలీ సంఘం నాయకులు వడ్నాల నరేందర్, కుసుమ సతీష్, గోరంటల రాజు, బేతి అశోక్, చిప్ప వెంకటేశ్వర్లు, డీఎస్ఎన్ మూర్తి, సాంబారి సమ్మారావు, గడ్డం భాస్కర్, దుస్స జనార్థన్, భైరి శ్యాంసుందర్, అక్కినేని వెంకటేశ్వర్లు, గుండేటి నరేందర్‌కుమార్, వేముల సదానందం, వేముల నాగరాజు, చేనేత కార్మికులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజసామాగ్రి సమర్పిస్తున్న పద్మశాలీ సంఘం నేతలు

# రెస్టారెంట్లు, స్వీట్ షాపుల్లో తనిఖీలు

- కుళ్లిన మాంసం ఉత్పత్తులు, రంగులు కలిపిన చికెన్ లభ్యం
- ఓ హోటల్ వారిపై అధికారుల ఆగ్రహం, నోటీసులు జారీ



అధికరారులు గుర్తించిన కుళ్లిన మాంసం, కూరగాయలు

బాలసముద్రం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్ హెడ్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, శ్రేషిక బృందం హనుమకొండలోని రెస్టారెంట్లు, మిఠాయి కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. హనుమకొండలోని ల్యాండ్‌మార్క్, ఫుడ్ అండ్ ఫైర్ హోటల్‌లో వంటగదులు అపరిశుభ్రంగా ఉండడం, దుర్వాసన కలిగిన రిఫ్రిజిరేటర్లు, సరైన ఉష్ణోగ్రతను పాటించకపోవడం గమనించారు. రూ. 45వేల విలువ గల 32 కిలోల కుళ్లిన మాంసపు ఉత్పత్తులు, హానికర రంగులను కలిపిన చికెన్, కాలం చెల్లిన ఐస్‌క్రీమ్‌లు, పాల పాకెట్లను కనుగొన్నారు. అలాగే ఫంగస్ పట్టిన కాలీఫ్లవర్, క్యాబేజి వంటి కూరగాయలను గుర్తించారు. బిర్యాని, ఇతర ప్రాసెస్డ్ ఫుడ్ తయారీలో మోతాదును మించి హానికర రసాయన రంగులను వాడడంపై అధికారులు హోటల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారికి నోటీసులు జారీ చేశారు. పదార్థాల శాంపిళ్లను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నుంచి వచ్చే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని జ్యోతిర్మయి తెలిపారు. ప్రమాణాలను పాటించని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అవసరమైతే హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

# హామీల అమలుపై ప్రభుత్వాలతో తేల్చుకుంటాం..

- దేశంలో పెరుకుపోతున్న సమస్యలు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడా వెంకట్‌రెడ్డి

భీమదేవరపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే తాడో పేడో తేల్చుకుంటామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముల్కనూర్‌లో సీపీఐ మండల 8వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాడా హాజరై మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం సంవత్సరానికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని ప్రజలను భ్రమలో పడేశారన్నారు. ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. టెలికాంలాంటి ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేసి ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు నెరవేర్చేంత వరకు సీపీఐ పోరాడుతుందన్నారు. గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. ఉపాధిహామీలో వంద రోజుల నుంచి 200 రోజుల వరకు పని దినాలను పెంచాలన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మంచాల రమాదేవి, కొంగల రామచంద్రారెడ్డి, ఆదరి రమేష్, గుర్రం సంపత్, టేకుమట్ల కుమారస్వామి, గొర్రె బాబు, పప్పు రాజమౌళి, మార్పు కృష్ణారెడ్డి, పందిళ్ల రవి, మమత, రాధిక, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కారల్‌మార్క్స్ జయంతి వేడుకలు

మండలంలోని ముల్కనూర్‌లో కారల్‌మార్క్స్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి చాడా వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మే 5న కారల్ మార్క్స్ జన్మించారన్నారు. కారల్‌మార్క్స్ సిద్ధాంతాల స్ఫూర్తితో సీపీఐ నాయకులు పోరాడాలని పిలుపునిచ్చారు.



మెరిసింది మేఘం..

హనుమకొండ కలెక్టరేట్ ప్రాంతంలో మెరుపులు

నగరంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గాలి దుమారం పెద్ద ఎత్తున రావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఉరుములు, మేరుపులు రాగా.. గాలి తీవ్రతకు పలుచోట్ల చెట్లు విరిగి పడ్డాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



# సాగులో శాస్త్రీయతను జోడించాలి

- రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు



నర్సింహులగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): సాగులో శాస్త్రీయత పాటించి అధిక దిగుబడులు పొందాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, అన్నదాతల అవగాహన' సదస్సులు నిర్వహించారు. వరంగల్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నర్సింహులగూడెం, పంథిని గ్రామాల్లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తల సూచనలు, మెళకువలు పాటించి లాభాలు గడించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, ఏడాదిన్నర కాలంలో రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలు అమలు చేసి, రైతులకు నాణ్యమైన కరెంట్, ఎరువులు, విత్తనాలు, అందుబాటులో ఉంచిందన్నారు. రసాయన ఎరువుల వినియోగంతో అహార ఉత్పత్తులు హానికరంగా మారుతున్నాయన్నారు. షుగర్, బీపీ, క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేంద్రియ సాగుతో ఆరోగ్యంగా ఉంటామని మన పూర్వీకులే దీనికి నిదర్శనమన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. అనంతరం వ్యవసాయ పరిశోధన, వివిధ విభాగాల శాస్త్రవేత్తలు ఆర్ ఉమారెడ్డి, అశ్విని, డీవో రవీందర్‌సింగ్ రైతులకు ఆరు అంశాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు పంట మార్పిడితో అత్యధిక దిగుబడి సాధించిన రైతులు దేవేందర్, భాస్కర్, వీరారెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం టీచింగ్ స్టాఫ్ భార్గవి, అర్చన, కరుణ, ఏవో సునీల్, విద్యార్థినులు పి.అనూష, వి.నందని, ఉద్యాన అధికారి సుస్మిత, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో రఘుపతిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు బుచ్చిరెడ్డి, సాయి, ఏతువోలు, రైతులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : క్రమం తప్పకుండా బల్దియా ప్రజావాణి ద్వారా ప్రజలు ఇస్తున్న ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. నగర ప్రజలకు అందించవలసిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. టౌన్‌ప్లానింగ్‌పై ప్రతీ ప్రజావాణిలో తరుచుగా ఫిర్యాదులు అందుతున్నాయని అధికారులు సమస్యలపై శ్రద్ధ వహించాలని సూచించారు. రానున్న వేసవిలో మంచి నీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్, పన్నుల వసూళ్లలో సిబ్బంది చేసిన కృషిని ప్రశంసిస్తున్నామని కమిషనర్ పొగిడారు.. 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 101 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటి కమిషనర్లు

మిగతా 8వ పేజీలో...



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పసుపు

## రికార్డు స్థాయిలో పసుపు ధర

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాకు రూ.13,852
- రేటు ఉన్నా.. పంట సాగు లేదు..

కేసముద్రం, మే 5 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పసుపునకు ఈ సీజన్‌లో రికార్డు స్థాయి ధర నమోదైంది. సోమవారం మార్కెట్‌కు 26 మంది రైతులు 260 బస్తాల్లో కాడి రకం పసుపు, 23 మంది రైతులు 85 బస్తాల్లో గోల రకం పసుపును విక్రయించేందుకు తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలో కాడి రకం పసుపు క్వింటాకు గరిష్ఠంగా రూ.13,825, కనిష్ఠంగా రూ.9,569, సగటున రూ.11,459, గోల రకం పసుపు గరిష్ఠంగా రూ.12,051, కనిష్ఠంగా రూ.8,659, సగటున రూ.10,501 చొప్పున ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. 2022లో పసుపు క్వింటాకు రూ.8వేల వరకే ఉండగా 2023లో కాడి రకం పసుపు క్వింటాకు రూ.12వేలు, నిరుడు క్వింటాకు రూ.10వేల వరకు ఉంది. తాజాగా ఈ సీజన్‌లో రూ.13వేలు దాటడం ఓ రికార్డుగా చెప్పవచ్చు.

### ధరలేక తగ్గిన సాగు విస్తీర్ణం

గత కొన్నేళ్లుగా పసుపు ధర క్రమంగా తగ్గుతూ వస్తుండడంతో రైతులు సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించుకుంటూ వచ్చారు. ఏళ్ల తరబడి పండిస్తున్న పసుపును ఓ సెంటిమెంట్ పంటగా భావిస్తూ అరకొర విస్తీర్ణంలో కొద్దిమంది రైతులు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు గత రెండేళ్లుగా నిత్యం 100 నుంచి 200 బస్తాల కంటే ఎక్కువ పసుపు విక్రయానికి రావడంలేదు. తాజాగా రెండు రోజుల సెలవుల అనంతరం మార్కెట్ ఉండడంతో 345 బస్తాల పసుపు యార్డుకు వచ్చింది. మార్కెట్‌లో ఇన్ని పసుపు రాశులు కనిపించడం ఈ ఏడాది అరుదైన విషయంగా మారింది. పసుపునకు ధరలు లేకపోవడం, పంట పండించేందుకు అధికంగా శ్రమ ఉండడంతో ఈ పంట సాగును తగ్గించి ఇతర పంటల వైపు రైతులు దృష్టి సారించారు. అనూహ్యంగా ధర పెరగడంతో వచ్చే ఏడాది మళ్లీ పసుపు సాగు చేసేందుకు పలువురు రైతులు మొగ్గుచూపుతూ విత్తన పసుపును నిల్వ పెట్టుకుంటున్నట్లు సమాచారం. ఏదేమైనా పసుపునకు ధర ఉన్నప్పటికీ రైతుల వద్ద పంట ఉత్పత్తి లేకపోవడం గమనార్హం.

## వడదెబ్బతో మహిళా కూలీ మృతి



అక్కి పార్వతి (ఫైల్)

గార్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత నేపథ్యంలో ఓ మహిళా కూలీ వడదెబ్బకు గురై మృతి చెందింది. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... అంబేద్కర్ నగర్‌కు చెందిన అక్కి పార్వతి(51) రోజువారీ కూలీ నాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. గత నాలుగు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు, వడగాలులకు పార్వతి వడదెబ్బకు గురై అస్వస్థతతో ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఇంట్లోనే తుదిశ్వాస విడిచింది. కాగా, పార్వతికి భర్త అక్కి వెంకటేశ్వర్లు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలి

- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి
- ప్రపంచ సుందరి పోటీలు ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం అడవుల్లో రక్తపుటేర్లు పారించకుండా, మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తాను 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై మార్కెటింగ్ మంత్రిగా చేసిన సమయంలో మావోయిస్టు నేతలు గద్దర్, శంకర్‌లను అప్పటి సీఎం ఎన్టీఆర్ వద్దకు తీసుకెళ్లి చర్చలు జరపడం జరిగిందన్నారు. కేంద్రం కూడా శాంతిచర్చలు జరపాలన్నారు. కేంద్రానికి శత్రుదేశంతో కాకుండా సొంత ప్రజలపైన దాడులు చేయడం తగదన్నారు. ప్రపంచ సుందరి పోటీలు ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని నిర్వాహకులే హైదరాబాద్‌ను ఎంపిక చేశారని, పోటీలకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. పోటీలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనేక ఇబ్బందులున్నా రూ.22,500 కోట్లు ఖర్చు చేసి 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా రూ.35కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నట్టు కడియం పేర్కొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌తో పథకంతో ఇప్పటికే రూ.10కోట్ల సీసీ రోడ్లు పూర్తి చేశామని, సీఆర్ఆర్ గ్రాంట్ క్రింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.14కోట్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, చిలుపూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, నాయకులు అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, దూదిపాల నరేందర్ రెడ్డి, జగదీష్‌చందర్ రెడ్డి, లింగాజీ, కొలిపాక సతీష్, గడ్డమీది సురేష్, ప్రసాద్, వెంకటేశ్వర్ రెడ్డి, జీడి రమేష్, రజాక్‌యాదవ్ పాల్గొన్నారు.

## పాలనలో అసమర్థతను కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు

- కేసీఆర్ ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టును కట్టారు
- మండలిలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద చర్చావేదిక



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మహదేవపూర్, మే 5(ఆంధ్రజ్యోతి): పదహారు నెలల అసమర్థ పాలనను కప్పి పుచ్చుకొనేందుకు రేవంత్ సర్కారు అనేక ప్రయత్నాలు చేస్తోందని, పాలన చేత కాక అభివృద్ధి చేయలేక తెలంగాణను ఆగం చేస్తున్నారని శాసనమండలిలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు - వాస్తవాలు' అనే అంశాలపై సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చా వేదికలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలను పటా పంచలు చేయాలనే ఆలోచనతో ఈ చర్చా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నాడు సమైక్యాంధ్ర పాలనలో వలసవాదులు తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను తరలించుకుపోయి అన్ని రకాలుగా అభివృద్ధి చెంది మన పైనే పెత్తనం చెలాయించారన్నారు. 1956 నుంచి 2014 వరకు అనేక ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సమస్యల కాసారంగా తయారైందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ సాధనే సమస్యలకు పరిష్కారమని ఉద్యమ నేత కేసీఆర్ ఆలోచన చేశారన్నారు. సమైక్యాంధ్ర పాలనలో నీళ్లు, నియామకాలు, నిధుల దోపిడీ జరిగిందని, నీళ్ల సమస్యతోనే తెలంగాణకు మేలు జరుగుతుందని గ్రహించిన కేసీఆర్ ఆ దిశగా అడుగులు వేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ముందుగా నీటి ఉద్యమం మొదలు పెట్టారన్నారు. తెలంగాణ నీటి కోసం పడుతున్న గోస విషయంలో కాకతీయులను ఆదర్శంగా తీసుకున్న కేసీఆర్ ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, నీటిని ఒడిసిపట్టే కాకతీయుల ఆలోచనలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని వివరించారు. పదేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటి ప్రయోజనాలు పొందామని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలనే కుట్రలు చేశారన్నారు. సాగునీటి రంగంలో అపురూపమైన ప్రగతిని చూసిన కాంగ్రెస్ ఆ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డాడని ప్రజలను నమ్మించే కుట్రలు చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి ఏజెంట్ అనే విషయం అందరికీ తెలిసిందేనని తెలిపారు. ఈ ప్రాంత ప్రయోజనాలను ఆంధ్రాకు తాకట్టు పెట్టి ప్రయోజనం పొందేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలోని బ్యారేజీలు కూలిపోవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం, ఆలోచన, ఆచరణ అని నీటి పారుదల రంగ నిపుణులు వి.ప్రకాష్‌అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంపై ఎవరికి అనుమానాలు లేకున్నా ఆయనకు మాత్రం ఉందన్నారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాతనే అన్ని ప్రాంతాలకు సాగునీరు అందిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లేకపోతే ఇప్పటికి ఎప్పుడో కూలిపోయేదన్నారు. ఆంధ్రాకు నీళ్ల తరలించేందుకే కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు వి.ప్రకాష్‌రావు, మాజీ ఎమ్మెల్యే పుట్టమధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సంస్థాగతంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి
- పార్టీ కోసం పనిచేసే వారికే పట్టం: ఎంపీ కడియం కావ్య

పాలకుర్తి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి, కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం వరిస్తుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, అమర్ అలీఖాన్, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిలు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కార్యకర్తలు విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని కోరారు. సన్నబియ్యం పంపిణీ, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుతానన్నారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లను మూడేళ్ల కాలంలో పూర్తి చేస్తానని అన్నారు. పాలకుర్తిలో 50 పడకలు, తొర్రూరులో వంద పడకల ఆస్పత్రి, మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కొడకండ్లలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఘనత సాధించాడన్నారు. దేశంలోనే ఓబీసీ కుల గణన జరగాలని రాహుల్ గాంధీ జీవిత లక్ష్యమన్నారు. ఎమ్మెల్సీ అమర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కకు పెట్టి అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎర్రబెల్లి స్వర్ణ, భరత్‌చందర్‌రెడ్డి, అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, రవళిరెడ్డి, బైకిని లింగం యాదవ్, పొట్ల నాగేశ్వరరావు, మేడి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కావ్య

# తెలుగు భాష పరిరక్షణకు ఉద్యమిద్దాం

- విశ్రాంత ఆచార్యులు ఆచార్య బన్న ఐలయ్య, కవి పొట్లపల్లి శ్రీనివాసరావు
- రేపు భాషా నిలయంలో సదస్సు

హనుమకొండ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మాతృభాష తెలుగుకు ముప్పు వాటిల్లుతుందని తెలుగు ప్రజలు నివసించే రాష్ట్రంలోనే తల్లి భాషకు ఆదరణ కొరవడడం ఏమాత్రం వాంఛనీయం కాదని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు ప్రముఖ కవి ఆచార్య బన్న ఐలయ్య, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష పరిరక్షణకు రాష్ట్ర రాజధానిలో భాషాభిమానులు, కవులతో ఒక సదస్సు జరిగిందని, దానికి కొనసాగింపుగా ఓరుగల్లులోనూ తెలుగు భాషా పరిరక్షణ కోసం ఉద్యమం ప్రారంభించాలన్న యోచన ఉందన్నారు. ఇందుకు ఈ నెల 7న హనుమకొండ లోని 110 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన శ్రీరాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో భాషా పరిరక్షణ కోసం సదస్సు ఏర్పాటు చేశామని వారు చెబుతూ ఈ సదస్సులో కవులు, రచయితలు, భాషాభిమానులు ప్రతీ ఒక్కరు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాలను పరిపాలిస్తు న్న నేతలు భాష విషయంలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటూ తెలుగు భాషను అణగదొక్కే విధంగా వ్యవహరిస్తున్నారని ఆచార్య బన్న చెప్పారు.

ఇటీవల ఇంటర్ విద్యలో ఆప్షన్‌గా సంస్కృతాన్ని మాత్రమే తీసుకోవాలని ఇంటర్ బోర్డు జీవో విడుదల చేయడం పట్ల పొట్లపల్లి శ్రీనివాసరావు అభ్యంతరం చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యలో తెలుగు భాష లేకుండా చేయాలన్నట్లుగా బోర్డు నిర్ణయం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలోనే రాష్ట్ర వ్యాప్తంగా భాషాభిమానులు, విశ్వవిద్యాలయ స్థాయిల్లో కవులు, రచయితలు కూడా పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో వరంగల్‌లోనూ ఒక సదస్సు ద్వారా ఐక్యతను ప్రదర్శించి భాషాభిమానాన్ని చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

## అమ్మాయి పుట్టిందని ఆక్రోశం..

- అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు
- పురుగుల మందు తాగి బాలింత ఆత్మహత్య



నిరూష (ఫైల్)

చిట్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుట్టిందని, అదనపు కట్నం ఇవ్వాలని అత్తింటి వేధింపులతో ఓ బాలింత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయ విదాకర ఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని ముచినిపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ముచినిపర్తి గ్రామానికి చెందిన కత్తికొండ శంకర్ లక్ష్మీరెండవ కుమార్తె నిరూష(26)ను వరంగల్ దేశాయిపేటకు చెందిన మునుగొండ సాంబయ్య లక్ష్మీ దంపతులకు మారుడు ప్రశాంత్‌కు ఇచ్చి గత ఏడాది వివాహం జరిపించారు. కాగా ఇరవై రోజుల క్రితం ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో అమ్మాయి పుట్టిందని అదనంగా లక్ష రూపాయలు ఇవ్వాలని నిరూష, ఆమె తల్లితండ్రులపై ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఒత్తిడి చేశారు. ఆదివారం భర్తతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి నిరూష ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ నిరూష సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై హేమ తెలిపారు.

## టీజీ డీఈఈ సెట్ షెడ్యూల్ విడుదల

హనుమకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : టీజీ డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. దీని ద్వారా 2025-2027 బ్యాక్‌కు సంబంధించి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ)లో ప్రభుత్వ, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ (మైనారిటీ/నాన్ మైనారిటీ) సంస్థల్లో ప్రవేశాలకు ఈ షెడ్యూల్ విడుదలైనట్లు ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ అబ్దుల్ హై తెలిపారు. ఈ మేరకు మార్చి 21న నోటిఫికేషన్ విడుదలైందని అర్హులైన అభ్యర్థులు మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించిన ఎడిట్ ఆప్షన్‌ను ఈనెల 17,18 తేదీల్లో తీసుకోవచ్చునని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఈనెల 20వ తేదీ నుండి హాల్ టికెట్లు జారీఅవుతాయని తెలిపారు. టీజీ డీఈఈ సెట్- 2025 ఆన్‌లైన్‌లో (కంప్యూటర్‌బేస్డ్ టెస్ట్) ప్రవేశ పరీక్ష ఈనెల 25న నిర్వహించనున్నట్టు తెలిపారు. కీ పైన అభ్యంతరాలు ఈనెల 28 వరకు స్వీకరిస్తారని చెప్పారు. టీజీ డీఈఈ సెట్-2025 ఫలితాలను జూన్ 5న ప్రకటిస్తారని, అర్హులైన, ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జూన్ 7 నుండి 11వ తేదీ వరకు జరుగుతుందని, అనంతరం అర్హులైన అభ్యర్థులందరూ జూన్ 13 నుండి 16వ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చునని అన్నారు. మెరిట్ ప్రాతిపదికన సంబంధిత కళాశాలలకు జూన్ 20న సీట్ల కేటాయింపు జరుగుతుందని, సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో జూన్ 21 నుండి 24 వరకు ఫీజు చెల్లించవచ్చునని, వారికి జులై 1 నుండి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అబ్దుల్ హై కోరారు.

## ఉమ్మడి జిల్లా మీడియా ఇన్‌చార్జ్‌గా కందగట్ల మోహన్



మోహన్

పోచమ్మమైదాన్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా మీడియా ఇన్‌చార్జ్‌గా గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ ఆరెపల్లికి చెందిన కందగట్ల మోహన్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా చైర్మన్ నందగిరి రజనీకాంత్ సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## పెరుగుతున్న పోటీతో ఒత్తిడిలో విద్యార్థులు

- ఇందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి
- నిట్‌లో బేర్‌ఫుట్ కౌన్సెలింగ్‌పై శిక్షణ శిబిరం ప్రారంభం



బేర్‌ఫుట్ కౌన్సెలింగ్ శిబిరం ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో రోజు రోజుకు పెరుగుతున్న పోటీ వల్ల విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారనీ, ఈ ఒత్తిడి నుంచి వారిని బయటపడేయంలో అధ్యాపకులు కీలక భూమిక పోషించాలని వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి పిలుపునిచ్చారు. సోమవారం నిట్‌లో బేర్‌ఫుట్ కౌన్సెలింగ్ ఫర్ ఫ్యాకల్టీ రెండు రోజుల శిక్షణా శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బిద్యాధర్ సుబుధీ మాట్లాడుతూ అనేక రకాల ఒత్తిడులను విద్యార్థులు అధిగమించేలా చేయడానికి అధ్యాపకులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ శిబిరం ద్వారా నిట్ అధ్యాపకులకు కనీస స్థాయి కౌన్సెలింగ్ నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చి వారు విద్యార్థులకు మద్దతుగా నిలబడేట్టు చేయనున్నామన్నారు. ఇందువల్ల విద్యార్థుల్లో సంక్షోభ పరిస్థితులను అధిగమించగల సామర్థ్యం పెరుగుతుందన్నారు. నిట్ క్యాంపస్‌లో సానుకూల మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తోందని డైరెక్టర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎక్స్‌ప్రెషన్ ఇండియా (ఢిల్లీ)కి చెందిన ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ జితేంద్ర నాగపాల్, డాక్టర్ గీతా మెహ్రోత్రా, హైదరాబాద్‌కు చెందిన మాజీ డీజీపీ ఆదిత్య ఆర్య, డాక్టర్ అనంత మాధవ మోహన్, ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ వేణు వినోద్, నిట్‌లోని సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్ ఇంచార్జి ప్రొఫెసర్ జి అంబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో నిట్‌లోని వివిధ విభాగాలకు చెందిన సుమారు 200 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అధ్యాపకులకు ప్రాథమిక కౌన్సెలింగ్ సాంకేతికతలను ఈ శిబిరంలో నేర్పుతారు. విద్యార్థులలో సాధారణంగా ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, ఇతర మానసిక సమస్యలను ఎదుర్కొనడంలో ఉపయోగపడే ఉత్తమ పద్ధతులు, సాధనాలు, విధానాలపై శిక్షణ ఇస్తారు.

### నిట్‌లో పాజిటివ్ మైండ్‌సెట్ కోర్సు

ఈ సందర్భంగా వరంగల్ ఎన్ఐటీ హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్‌తో ఉన్న అవగాహన ఒప్పందాన్ని పునురుద్ధరించుకుంది. ఈ ఒప్పందం ప్రకారం హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్, వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులకు సంయుక్తంగా పాజిటివ్ మైండ్‌సెట్ అనే ప్రత్యేక కోర్సును అందించనున్నాయి. ఇది విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని, సమగ్ర వ్యక్తిత్వవికాసానికి దోహదపడుతుంది.

## వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| పత్తి | 7410 | 5300 |
| మక్కలు | 2195 | 1521 |
| కందులు | 6650 | 3022 |
| పెసళ్లు | 7601 | 3022 |
| పల్లికాయ (సూక) | 6200 | 5200 |
| పల్లికాయ (పచ్చిది) | 4050 | 3575 |
| పసుపు (కాడి) | 13659 | 10534 |
| పసుపు (గోల) | 11359 | 9700 |
| తేజ మిర్చి | 12000 | 9500 |
| వండర్‌హాట్ | 11500 | 10000 |
| యూఎస్341 | 11000 | 9000 |
| దీపిక | 10000 | 9000 |
| దేశీ | - | - |
| సింగిల్ పట్టి | - | - |
| తాలు మిర్చి | 5000 | 2500 |

- వరంగల్ వ్యవసాయం




రామప్ప దేవాలయం

# రామప్ప శిల్పం.. అపురూపం

## అబ్బురపరిచే కాకతీయ శిల్పకళా చాతుర్యం

వెంకటాపూర్, మే 5, (ఆంధ్రజ్యోతి): కాకతీయ శిల్పకళా చాతుర్యం వర్ణించనలవి కానిది. ఎన్నేళ్ల గడిచినా చూపరులకు కట్టిపడేసే అపురూప సౌందర్యం.. రామప్ప సొంతం. భరతనాట్య శాస్త్రమంతా మూర్తీభవించినట్టుగా, స్తంభాల మీద, పైకప్పుల మీద కనబడుతుంది. రామప్ప గుడిలోని విగ్రహాలు, స్తంభాలపై ఉన్న శిల్పాలు ముఖ్యంగా దేవాలయ మంటపంపై కోణాల్లో నాలుగు పక్కల అమర్చిన పెద్ద నల్లరాతి నాట్యకత్తెల విగ్రహాలు అతి సుందరమైనవి. ఆ విగ్రహాల సొమ్ముల అలంకరణలు, వాటి త్రిభంగీ నాట్యభంగిమలు శిల్పకారులనే సమ్మోహితుల్ని చేస్తున్నాయి. దేవాలయంలోని స్తంభాలపై చెక్కిన నాట్యభంగిమలు, మృదంగాది వాద్యములు, అనేక రకాలైన వాద్యముల రేఖలు చిత్రించి ఉన్నాయి. జాయపసేనాని రచించిన నృత్యరత్నావళిలో ఉదహరించిన నాట్యశిల్పమంతా రామప్ప గుడిలో తొణికిసలాడుతూ, కనువిందు చేస్తూ పర్యాటకుల మనసు దోచుకుంటోంది. ఓ వైపు మదనికలు.. మరోవైపు మనోహర శిల్పాలు రామప్ప ప్రత్యేకత. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఆలయాలన్నిటిలో భిన్నంగా ఇక్కడ ఆనాడే అపురూప సౌందర్యరాశులకు ప్రాణం పోశారు. ఆలయమంతా ఆధ్యాత్మికత పరిమణాలే ఉన్నా.. రంగ మండల స్తంభాలు, దూలాల మధ్యన వెలుపల రెండు వైపులా ఏటవాలుగా కొలువుదీరిన నాగిని, మదనిక శిల్పాలు ఆలయాన్ని విభిన్న కళాకృతుల సమ్మేళనంగా మార్చేశాయి. మరికొద్ది రోజుల్లో ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడుతున్న పలు దేశాల సుందరీమణులు ఈనెల 14న రామప్పకు రానున్నారు. ఈ నేపథ్యంలో మదనికల విగ్రహాల గురించి..





### నాట్య భంగిమ

కాకతీయులకు ఇష్టమైన నాట్యం పేరిణి. అందులో భాగంగానే నాట్యభంగిమను మల్చడం జరిగింది. నాట్యంలో రెండు వేళ్లతో మెడలోని హారాన్ని సపోర్టుగా చేస్తూ నాట్యం చేస్తున్నట్టు చూపెట్టాడు శిల్పి. నాట్య భంగిమపైన మనం గమనించినట్లయితే కుడిచేతి వేలు మొలకలుగాని, గోర్లుగాని మనకు స్పష్టంగా కనిపిస్తాయి. మనం ఈనాడు అనుకుంటున్న లాంగ్ నెయిల్స్(గోర్లు పెంచుకోవడం) ఆనాడే ఈ శిల్పంలో కనిపిస్తున్నాయి.

### ట్రైబల్ లేడీగా శిల్పం నైపుణ్యత

ఇక్కడ కూడా ఒక ట్రైబల్ లేడీగా చూపెట్టాడు. చేతిలో బాణం, పైన చూస్తే అడవిలో ఉన్నట్టు తీగలవలె అల్లినట్టుగా పర్యాటకులకు కనిపిస్తోంది. ఈ శిల్పంలో ఆమె వేటకు వెళ్లి అలసటతో ఓ చెట్టుకింద సేద తీరుతున్నట్టుగా శిల్పి అద్భుతంగా చెక్కాడు. శిల్పంలో గొప్పతనమేంటని పరిశీలిస్తే బొటనవేలికి రెండోవేలికి మధ్యలో ఖాళీ భాగం ఇవ్వడంతోపాటు రెండో వేలికి మట్టెలు కూడా కనిపించాయి.

### రాగిని

రాగిని కాళ్లకు చూసినట్లయితే ఈనాడు మనం ఫ్యాషన్ అనుకున్న హైహీల్స్ (ఎత్తు మడమల చెప్పులు) 800 సంవత్సరాల క్రితమే మనకు ఇక్కడ దర్శనమిచ్చాయి. ఇప్పటి ఎత్తు మడమల చెప్పులు ఒకవైపు ఎత్తుగా ఉంటాయి కానీ, ఆనాడు రెండువైపులా వెనుక, ముందు ఎత్తుగా ఉన్నాయి. రామప్ప దేవాలయంలో ప్రతీది కూడా నేడు మనం ఫ్యాషన్ అనుకుంటున్న హైహీల్స్ చెప్పులే కానీ పెద్దపెద్ద చెవిదుద్దులు, కొప్పులు, మినీ స్కట్స్ మొదలైనవి పర్యాటకులకు దర్శనమిస్తున్నాయి. ఈ మదనిక శిల్పాల్లో సంస్కృతి, సంప్రదాయాలు మనకు దర్శనమిస్తున్నాయి.

### నాగిణి (విషకన్య)..

పాము పడగలపై నాట్యం చేస్తున్నట్లుగా కాళ్లకింద ఒక పాము, పాములనే ఆభరణలుగా, వస్త్రాలుగా ధరించినట్టుగా శిల్పి అద్భుతంగా మలిచాడు. మనం కనుక నిశితంగా పరిశీలిస్తే ఆమె కాలు కింద ఒక పాము కనబడుతుంది. ఆమె ఛాతిభాగంలో ఒకపాము పడగ ఆభరణంగా, ఇంకా ఆమె కాళ్ల కింద భాగంలో తొడలపై ఒక పాము పడగా కనిపిస్తోంది. నాగిణి నాట్యకారిణి శిల్ప అందానికి ముగ్ధుడై ఒక నిజాం ప్రభుత్వ అధికారి సుమారు 100ఏళ్ల క్రితం శిల్పాన్ని తన ఇంట్లో పెట్టుకున్నాడట. పీడకలలు రావడంతో తిరిగి యథాస్థానంలో 17వశతాబ్దంలోనే రామప్పలో పెట్టినట్టు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

### పాపిట బిళ్లల భంగిమ

ఈనాడు గుజరాత్, రాజస్థాన్ వాళ్ల ఉపయోగిస్తున్న పాపిట బిళ్లల సంస్కృతి ఆనాడే అంటే సుమారు 800ఏళ్లక్రితమే ఈశిల్పంలో కనిపిస్తుంది. శిల్పంలో పాపిటబిళ్లలను పాకెట్లో పెద్ద చక్రంలా కనిపించేలా పర్యాటకులను ఆకర్షించేలా శిల్పి అందంగా చెక్కడంలో ఇది ఒక భాగమే.

### సర్కస్ లేడీ, జిమ్నాస్టిక్ నాట్య భంగిమ

ఇప్పుడు ఎలా అయితే పొట్టచేత పట్టుకుని వీధుల వెంట తిరిగే దొమ్మరులు పూట గడిపేందు కోసం సర్కస్ లాంటి ఫీట్లు చేస్తూ పొట్టపోసుకుంటున్నారో ఆనాడే ఇక్కడ ఈశిల్ప భంగిమలో కనిపించేలా చెక్కాడు శిల్పి. ఆభంగిమలో ఇరువైపులా ఒక మనిషి మీద ఒకరు ఎక్కి నాట్యం చేస్తున్నట్లుగా మధ్యలో కర్రసాము చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఇప్పుడు జిమ్నాస్టిక్, కర్రసాము అని ఎలా అనుకుంటున్నామో 800ఏళ్లక్రితమే ఇక్కడ కనిపిస్తుంది.



ఇటీవల రామప్పను సందర్శించిన మిస్ ఇండియా నందిని గుప్తా

### రాతి నుంచి నీడ

12 మొదటి శిల్పాల్లో ఈశిల్పంలో ఒక అద్భుతమైన ఆకర్షణ కనిపిస్తుంది. పర్యాటకులు ఈ శిల్పాన్ని చూస్తూ సూర్యరశ్మి వల్ల ఈశిల్పం హారంనీడ అనేది కనిపిస్తుంది అనుకుంటే పొరపాటే. ఎందుకంటే హారం నీడ అనేది ఆ శిల్పి చెక్కిన పనితీరుకు నిదర్శనం. ఆమె మెడలో ధరించిన హారం నీడ తన పొట్టపై పడుతున్నట్లుగా కనిపించడం ఈభంగిమ ప్రత్యేకత. సూర్యోదయం మొదలుకుని సూర్యాస్తమయం వరకు ఈ నీడ ఇలానే కనిపిస్తుంది.

### సాధారణ నృత్యం

పేరిణి నృత్య భంగిమల్లో ఒకటైన సాధారణ భంగిమ ఆకారంలో కనిపిస్తుంది. ఈశిల్పంలో ఎలాంటి ఆహాభావాలు లేకుండా ఒక సాధారణ లేడీలా నాట్యం చేస్తుందో అలా మనకు దర్శనమివ్వడం ఈశిల్పంలోని ప్రత్యేక ఆకర్షణ.

### కోతి చిలిపి చేష్టలు

12మదనిక శిల్పాల్లో కొద్దిగా పెద్దదిగా కనిపిస్తుంది. శిల్పి కోతి యొక్క చిలిపి చేష్టలను ఇక్కడ చూపెట్టడం జరిగింది. కోతి అక్కడ ఉన్న మదనిక శిల్పం యొక్క చీరను లాగుతున్నట్లుగా చూపెట్టాడు. ఒకచేతిలో తన మానాన్ని కాపాడు కుంటూ మరో చేతితో కోతిని కొడుతున్నట్లుగా శిల్పంలో కనిపిస్తుంది. కోతిని కొట్టేటప్పుడు కూడా తన కళ్లల్లో రౌద్రం కనిపించేలా శిల్పి చెక్కిన తీరు పర్యాటకులకు ఔరా అనిపిస్తుంది.

### కోయ స్త్రీ

ఈ మదనిక శిల్పాల్లో అప్పుడున్నటువంటి అడవి చరిత్ర కళ్లకుకట్టినట్లుగా ఈ కోయ స్త్రీ భంగిమ మనకు కనిపిస్తుంది. ఆనాడు అడవి ప్రాంతంలో ఎలా వెళ్లాలి అనే అంశాన్ని ఈ భంగిమ ద్వారా చూపెట్టారు. ఈమె చేతిలో ధనస్సు, కోయ వేషధారణ ఇంకా క్షుణ్ణంగా పరిశీలిస్తే తలపై నెమలిపించం కూడా కనిపిస్తుంది. ఇక్కడ ఈ శిల్పంలో చూపిన అంశం ఏంటంటే ఈమె వేటకు వెళ్లినట్లుగా, వేటకు వెళ్లినప్పుడు ఆమె అరికాలు పాదంలో ముల్లు గుచ్చితే ఆ ముల్లును నూతన సేవకుడు తీస్తున్నట్లుగా చూపెట్టాడు శిల్పి. ఇందులో ప్రత్యేకత ఏమిటని గ్రహిస్తే ముల్లు గుచ్చిన చోట వాపును కూడా చూపెట్టడం శిల్పి గొప్పతనంగా చెప్పవచ్చు. అయితే అన్ని శిల్పాల్లోకల్లా ఈశిల్పం చిన్నదిగా ఉంటుందట.

### రూపం కోల్పోని శిల్పం

అందాల 12 మొదటి శిల్పాల్లో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్న శిల్పం ఇదే. ఈశిల్పంలో ఉన్న ప్రత్యేకత ఒక కాలి బొటనవేలు మిగతా నాలుగు వేళ్లను వెనక్కి మలిచి నాట్యం చేస్తున్నట్లుగా శిల్పి చెక్కిన తీరు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. మొహంలో చిరునవ్వుతో నాట్యం చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఒక శిల్పంలో రౌద్రం, ఒకదాంట్లో లాస్యం, మరో శిల్పంలో వేట ఇలా ప్రతి శిల్పానికి ఒక ప్రత్యేకత చూపించి పర్యాటకులను ఆకట్టుకునేలా రామప్ప మదనికలు దర్శనమిస్తున్నాయి.

### రౌద్రరూపంలో నాట్య భంగిమ

నవరసాల్లో భాగమే ఈ రౌద్రనాట్య భంగిమ. ఈ భంగిమను పరిశీలించినట్లయితే ఆమె ముఖ కవళికలు కానీ, ఆమె నాట్యం చేస్తున్నప్పుడు ఒకవైపు ఒరిగినప్పుడు పొట్టపై పడుతున్న మడతలు కానీ, కళ్లలో రౌద్రం కానీ, కాలు వంచినప్పుడు మోకాలు చిప్ప కాని శిల్పి చెక్కిన తీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు ఈ భంగిమ.



రామప్ప ఆలయంలోని మదనిక శిల్పాలు

# నాడు కీకారణ్యం.. నేడు రమణీయ పర్వం

### కాళేశ్వరం చరిత్రకు కాలమే సాక్షి

మహదేవపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : త్రేతా యుగంలో దండకారణ్యంలో రాముడు సంచరించి ముక్తీశ్వరుడిని పూజించిన రామక్షేత్రం కాళేశ్వరం. ఆనాటి నుంచి దట్టమైన అడవులతో రాకపోకలు లేని సమయంలో వణ్యప్రాణుల భయంతో ఘోర అరణ్యంగా ఉన్న కాళేశ్వరంలో తినడానికి తిండి లేని పరిస్థితుల్లో క్షేత్రవాసులు అనేక ఇబ్బందులు పడి హైదరాబాద్, ముంబై, పుణె, నాగపూర్ తదితర పట్టణ ప్రాంతాలకు జీవనోపాధి కోసం ప్రవాసం వెళ్లారు. దానికి సాక్ష్యంగా గ్రామస్థులు 'కాళేశ్వరం మహాక్షేత్రం.. కట్టి పిడక సురక్షితం. అన్న వస్త్రం ద్వయం నాస్తి.. శీఘ్రమే శివ దర్శనం..' అని ఒక శ్లోకం చెప్పేవారు. దీని అర్థం ఏంటంటే.. పూర్వం కట్టుకోవడానికి దుస్తులు, తినడానికి తిండి లేని క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయట. క్షామం వచ్చినప్పుడు గౌతమ మహర్షి ఇక్కడ దేశ ప్రజలకు అన్నదానం చేశాడని గోదావరి చరిత్ర చెబుతోంది. గోహత్యా పాతకాన్ని పోగొట్టుకోవడానికి గౌతమ ముని కోసం కాళేశ్వరం వరకు వచ్చింది గోదావరి. నాడు బాధలో ఉన్న వారికి తిండి పెట్టిన ప్రాంతమే ఘోర అరణ్యంగా మారి తిండి బట్ట లభించని పరిస్థితులు ఏర్పడ్డాయి. అలా కొన్ని శతాబ్దాలు గడిచాయి. ఆ తర్వాత కాళేశ్వరానికి మహర్దశ వచ్చింది. 1965లో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహరావు ఈ ప్రాంతంలో మంథని నియోజకవర్గం నుంచి మూడు సార్లు గెలిచి కాళేశ్వర క్షేత్ర జీర్ణోద్ధరణ చేయడానికి నిశ్చయించుకున్నారు. దానికి యోజనాలు తయారు చేశారు. కానీ అనివార్య కారణాలు, వ్యక్తిగత విషయాల వల్ల ఆయన చేలేకపోయారు. అదే ప్రణాళికను జగద్గురు ఆదేశానుసారం అప్పటి రాష్ట్ర మంత్రి జువ్వాడి చొక్కారావు 1976 మార్చి నెలలో కాళేశ్వరం వచ్చి ఈ క్షేత్ర పునరుద్ధరణకు కంకణం కట్టుకున్నారు. మొదటగా రెండు బస్సులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. ముఖ్య ఆలయంలో మహన్యాస పూర్వకంగా ప్రతిరోజు ఏకాదశ రుద్రాభిషేకం జరిగే విధంగా పండితులను నియమించారు. ఆంధ్రపత్రిక ద్వారా చందాలు వసూలు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. అప్పుడు కాళేశ్వరంలో వివిధ దేవాలయాలు ఉండేవి. బిందు మాధవ స్వామి, బాల రాజేశ్వరస్వామి కాశీ విశ్వేశ్వరస్వామి అన్నపూర్ణ, సదాపూర్ణ, సరస్వతి, సావిత్రి, గాయత్రి, బ్రహ్మ దేవాలయం, వేంకటేశ్వరాలయం, రామాలయం, సంగమేశ్వరాలయం, వీరభద్రాలయం, జయ విజయులు, సూర్యనారాయణమూర్తి దేవాలయాలు, అహల్య గౌతముడు, సనకసనందన, సనత్కుమారులు, నారదుడు, కాల భైరవుడు, నీలకంఠేశ్వరుడు, సురభాండేశ్వరుడు, రాతి ధ్వజస్తంభం, దానిపైన నంది, దేవాలయానికి కిలోమీటరు దూరంలో ఆది ముక్తీశ్వర, మధ్య ముక్తీశ్వర, వీరంజనేయ, చంద్రశేఖర, సోమశేఖర, నర్సింహేశ్వర దేవాలయాలు ఉండేవి. ముందు భేరిశాల అనే ప్రవేశ ద్వారం ఉండేది. ఆ భేరీశాలలో సుమారు 20 శిలా



ఆనాటి కాళేశ్వరాలయం


శాసనాలు రాసి ఉండేవి. జీర్ణోద్ధరణ సమయంలో అవి అంతరించిపోయాయి.

### అభివృద్ధి మొదలైందిలా..

చొక్కారావుతో పాటు ఆంధ్రప్రత్రిక సంపాదకులు వివిధ ఆధ్యాత్మిక వేత్తలు పీవీ నరసింహారావు మొదలైన నాయకులు, నటరాజన్, జీవీ రావు, కే ఎస్ శర్మ, కమలేశ్వర్‌రావు, కలెక్టర్లు జీర్ణోద్ధారణ కోసం కాళేశ్వరం వచ్చి అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. మొదటగా విజయగణపతి దేవాలయానికి శిలా స్థాపన చేయించి విజయగణపతి దేవాలయాన్ని నిర్మించి డిసెంబరు 1976లో అభినవ విద్యా తీర్థ స్వామి, భారతి తీర్థ స్వామి, జగద్గురు శంకాచార్యులు వచ్చి కరకములతో ప్రతిష్ఠలు జరిపించారు. ఆ తర్వాత జీర్ణమైన దేవాలయాలను తొలగించి నూతన నిర్మాణాలు చేపట్టారు. 1980 నుంచి 1981లో మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించారు. వివిధ ప్రాంతల నుంచి అనేక బస్సులు వేయించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచారు. 1982లో ఫిబ్రవరి 9వ తేదీన శృంగేరి జగద్గురు విద్యాతీర్థ స్వామి భారతీ తీర్థ స్వామి చేతుల మీదుగా రాజగోపురం, విమాన గోపురంపై కలశస్థాపన ప్రతిష్ఠలు, మహా కుంభాభిషేకాలు నిర్వహించారు. అప్పటి నుంచి అభివృద్ధి ప్రవర్ధమానమై సంపూర్ణమైన రమణీయ దర్శనీయ స్థలంగా విరాజిల్లుతోంది. అభివృద్ధిలో భాగంగా ఉమ్మడి ఏపీ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు క్షేత్ర అభివృద్ధిలో పాలు పంచుకున్నారు. కాళేశ్వరంలో ఆది ముక్తేశ్వరాలయం, సంగమేశ్వరాలయం, దత్తాత్రేయాలయం తదితర ఆయన చేతుల మీదుగా జరిగాయి. ప్రతిష్ఠాపన జరిగింది. ప్రస్తుతం శ్రీపాద రావు కుమారుడు ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాలంలో దేవాలయంలో అభివృద్ధి పనులు సాధించారు. గతంలో వేములవాడ, తిరుపతి దేవస్థానం కట్టించిన గదులు మాత్రమే ఉండగా ఇంకా ఎన్నో వసతి సౌకర్యాలు కల్పించారు. హోమ మండపం, వంటశాల ప్రసాదాల వితరణ కేంద్రాలు ఏర్పాటు చేయించారు. ఇలా పరిపూర్ణమైన అభివృద్ధి పనులను చేయించడమే కాకుండా ఇప్పుడు ప్రస్తుతం రూ.25కోట్లతో ఆలయ ప్రాంతం చుట్టూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్రివేణి సంగమం వద్ద సరస్వతీ మాత విగ్రహంతో పాటు పుణ్య స్నాన ఘట్టాలు, పుష్కర ఘాట్లు, పలు అభివృద్ధిపనులు జరుగుతున్నాయి.

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, కర్ణాటక, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ నుంచి లక్షలాది భక్తులు విచ్చేసి వారి మొక్కులు తీర్చుకుంటున్నారు. దేశ విదేశాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. నాడు విలువ లేని భూములకు నేడు రూ.కోట్లు పలుకుతున్నాయి. ఆనాటి గుడిసెలు నేడు భవంతు లుగా మారాయి. గతంలో ఉపాధి కోసం వలస వెళ్లిన వారంతా తిరిగి కాళేశ్వరం చేరుకుని స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. హైదరాబాద్ లో గజానికి రూ.35వేలు పలుకుతుండగా కాళేశ్వరంలో గజం రూ.70 వేలు పలకడం విశేషం.

### ఆరు సరస్వతీ పుష్కరాలు చూశా : సుశీలమ్మ



నా వయస్సు తొంభై సంవత్సరలు, మా ఊరు కాళేశ్వరం. మా దగ్గర మూడు నదులు ప్రాణహిత, గోదావరి, సరస్వతి కలుస్తాయి. సంగమ తీర్థంలో స్నానం చేస్తే పుణ్యం. అన్ని నదులకు 12ఏళ్ల కోసారి పుష్కరాలు వస్తే.. మా దగ్గర మూడు సార్లు వస్తాయి. ఇప్పటి వరకు ఆరు సార్లు సరస్వతి పుష్కరాలు చూశా. నాకు తొమ్మిదేండ్ల నాడే పెండ్లయింది. మా అత్తగారు చెన్నూరు. నా భర్త 57 ఏళ్ల క్రితమే పోయాడు. అప్పడిదాక పండుగలకు, మంచి రోజుల్లో ఉత్తర వాహిని గోదావరిలో స్నానం చేసేవాళ్లం. తర్వాత కాళేశ్వరంలో ప్రతీ రోజు గంగా స్నానం చేసి లింగ దర్శనం చేసుకోవడం అలవాటు. 2023లో అనారోగ్యం బారిన పడ్డా. ఇప్పుడు చేతగావట్లే. అయినా పండుగలకు గంగకు పోయి స్నానం చేస్త. మా చిన్నప్పుడు బస్సులు, కరెంటు లేకుండే. ఎడ్లబండ్ల మీద యాత్రికులు వచ్చేవారు. ఒక్కో నదికి ఆరేసి పుష్కరాల్లో మొత్తం పద్దెనిమిది పుష్కరాల్లో నదీ స్నానం చేశా. 2022 ప్రాణహిత పుష్కరాల్లో అర్జున్ గట్టు దగ్గర స్నానం చేశా.





మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం

- 50ఎకరాల విస్తీర్ణంలో 15ఏళ్ల క్రితం ఏర్పాటు
- జోనల్ స్థాయిలో ఏడు సార్లు ప్రశంస పత్రాలు
- ఏటా 85కు పైగా శిక్షణ శిబిరాలు
- మెళకువలు నేర్చిన రైతులకు జాతీయ స్థాయిలో అవార్డులు

# కృషి విజ్ఞాన కేంద్రం.. రైతుల నేస్తం

## ఎన్నో శిక్షణలు మరెన్నో అవగాహన సదస్సులు

మామునూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆధునికతను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ.. సాగుబడిలో అధిక దిగుబడిని సాధించేలా.. రైతులకు సరైన సలహాలు, సూచనలే కాదు సేవలను అందించాలనే సంకల్పంతో ఏర్పాటైన కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే).. అన్నదాతలకు నేస్తంగా నిలుస్తోంది వరంగల్ కృషి విజ్ఞాన కేంద్రం. 15 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ కేవీకే ద్వారా ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులకు వివిధ పంటలపై శిక్షణ తరగతులు, ఆధునిక వ్యవసాయ రంగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కేంద్రం ద్వారా మెళకువలు నేర్చుకున్న రైతులు జాతీయ స్థాయిలో పలు అవార్డులు అందుకోగా.. పలువురు శాస్త్రవేత్తలు ప్రశంసలు అందుకున్నారు.

### 50ఎకరాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు..

వరంగల్ మామునూరులో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం 50ఎకరాల స్థలాన్ని కేటాయించి అందులో 2010లో కృషి విజ్ఞాన కేంద్ర భవనం నిర్మించారు. దాంతో పాటు రైతు వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. భారత పరిశోధన మండలి (ఐసీఏఆర్) ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకువిశేష సేవలందిస్తోంది. ఈ కేంద్రం ద్వారా రైతులకు ఆధునిక పద్ధతులపై శిక్షణ వాతావరణం పద్ధతులు, చీడపీడలు, నివారణ, నూతన యాజమాన్య పద్ధతులను వివరించడం లాంటివి శాస్త్రవేత్తలు చేస్తున్నారు. సంప్రదాయ సాగుతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆధునిక సేద్యంతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి కొత్త పరిశోధనలను రైతులకు చేరువ చేయనున్నారు. శిక్షణ తరగతుల్లో సాంకేతిక అభివృద్ధితో రైతులు ముందుకు నడిచేందుకు అండగా నిలుస్తున్నారు. సేంద్రియ వ్యవసాయం, జీవన ఎరువులు, మేలు జాతి పశువులు, వంగడాల ఏర్పాటు, చేపపిల్లల పెంపకం, పూలసాగు, తీగజాతి కురగాయల సాగుకు శాశ్వత పందిర్ల ఏర్పాట్లు, భూమిలో నత్రజని శాతంపై పరిశోధన చేస్తున్నారు. వ్యవసాయ పని అనుభవ శిక్షణలో భాగంగా ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో వందలాది మంది రైతులను సేంద్రియ సాగుదిశగా మళ్లించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని అనేక దత్తత గ్రామాలను ఏర్పాటు చేసుకొని రైతులకు సాగు సేవలందిస్తున్నారు. పలు విభాగాల్లో ఏడుగురు శాస్త్రవేత్తలు విధులు నిర్వహిస్తున్నారు.



జాతీయ అవార్డు అందుకుంటున్న ఉత్తమ రైతు

### కేవికేను సద్వినియోగం చేసుకోవాలి



కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దీని ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ సాగుపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 15వేల మంది రైతులకు పైగా శిక్షణలు ఇచ్చాం.వారి సందేహాలను నివృత్తి చేసేందుకు గ్రామాల్లో పర్యటిస్తూ పంటలను పరిశీలిస్తున్నాం. రైతులు వ్యవసాయ రంగంలో నష్టపోకుండా అధిక దిగుబడులు సాధించే దిశగా కృషి చేస్తున్నాం.

- డా.రాజన్న, కేవికే కోఆర్డినేటర్

### కృషి విజ్ఞాన కేంద్రంలో ఎంతో నేర్చుకున్న



కేవీకే శాస్త్రవేత్తలు మాకు చాలా బాగా శిక్షణలు ఇచ్చారు. కృషి విజ్ఞానం కేంద్రం ద్వారా చాలా నేర్చుకున్నాం. సేంద్రియ పంటలతో పాటు చేపలు, కోళ్ల పెంపకం చేస్తున్నా. మంచి లభాలను పొందుతున్నా.

- యాకాంబరం, సింగారం

### సుగంధ ద్రవ్యాల పంటలపై మక్కువ



సుగంధ ద్రవ్యాలపై శిక్షణలు ఇవ్వడమే కాక గ్రామాల్లో ఉచితంగా మొక్కల పంపిణీ చేశారు. దాదాపు 100 మంది రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని, ఉద్యానపంటలను సాగు చేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం వారు వాటర్ ప్లాంట్ అందజేశారు.

- వెంకన్న, జయరాం తండా,వరంగల్

## విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జీరో విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం ప్రతీ సర్కిల్‌లో డీఈ టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియ మించామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా వరంగల్ సర్కిల్ ఆధ్వర్యంలో రంగశాయిపేటలో సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు సీఎండీ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. అన్ని శాఖల కన్న విద్యుత్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఉన్న శాఖ అని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌నందించడంలో సిబ్బంది పాత్ర కీలక మన్నారు. సిబ్బంది ఎల్సీ యాప్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

## చీఫ్ నర్సింగ్ ఆఫీసర్‌కు సన్మానం



చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ దయాశీలను సన్మానిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నూతనంగా నియమితులైన దయాశీలను ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ 3194) ఎంజీఎం ఆస్పత్రి నాయకురాళ్లు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలు అందించే విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం ఎంజీఎం బ్రాంచ్ ప్రతినిధులు ప్రీతిసజని, సరళారాణి, సల్మా, అపర్ణ, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## 'డాక్టర్స్ ప్రీమియర్ లీగ్' పోస్టర్ ఆవిష్కరణ



ప్రీమియర్ లీగ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్స్

వరంగల్ మెడికల్, మే 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ డాక్టర్స్ క్రికెట్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా డీపీఎల్ సీజన్ 2 పోస్టర్‌ను సోమవారం ఐఎంఏ హాలులో ఆవిష్కరించారు. ఈ నెల 17 నుంచి 26 వరకు కాకతీయ మెడికల్ కాలేజీ గ్రౌండులో ఫ్లడ్ లైట్ల వెలుగులో పది రోజులు 150 మందికిపైగా డాక్టర్లు 8 టీంలుగా ఏర్పడి 15 మ్యాచ్‌లు ఆడనున్నారు. డాక్టర్స్‌కు ఇదొక పండగ వాతావరణాన్ని కలగజేయడంతోపాటు ఆరోగ్యం కాపాడుకునేందుకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.నాగార్జునరెడ్డి, సెక్రటరి డాక్టర్ అజిత్ మహ్మద్, ఫైనాన్స్ సెక్రటరి డాక్టర్ శిరీష్ కుమార్, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ డాక్టర్ పి.విజయచందర్‌రెడ్డి, డబ్ల్యూడీసీసీ సెక్ర టరి డాక్టర్ రాఘవేంద్ర ప్రదీప్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రసన్న, ట్రెజరర్ డాక్టర్ నదీం, ఈసీ మెంబర్ డాక్టర్ నరేశ్ కుమార్, సీనియర్ ఐఎంఏ నాయ కులు డాక్టర్ హెచ్.సంధ్యారాణి, డాక్టర్ జనార్దన్, డాక్టర్ బందెల మోహన్‌రావు, డాక్టర్ కూరపాటి రమేశ్, నిర్వాహకులు డాక్టర్ దిలీప్, డాక్టర్ సంపత్ పాల్గొన్నారు.

## బల్దియా వెహికిల్ షెడ్ తనిఖీ



బల్దియా వెహికల్ షెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాల సముద్రంలోని బల్దియా నిర్వహిస్తున్న వెహికల్ షెడ్డును సోమవారం నగర మేయర్ గుండు సుధారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత నెల ఆంధ్రజ్యోతి మినిలో 'పాడైతే మూలకే, బల్దియా వాహనాల మరమ్మతుల్లో జాప్యం ' అనే కథనాన్ని ప్రచురించడం జరిగింది. దీంతో స్పందించిన నగర మేయర్ గుండు సుధారాణి షెడ్డును పరిశీలించారు. వాహనాల మరమ్మతులకు సంబంధించిన సమాచారంతో పాటు వాహనాల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ మాధవీలత, డీఈ శివానంద్, ఏఈలు సంతోష్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లు పరిష్కరించకుంటే రేపటి నుంచి సమ్మె

### వరంగల్ ఆర్టీసీ రీజినల్ జేఏసీ నాయకుడు యాకస్వామి

హనుమకొండ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించకుంటే ఈ నెల 7 నుంచి సమ్మె చేపడుతామని వరంగల్ రీజినల్ జేఏసీ నాయకుడు సీహెచ్ . యాకస్వామి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో సోమవారం హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించి, 2021 వేతన సవరణ చేసి 21 డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో సమ్మెకు దిగుతామన్నారు. ఆదివారం జరిగిన బస్ భవన్ వద్ద కార్మిక కవాత్‌లో ఆర్టీసీ కార్మికులు వరంగల్ నుంచి పాల్గొన్నట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులను వెంటనే ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.

## రేపు బ్రహ్మంగారి ఆలయంలో గురుపూజా మహోత్సవం

వరంగల్ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారడోజు సదానందాచారి, ప్రధాన కార్యదర్శి జల్లిపల్లి పెంటయ్యాచారి తెలిపారు. ఈ మహోత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆత్మీయ అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, విశిష్ట అతిథులుగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి హాజరవుతారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి

మడికొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పిస్తూ మడికొండలో సోమవారం రాష్ట్ర ఉద్యోగ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మెట్టుగుట్ట ద్వారం వద్ద నుంచి చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పెట్టెం సాంబయ్య, కార్యదర్శి బొప్పరాజు అశోక్, కోశాధికారి మహేశ్వరం సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన వృద్ధుడు



వెంకటేశ్వర్లు (ఫైల్)

కాజీపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడి కాజీపేటలోని తన కూతురు ఇంటికి వచ్చి తప్పిపోయాడు. కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండోజు వెంకటేశ్వర్లు (70) 20 రోజుల క్రితం కాజీపేట దర్గాలోని తన కూతురు ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి సోమవారం రాత్రి వరకు తిరిగి రాలేదు. ఇతను గతంలోనూ ఇలాగే ఇంటి నుంచి వెళ్లాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్ స్టేషన్, 87125 84495 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# వినతులు పెండింగ్‌లో లేకుండా చూడాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య



బాధితురాలి వినతిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో వినతులు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజలు 143 వినతులు సమర్పించారు. ఉదయం 10:30 గంటల నుండి ప్రారంభమైన ప్రజావాణి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కొనసాగింది. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బాధితుల నుండి వినతులు స్వీకరించి సంబంధిత అధికారిని పిలిచి సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. గత రెండు వారాలు వివిధ కారణాల వల్ల ప్రజావాణి రద్దు కావడంతో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పెద్ద సంఖ్యలో బాధితులు రావడంతో కలెక్టరేట్ ప్రాంగణం ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజావాణికి వివిధ సమస్యలు పరిష్కరించాలని ప్రజల నుంచి వచ్చిన వినతులు పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మేన శ్రీను పాల్గొన్నారు.

జిల్లాలో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చి నివసిస్తున్న రోహింగ్యాలను, ఇతర విదేశీ పౌరులను గుర్తించి వెంటనే వారి వారి దేశాలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా బీజేపీ నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా బీజేపీ నాయకులు ఉన్నారు.

### సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్ : ప్రజావాణిలో అందిన వినతులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతులు స్వీకరించిన అనంతరం అధికారులతో మాట్లాడారు. సాధ్యమైనంత మేరకు వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 119 వినతులు అందగా శాఖల వారీగా వాటిని ఎండార్స్ చేశారు. రెవెన్యూ శాఖకు 35, హౌసింగ్ పీడీ 42, వివిధ శాఖలకు సంబంధించిన వినతులు సైతం అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, హౌసింగ్ పీడీ గణపతి, ఎస్సీ కార్పొరేషన్ డీఈ సురేశ్, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీవో నీరజ, డీపీఓ కల్పన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ గతిని మార్చిన సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్

### సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి



కార్ల్ మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హనుమకొండ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ గతిని మార్చిన సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్ అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకట్ ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ 207వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకుడు జి.ప్రభాకర్‌రెడ్డి హాజరై కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సూర్నపు సోమయ్య, బొట్ల చక్రపాణి, రాగుల రమేష్, వాంకుడోత్ వీరన్న, జి. రాములు, డి. తిరుపతి, కె. లింగయ్య, డి. భానునాయక్ పాల్గొన్నారు.

● న్యూశాయంపేట, మే5(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం మార్క్సిజం సిద్ధాంత రూపకర్త కారల్ మార్క్స్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కారల్‌మార్క్స్ చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ

### సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి పిలుపు



రిసోర్స్ పర్సన్స్ శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

హనుమకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఈ వేసవి సెలవుల్లో అన్ని స్థాయిల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పా ట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి వాసంతి తెపారు. సోమవారం కాజీపేట ఫాతిమా నగర్ బాలవికాసలో జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్‌కు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వాసంతి మాట్లాడుతూ గణితం, సాంఘిక శాస్త్రంలో రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాలు కాజీపేటలో నిర్వహించడం గర్వకారణం అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో చర్చించిన విషయాలను జిల్లా స్థాయిలో జరిగే రిసోర్స్ పర్సన్స్ శిక్షణ కార్యక్ర మం నిర్వహిం చడంలో ఉపయోగపడుతుందన్నారు. కనుక ఇందులో చురుకుగా పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అభ్యసన ఫలితాలు సాధించేందుకు, అలాగే సమర్థవంతంగా తరగతిగదుల కార్యకలాపాల కోసం ఉన్నత పాఠశాలలకు సరఫరా చేసిన ఇంటర్ ఆక్టివ్ ప్లాట్ ఫామ్ ప్యానెల్ బోర్డులను బోధనలో విరివిగా ఉపయోగించాలని కోరారు. బోధనలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను సమ్మిళితం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి గణపతి శర్మ, ఎల్లయ్య, స్టేట్ రిసోర్స్ పర్సన్ రమేష్, రామయ్య, సారంగపాణి, హనుమకొండ జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, కాజీపేట మండల విద్యాశాఖ అధికారి మనోజ్ కుమా ర్ పాల్గొన్నారు.

## అక్రమ వలసదారులను తరిమేయండి

### సీపీకి బీజేపీ నాయకుల వినతి

వరంగల్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి) : కమిషనరేట్ పరిధిలో అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశ్ నుంచి వచ్చిన రోహింగ్యాలతో పాటు ఇతర దేశస్తులను, పాకిస్థాన్ జాతీయులను తక్షణమే వెనక్కి పంపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయాలని సీపీని కోరారు. సీపీని కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు రావు పద్మరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు.



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి

(5వ పేజీ తరువాయి)

ప్రసన్నరాణి, రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, పన్నుల అధికారి వై. రామకృష్ణ, పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ - 28, హెల్త్, శానిటేషన్ - 11, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 9, టౌన్‌ప్లానింగ్ - 44, తాగునీటి సరఫరా - 7, హార్టికల్చర్ - 2 ఇలా మొత్తం 101 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

- కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దుచే యాలని, అప్పుడే దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులను న్యాయం జరుగు తుందని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.
- గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపెల్లి శివారు రాఘవేంద్రనగర్, ఆ ర్టీసీ కాలనీలలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, బల్దియా ఉన్నతాధికారు లు స్పందించి రోడ్లు, డ్రైనేజీలు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
- కాజీపేట ఎన్ఐటీ సమీపంలోని దేవినగర కాలనీలో చాలా రోజులుగా మంచి నీటి సరఫరా కావడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భద్రకాళి నగర్‌లో రోడ్డు పక్కన వ్యవ సాయ భూమిలో నిరుపయోగంగా బావి ఉందనీ, ఈ బావిలో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. గతంలో రెండు సార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత పట్టించుకోవడం లేదని వెల్లడించారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

వరంగల్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది ఆకస్మికంగా మరణించిన 2013 బ్యాచ్‌కు చెందిన ఏ. ఆర్ కానిస్టేబుల్ బండారి కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులకు వరంగల్ కమిషనరేట్, అదిలాబాద్‌కు చెందిన బ్యాచ్‌మెట్స్ రూ. 2,87,000 ఆర్థిక సహాయం చేశారు. ఆ మొత్తాని డిపాజిట్ రూపంలో సీపీ చేతుల మీదుగా సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేశ్, ఆర్ఐ శ్రీనువాస్, కానిస్టేబుల్స్ శివ, రాజు పాల్గొన్నారు

## ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రమేష్



వడ్డెపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): రుద్రమదేవి ఆటో యూనియన్ హనుమకొండ బస్టాండ్ కమిటీని సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండా రమేష్, ప్రధాన కార్యదర్శిగా మాడిశెట్టి దేవేందర్, కోశాధికారిగా ఎన్నంపెల్లి వెంకటమోహన్, ఉపాధ్యక్షుడిగా వడ్లకొండ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని గుండా రమేష్ పేర్కొన్నారు.

## పుస్తక విక్రయ దారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్

బాలసముద్రం, మే 5 (ఆంధ్రజ్యోతి): పుస్తక విక్రయదారుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కాజీపేట లక్ష్మీ బుక్ సెంటర్‌కు చెందిన జోగు శ్రీధర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా అదాలత్ సెంటర్ సాయి బుక్ స్టాల్‌కు చెందిన అవిర్నేని సతీష్‌రావు, బాలసముద్రంలోని మెగా బుక్‌స్టాల్‌కు చెందిన సత్యనారాయణ రెడ్డి, హనుమకొండ చౌరస్తా సామిక్ బుక్ స్టాల్‌కు చెందిన గంప సందీప్, నయీంనగర్ పూర్ణిమ బుక్‌స్టాల్‌కు చెందిన భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## దాడి చేసిన వ్యక్తిపై కేసు

మడికొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని శ్రీరామ బార్ వెయిటర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పెగడ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి మడికొండ ఎస్సీ కాలనీకి చెందిన వస్కుల కిరణ్ బార్‌లో బీర్ బాటిల్ పగులగొట్టి గొడవ చేస్తుండగా వెయిటర్ పాండవుల శశివర్ధన్ ప్రశ్నించాడు. దీంతో కిరణ్ పరుష పదజాలంతో దూషించి దాడి చేశాడు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రేపు క్రైస్తవుల శాంతి ర్యాలీ

కాజీపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రిలో మృతి చెందిన బ్రదర్ ప్రవీన్ పగడాల, కశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో మృతుల జ్ఞాపకార్థం బుధవారం ఉదయం 8 గంటలకు శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు క్రిస్టియన్ ఫెలోషిప్ చైర్మన్, బిషప్ డానియేల్, ర్యాలీ కన్వీనర్ రెవరెండ్ కే అశోక్‌పాల్ తెలిపారు. సోమవారం కాజీపేట మీడియా పాయింట్‌లో పాస్టర్లు ర్యాలీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఈ ర్యాలీ హనుమకొండ అంబేద్కర్ విగ్రహం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు సాగుతుందని చెప్పారు.

## లారీ ఢీకొని ఒకరికి గాయాలు



లారీ బైక్‌ను ఢీకొన్న దృశ్యం

మడికొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం జానకీపురం గ్రామానికి చెందిన ఓ పత్రిక విలేకరి పెసరు ఆగయ్య సోమవారం ధర్మసాగర్ నుంచి బైక్‌పై కాజీపేటకు వెళ్తున్నాడు. మడికొండ ఔటర్ రింగ్ రోడ్డు అండర్ పాస్ బ్రిడ్జి దాటుతుండగా టేకులగూడెం వైపు సర్వీస్ రోడ్డు నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టి కొంత దూరం లాక్కెళ్లింది. ప్రమాదంలో ఆగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆగయ్య భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపారు.

## ప్రశాంతంగా పీపీటీ ప్రవేశ పరీక్ష

హనుమకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5,6,7 తరగతుల్లో ప్రవేశానికిగాను ప్రవేశపరీక్ష సోమవారం హనుమకొండ మర్కజి ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా జరిగింది. ఈ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రాలను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు డి. కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలకు, పాక్షిక అనాథ పిల్లలకు, నిరుపేద విద్యార్థులకు ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఉచిత విద్య, ఉచిత హాస్టల్ సౌకర్యం కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. దీని కోసం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫలితాలను వారం రోజుల్లో వెల్లడిస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రవీందర్ రాజు, పెండెం రాజు, తాటికాయల కుమార్, సి సుజన్ ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి సీఎస్ఆర్ మల్లిక్, పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ప్రతినిధి పవన్ కుమార్ పాల్గొన్నారు.

## హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రియదర్శినికి ఘన నివాళి




సంతాప కార్యక్రమంలో మాట్లాడుతున్న హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ

వరంగల్ లీగల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మృతికి హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్లు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం హనుమకొండ బార్ అసోసియేషన్‌లో సంతాప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంపట్ల అవగాహన ఉన్న జడ్జిగా విధి నిర్వహణలో త్వరిత గతిన తీర్పులు వెలువరించే వారని ఆయన అన్నారు. న్యాయవాదిగా పనిచేస్తూ సామాజిక ఉద్యమాల్లో ప్రజల తరుపున పలు పోరాటాలు చేశారని న్యాయవాదులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, హనుమకొండ, వరంగల్ ప్రధాన కార్యదర్శులు కొత్త రవి, డి. రమాకాంత్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు భైరపాక జయాకర్, న్యాయవాదులు కె. నర్సింహరావు, తీగల జీవన్‌గౌడ్, తాటికొండ సదాశివుడు, సంసాని సునిల్, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## లింకేజీ లేకుండా రుణాలివ్వాలి

### డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్

వడ్డెపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకంలో బ్యాంకు లింకేజీ లేకుండా లబ్ధిదారులకు రుణాలివ్వాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ వడ్డెపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువవికాసం పథకానికి సిబిల్ స్కోర్ విధానాన్ని ఎత్తివేయాలన్నారు. సమావేశంలో డీబీఎఫ్ జిల్లా నాయకులు సంపూర్ణ, సురేష్, మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
9
# నవ్య డాక్టర్
మంగళవారం • 6 మే 2025

పారాహుషార్

## 300 గ్రాములు మించితే..

మాంసాహారుల్లో చికెన్‌ను ఇష్టపడని వారు ఉండరు. కొందరికైతే ఆదివారం వచ్చిందంటే చికెన్ లేనిదే ముద్ద దిగదు. అయితే చికెన్ తినడం వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఓ తాజా అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు తెలుసుకుందాం. వయసు, ఆరోగ్యం, వైద్య చరిత్ర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, 19 ఏళ్ల పాటు, నాలుగు వేల మందిపై ఇటలీ పరిశోధకులు చేసిన అధ్యయనంలో పలు విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. వారానికి 300 గ్రాముల కోళ్ల ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణశయాంతర క్యాన్సర్ ముప్పు రెండింతలు ఎక్కువవుతుందని న్యూట్రియంట్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడైంది. ఈ ప్రమాదం మహిళల కంటే పురుషుల్లోనే ఎక్కువని పరిశోధకులు తేల్చారు. అలాగే వారానికి 300 గ్రాములు, అంతకంటే ఎక్కువగా కోళ్ల ఉత్పత్తులు తినే వారిలో మరణాల ముప్పు కూడా 27 శాతం అధికమని గుర్తించారు. చికెన్‌లో మన శరీరానికి అవసరమైన ప్రొటీన్, విటమిన్ బి12, కోలిన్ వంటివి పుష్కలంగా ఉన్నప్పటికీ, చికెన్‌ను వారానికి 100 గ్రాములకు మించకుండా మితంగా తినడం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.



హెల్త్ న్యూస్

## టైప్5 మధుమేహం గురించి విన్నారా?

రక్తంలో ఇన్సులిన్ మోతాదు పెరిగితే, దాన్ని టైప్2 మధుమేహంగా నిర్ధారిస్తారు. మరి ఇన్సులిన్ తగ్గితే? రక్తంలో సరిపడా ఇన్సులిన్ లేని పరిస్థితి, టైప్5 మధుమేహంగా అధికారిక గుర్తింపు పొందింది. మరిన్ని వివరాలు...

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొన్ని దశాబ్దాల క్రితమే పోషకాహార లోపంతో సంబంధమున్న మధుమేహాన్ని గుర్తించడం జరిగింది. ఈ రకమైన మధుమేహం తాజాగా అధికారిక గుర్తింపును దక్కించుకుంది. అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్, ఈ మధుమేహాన్ని టైప్5 మధుమేహంగా వర్గీకరించింది. 70 ఏళ్ల క్రితమే ఈ మధుమేహాన్ని గుర్తించినప్పటికీ ప్రపంచ ఆరోగ్య చర్చల్లో దీన్ని నిర్లక్ష్యం చేయడం జరిగింది. 20వ శతాబ్దంలోనే వెలుగులోకొచ్చిన ఈ పరిస్థితిని టైప్1 లేదా టైప్2 మధుమేహంగా తప్పుగా వర్గీకరించారు. ఈ అసాధారణమైన మధుమేహం, ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికాల్లోని పోషకాహారలోపంతో బాధపడే యువతను పట్టి పీడిస్తున్నట్టు, 160 దేశాల్లోని 250 జాతీయ డయాబెటిక్ అసోసియేషన్లు అంచనా వేసినట్టు అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్ పేర్కొంటోంది. దీర్ఘకాలం పాటు పోషకాహార లోపంతో బాధపడే వారిలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గి టైప్5 మధుమేహం పెరుగుతోంది. ప్రత్యేకించి కౌమార దశలో బయల్పడే ఈ మధుమేహానికి ఒక జన్యులోపమే కారణం. ఈ రకమైన జన్యు ఉత్పరివర్తనం తల్లితండ్రుల నుంచి పిల్లలకు వంశపారంపర్యంగా సంక్రమిస్తూ ఉంటుంది. అయితే టైప్5 మధుమేహానికి ఇటీవలే అధికారిక గుర్తింపు లభించింది కాబట్టి వ్యాధినిర్ధారణ, చికిత్సా విధానాలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి సంబంధించి చేపట్టిన పరిశోధన ఆధారంగా ఈ రుగ్మతకు సంబంధించి మరో రెండేళ్లలో మార్గదర్శకాలను అభివృద్ధి చేయనున్నట్టు అంతర్జాతీయ మధుమేహ ఫెడరేషన్ ప్రకటించింది.






# ఉబ్బసం నుంచి ఉపశమనం

**కీలెంచి వాత పెట్టాలనే సూత్రం ఉబ్బసానికి కూడా వర్తిస్తుంది. ఈ రుగ్మత ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకే చికిత్స అందించడం సరి కాదు. ప్రేరేపించే అంశాలు, వయసు, తీవ్రత ఆధారంగా తగిన చికిత్సా మార్గాన్ని ఎంచుకుంటే ఉబ్బసాన్ని అదుపు చేయడమే కాదు, దాన్నుంచి సమూలంగా విముక్తి పొందవచ్చు అంటున్నారు వైద్యులు.**

ఉబ్బసాన్ని వ్యాధిగా పరిగణించకూడదు. దీన్నొక పరిస్థితిగానే భావించాలి. ఈ సమస్య చికిత్సకు లొంగడమే కాకుండా, సకాలంలో స్పందించి, తగిన చికిత్స తీసుకోగలిగితే దీన్నుంచి శాశ్వత విముక్తి కూడా పొందే వీలుంటుంది. నిజానికి ఉబ్బసం వ్యాధి, చికిత్స పట్ల ఉన్న అపోహలే వ్యాధి నియంత్రణకు అవరోధాలుగా మారుతున్నాయి. సమర్థమైన చికిత్స అందుబాటులో ఉన్నా, వ్యాధిని అదుపులో ఉంచే ముందు జాగ్రత్త చర్యల పట్ల అవగాహన లేకపోవడం వల్ల సమస్యను అదుపు చేయలేకపోతున్నాం. ఉబ్బసాన్ని ప్రేరేపించే కారకాలను నిర్లక్ష్యం చేయడం, పక్కదారి పట్టించే లక్షణాలకు స్వీయ చికిత్సలను ఆశ్రయించడం... ఇలా ఈ వ్యాధిని చేతులారా పెంచి పోషించుకుంటున్నాం!

**గ్లోబల్ ఇనీషియేటివ్ ఆస్తమా అనే లాభాపేక్ష లేని అంతర్జాతీయ సంస్థ, ప్రతి ఏటా మే ఆరును ఆస్తమా దినంగా ప్రకటించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను చేపడుతూ ఉంటుంది.**

### లెక్కలేనన్ని కారణాలు

ఉబ్బసానికి వయసుతో సంబంధం లేదు. ఈ సమస్య ఎవరికైనా, ఎప్పుడైనా తలెత్తవచ్చు. సాధారణ అలర్జీ కూడా దీర్ఘకాలంలో ఉబ్బసానికి దారి తీయొచ్చు. ఈ పరిస్థితికి ఇంకొన్ని కారణాలు ఏవంటే...

- వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు
- వాతావరణ కాలుష్యం వల్ల రావొచ్చు
- జీవనశైలి, ఆహారశైలి మార్పులు రావొచ్చు
- కృత్రిమ పదార్థ రంగులు, రసాయనాల వల్ల తలెత్తవచ్చు
- ఫుడ్ అలర్జీ, డస్ట్ అలర్జీల వల్ల రావొచ్చు
- కొందరు పుట్టుకతోనే రావొచ్చు
- మరి కొందరికి బాల్యంలో తలెత్తవచ్చు
- జన్యు ఉత్పరివర్తనల వల్ల రావొచ్చు
- బొద్దింకలు, పూలపుప్పొడి వల్ల తలెత్తవచ్చు
- పరిశ్రమల నుంచి వెలువడే పొగల వల్ల రావొచ్చు

### ఈ లక్షణాల మీద కన్నేసి...

దగ్గు, పిల్లికూతలు, ఆయాసం.. ఈ మూడు ఉబ్బసం ప్రధాన లక్షణాలు. కానీ ఇవే లక్షణాలు సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా కనిపిస్తాయి. కానీ అవి కొన్ని రోజులు వేధించి, తగ్గిపోతాయి. అలా కాకుండా పదే పదే అవే లక్షణాలు వేధిస్తూ ఉన్నా, ఒక రుతువులో మాత్రమే ఈ లక్షణాలు పెరుగుతున్నా ఉబ్బసంగా అనుమానించాలి. కొత్తగా బడికి వెళ్తున్న పిల్లల్లో ఇలాంటి లక్షణాలు ప్రతి నెలా కనిపించినప్పుడు, ఆ లక్షణాలను ప్రేరేపించే అంశాలు, కుటుంబ చరిత్ర, తీవ్రతల ఆధారంగా ఉబ్బసాన్ని నిర్ధారించుకోవాలి. అయితే రుతుపరమైన వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా ఇవే లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి కాబట్టి ఉబ్బసాన్ని నిర్ధారించుకోవడం కోసం కొన్ని పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది. పెద్దల్లో కూడా అకస్మాత్తుగా ఉబ్బసం తలెత్తుతుంది.

### పరీక్షలున్నాయి

ఉబ్బసాన్ని నిర్ధారించడం తేలికే! స్పైరోమెట్రీ, పీక్ ఫ్లో మెషిన్ పరీక్షలతో ఉబ్బసం తీవ్రత తెలుస్తుంది. మందులతో ఉబ్బసం లక్షణాలు అదుపులోకి రావడాన్ని బట్టి కూడా సమస్యను ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు. లక్షణాలు పగలు తక్కువగా సాయంత్రం, రాత్రి వేళ ఎక్కువగా ఉన్నప్పుడు కూడా ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు. అలాగే కొందరికి అలర్జీ పరీక్షలు కూడా అవసరమవుతాయి. అలాగే అలర్జీ సంకేతాలు, లక్షణాలకు సంబంధించిన ప్రశ్నావళులను పూరించడం ద్వారా, కలిగి ఉన్న అలర్జీల పట్ల స్పష్టత ఏర్పరుచుకుని, ఉబ్బసానికే దారి తీసే అవకాశాలను కూడా అంచనా వేయవచ్చు. వైద్యులు, ఈ పరీక్షలన్నిటినీ ఉబ్బసం నిర్వహణ సాధనాలుగా పరిగణిస్తారు. అలాగే కొందరు పిల్లల్లో వ్యాయామం చేసినప్పుడు మాత్రమే ఉబ్బసం ప్రేరేపితమవుతూ ఉంటుంది. ఇలాంటి పిల్లల చేత వ్యాయామం చేయించి, పల్మొనరీ ఫంక్షన్ టెస్ట్ చేపట్టి ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు. అలాగే కొందర్లో పిల్లికూతలు, ఆయాసం లేకుండా కేవలం దగ్గుతోనే ఉబ్బసం బయల్పడవచ్చు. ఐదేళ్ల లోపు పిల్లల్లో పిల్లికూతల రూపంలో ఉబ్బసం బయటపడొచ్చు.



### ట్రిగ్గర్ కావొచ్చు!

కొందరికి ఐదు నిమిషాల ముందు వరకూ లేని ఆయాసం హఠాత్తుగా మొదలవుతుంది. భయపడినా, విపరీతమైన ఒత్తిడి, శారీరక శ్రమకు లోనైనా క్షణాల్లో ఉబ్బసం లక్షణాలు కనిపించి ఊపిరి ఆడనివ్వకుండా చేసేస్తాయి. ఇలాంటివాళ్లు ఇన్‌హేలర్స్ ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. క్రీడాకారులైతే ఆటకు ముందు వీటిని వాడితే, ఉబ్బసం వేధించకుండా ఉంటుంది.

### ఇన్‌హేలర్స్ సురక్షితం

**ఉబ్బసానికి ఉత్తమమైన చికిత్స నెబ్యులైజర్స్, ఇన్‌హేలర్స్, స్టెరాయిడ్స్. చాలామంది వీటిని వాడడానికి ఇష్టపడరు. వైద్యులు ఇన్‌హేలర్స్ సూచించినప్పుడు వేరే మందులను సూచించమని వైద్యులను ఒత్తిడి చేస్తారు. కానీ ఉబ్బసానికి ఇన్‌హేలర్స్ సురక్షితమైన చికిత్స. తీవ్రతను బట్టి కొందరికి స్టెరాయిడ్స్ కూడా అవసరం పడొచ్చు. ఈ రెండూ ఇతరత్రా దుష్ప్రభావాలు కలిగించకుండా నేరుగా ఊపిరితిత్తుల మీదే పనిచేస్తాయి.**


### అలర్జీలున్నాయా?

గత రెండు దశాబ్దాల్లో మన దేశంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయాయి. ఇలా ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయినప్పుడు మన శరీరం వ్యాధినిరోధకశక్తి స్పందన తీరు మారిపోతుంది. ఫలితంగా కొన్ని వాతావరణాలకు, భావోద్వేగాలకూ, పదార్థాలకూ శరీరం ప్రతికూలంగా స్పందించి, ఉబ్బసం లక్షణాలు వేధించడం మొదలుపెడతాయి. సాధారణంగా అలర్జీలన్నీ ఉబ్బసానికే దారి తీస్తాయని అనుకుంటూ ఉంటారు. కానీ ముక్కు నుంచి నీరు కారే అలర్జిక్ రైనైటిస్ లాంటి 40% నుంచి 50% అలర్జీలు మాత్రమే ఉబ్బసానికి దారి తీస్తాయి. మరీ ముఖ్యంగా పిల్లల్లో అలర్జీలు ఉబ్బసాలకు దారి తీసే అవకాశాలు ఎక్కువ. కానీ ఎక్కువ శాతం పిల్లల్లో అలర్జీ కారక ఉబ్బసం ఉన్నప్పటికీ, సరైన చికిత్సను అందించగలిగితే, వయసు పెరిగేకొద్దీ ఆ లక్షణాలన్నీ సమసిపోతూ ఉంటాయి.

### చికిత్స ఇలా...

అకస్మాత్తుగా తీవ్ర ఉబ్బసం దాడి చేసినప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. ఆ సమయంలో నెబ్యులేజేషన్‌తో పాటు ఆక్సిజన్ కూడా అవసరమవుతుంది. ఇన్‌హేలర్స్ స్టిరాయిడ్స్ కూడా అవసరమవుతాయి. దీర్ఘకాల ఉబ్బసం ఉన్నవారు అలర్జీలను తగ్గించుకోవడం అవసరం. కొందరికి అగరబత్తీలు, సాంబ్రాణి వాసనలకు ఉబ్బసం లక్షణాలు వేధిస్తాయి. వీళ్లు మాస్కులు వాడుకోవాలి. స్వీట్లు తిన్నప్పుడు లక్షణాలు తీవ్రమైతే వాటికి దూరంగా ఉండాలి. చల్లని పదార్థాలు, కొన్ని రకాల పండ్లు, వంకాయ, గుడ్లు, నట్స్‌తో కూడా కొందర్లో ఉబ్బసం తలెత్తుతుంది. ఆ కారకాలను కనిపెట్టి వాటికి దూరంగా ఉండాలి. ఇన్‌హేలర్స్ వాడుకుంటే వాటికి అలవాటు పడిపోతాం అనే ఒక ప్రధాన అపోహ కూడా సర్వత్రా నాటుకుపోయింది. వీటిని ఉబ్బసం చివరి దశలోనే ఇన్‌హేలర్స్ వాడుకోవాలి అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి ఇవి వ్యాధి ప్రారంభంలో వాడుకోవలసినవి. మిల్లీగ్రాముల పరిమాణంలో ఔషధాన్ని కలిగి ఉండే ఇన్‌హేలర్స్ మాత్రల కంటే సున్నితమైనవి. ఇవి మాత్రల్లా రక్తంలో కలిసి శరీరమంతా ప్రవహించకుండా, నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి సమస్యను పరిష్కరిస్తాయి. పైగా వీటికి దుష్ప్రభావాలు ఉండవు. సమస్య కూడా వెంటనే పరిష్కారమవుతుంది. కాబట్టి ఇన్‌హేలర్స్ అన్ని విధాలా సురక్షితమైనవి.


డాక్టర్ పి. నవీన్ సారథి
కన్సల్టెంట్ పీడియాట్రిక్ పల్మొనాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్,
హైదరాబాద్.



# పెద్దపేగు పదిలంగా

**మన దేశంలో అత్యంత సాధారణ క్యాన్సర్లలో పెద్ద పేగు క్యాన్సర్ ఒకటిగా మారిపోయింది. జీర్ణకోశ సమస్యలను తలపించే పెద్ద పేగు క్యాన్సర్ చికిత్స పక్కదారి పట్టే ప్రమాదం ఉంది కాబట్టి అప్రమత్తతతో వ్యవహరించడం అవసరమంటున్నారు వైద్యులు.**

గత ఐదేళ్ల కాలంలో పెద్ద పేగు క్యాన్సర్ ఉదంతాలు రెట్టింపయ్యాయి. మునుపు ఏడవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పరిమితమైపోయిన ఈ క్యాన్సర్ తాజాగా మూడవ స్థానానికి ఎగబాకింది. ప్రత్యేకించి యువతలో ఈ క్యాన్సర్ పెరగడం ఆందోళన కలిగించే విషయం. మరీ ముఖ్యంగా ఈ క్యాన్సర్‌ను తొలి దశల్లోనే గుర్తించలేకపోవడం వల్ల వ్యాధి ముదిరి చికిత్స క్లిష్టమయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇందుకు కారణం, పెద్దపేగు క్యాన్సర్ లక్షణాలు పొట్ట, పేగుల్లో తలెత్తే సాధారణ సమస్యలను తలపించేలా ఉండడమే!

### తప్పుదోవ పట్టించే లక్షణాలు

**మలబద్ధకం:** రోజుల తరబడి మలబద్ధకం వేధిస్తుంది. అయితే అడపాదడపా ఈ సమస్య సాధారణమే కాబట్టి ఎవరూ దీన్ని పెద్దగా పట్టించుకోరు. కానీ పెద్దపేగు క్యాన్సర్‌గా భావించరు

**విరోచనాలు:** ఈ లక్షణం కూడా అందర్లో అడపాదడపా కనిపిస్తూనే ఉంటుంది. కాబట్టి ఈ లక్షణాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు

**మిశ్రమ సమస్య:** కొన్ని రోజులు మలబద్ధకం, ఇంకొన్ని రోజులు విరోచనాలు వేధిస్తాయి. ఇలాంటి మిశ్రమ లక్షణాలు కూడా పెద్దపేగు క్యాన్సర్‌ను సూచిస్తాయి

**మలంలో రక్తం:** మలంలో రక్తం కనిపించడం కూడా పెద్దపేగు క్యాన్సర్ లక్షణమే!

**మలవిసర్జనలో ఇబ్బంది:** మలవిసర్జన సాఫీగా, సునాయాసంగా జరగకపోయినా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

**అల్సరేటివ్ కొలైటిస్:** ఈ సమస్య నిర్లక్ష్యానికి గురైనప్పుడు, అది పెద్దపేగు క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉంటుంది

**బరువు/ఆకలి తగ్గడం:** అకారణంగా శరీర బరువు, ఆకలి తగ్గుతున్నా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

### వీరికి ముప్పు ఎక్కువ

- అధిక బరువు
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్
- అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులు
- ఎక్కువగా రెడ్ మీట్ తినడం
- ధూమపానం, మద్యపానం
- వ్యాయామం లోపం
- ఎక్కువ గంటలు కదలకుండా పనిచేయడం
- బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం

### నియంత్రణ చర్యలు ఇవే!

పెద్దపేగు క్యాన్సర్ నివారణ సులభమే! కొద్దిపాటి అప్రమత్తతతో, ముందు జాగ్రత్తలతో ఈ క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చు.

- బరువును అదుపులో ఉంచుకోవాలి
- ధూమపానం, మద్యపానం మానేయాలి
- వ్యాయామం చేస్తూ, శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్ ఉన్నవాళ్లు 40 ఏళ్లు దాటిన వెంటనే, లేనివాళ్లు 50ఏళ్లు దాటగానే కొలనోస్కోపీ చేయించుకోవాలి
- ఒకసారి కొలనోస్కోపీలో క్యాన్సర్ లేదని నిర్ధారణ అయినవాళ్లు అప్పటి నుంచి ప్రతి పదేళ్లకోసారి కొలనోస్కోపీ చేయించుకోవాలి
- రెడ్ మీట్, బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం మానేయాలి

### పెద్దపేగు ఆహారం

పెద్ద పేగు ఆరోగ్యం కోసం పీచు ఎక్కువగా ఉండే ఆహారం తినాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, పిజ్జాలు, బర్గర్లు లాంటి జంక్ ఫుడ్ తగ్గించాలి.



### వ్యాధి నిర్ధారణ ఇలా...

మలబద్ధకమైనా, విరోచనాలు అయినా 5 నుంచి 7 రోజులకు క్రమేపీ సర్దుకుంటాయి. పొట్ట, పేగులకు సంబంధించిన సాధారణ సమస్యలన్నీ తాత్కాలికంగానే వేధించి, తగ్గిపోతూ ఉంటాయి. ఇలా కాకుండా నెల, రెండు నెలల పాటు లక్షణాలు వేధిస్తూ ఉన్నా, బరువు తగ్గిపోతున్నా తప్పనిసరిగా వైద్యులను కలిసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. రక్తపరీక్షలు, ట్యూమర్ మార్కర్లు, కొలనోస్కోపీలతో పెద్దపేగు క్యాన్సర్‌ను సులువుగా పసిగట్టవచ్చు. కొలనోస్కోపీతో ఒకటి, రెండు దశల్లోని కనిపెట్టవచ్చు. ఆ తర్వాత అవసరాన్ని బట్టి సిటి స్కాన్, సిటి కొలనోగ్రఫీలు చేసి, క్యాన్సర్ తీవ్రతను అంచనా వేయవచ్చు. శరీరంలోకి ఎలాంటి స్కోప్‌ను చొప్పించకుండానే పెద్దపేగు, పురీషనాళంలోని పాలిప్స్, పుండ్లు, క్యాన్సర్ గడ్డలను కనిపెట్టడంలో సిటి కొలనోగ్రఫీ బాగా తోడ్పడుతుంది. పెద్దపేగు క్యాన్సర్ ప్రారంభంలో చిన్న పాలిప్‌లా మొదలవుతుంది. కాబట్టి స్కాన్ సమయంలోనే వీటిని పసిగట్టి, తొలగించగలిగితే వ్యాధి ముదురకుండా చూసుకోవచ్చు.

### చికిత్స సులువే!

పెద్దపేగుల్లో తలెత్తే క్యాన్సర్ ముందరి పాలిప్స్ కణుతులను ఎండోస్కోపీతో తొలగించుకోవచ్చు. ఈ చికిత్స రెండు, మూడు గంటల్లో పూర్తవుతుంది. తర్వాతి రోజే రోగి ఇంటికి వెళ్లిపోవచ్చు. క్యాన్సర్ మూడు, నాల్గవ దశలకు చేరుకున్నప్పుడు సర్జరీ చేయక తప్పదు. చివరి దశల్లో క్యాన్సర్ పెద్దపేగు నుంచి కాలేయం, ఎముకలు, ఊపిరితిత్తులకు వ్యాపించినప్పుడు సర్జరీ ముందు, తర్వాత కీమోథెరపీ, రేడియోథెరపీ అవసరమవుతుంది. తాజాగా రొబొటిక్ సర్జరీ కూడా అందుబాటులోకొచ్చింది. చిన్న కోతతో కొనసాగే ఈ సర్జరీతో రోగి తక్కువ కాలంలోనే కోలుకోగలుగుతాడు. సర్జరీ తదనంతరం దుష్ప్రభావాలు కూడా ఉండవు.


డాక్టర్ కృష్ణగోపాల్ ఎస్ భండారి
సీనియర్ కన్సల్టెంట్
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.

తెలుసుకుందాం

## మెదడుకు పదును ఇలా...

మెదడు చురుగ్గా ఉంచుకున్నంత కాలం, మతిమరుపు సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వాళ్లు మెదడుకు వ్యాయామాన్ని అందిస్తూనే ఉండాలి. అందుకోసం...

**రోజుకొక కొత్త విషయం:** కొత్త సమాచారంతో మెదడుకు సవాలు విసురుతూ మెదడును చురుగ్గా ఉంచుకుంటూ ఉండాలి. కొత్త అభిరుచి ఏర్పరుచుకోవడం, కొత్త భాష నేర్చుకోవడం, కొత్త సంగీత వాయిద్యం సాధన చేయడం లాంటివన్నీ మెదడుకు వ్యాయామాలే! ఇవన్నీ చేయలేనివాళ్లు కొత్త వంటకం వండడం, కొత్త విషయాలను తెలుసుకోవడం లాంటివి చేయొచ్చు.

**బ్రెయిన్ గేమ్స్, పజిల్స్:** సుడొకు, పజిల్స్ పూరిస్తూ వాటిని నిరంతరం సాధన చేస్తూ ఉండాలి. ఈ ఆటల కోసం రోజుకు అరగంట కేటాయించడం వల్ల మెదడు చురుకుదనం పెరుగుతుంది. అయితే రోజూ ఒకే రకమైన బ్రెయిన్ గేమ్స్‌కు బదులుగా ఒక రోజు సుడొకు, ఒక రోజు పదవినోదం, మరొక రోజు అంకెల గారడీ లాంటివి ఆడుతూ ఉండాలి.

**ధ్యానం:** ధ్యానంతో మానసిక ప్రశాంతత దక్కడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని పరిశోధనల్లో తేలింది. క్రమం తప్పక ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తితో సంబంధమున్న మెదడులోని హిప్పొపొటమస్ అనే ప్రదేశం బలపడుతుంది.

**వాటం మార్పు:** కుడి చేతి వాటం ఉన్న వాళ్లు ఎడమ చేతినీ, ఎడమ చేతి వాటం ఉన్న వాళ్లు కుడి చేతినీ వాడుకుంటూ ఉండాలి. బ్రష్‌తో పళ్లు తోముకోడానికీ, చీపురు పట్టుకుని ఊడ్చడానికీ, ఏదైనా అందుకోడానికీ, గరిట తిప్పడానికీ.. ఇలా తేలికపాటి పనుల కోసం చేతి వాటం మారుస్తూ ఉండడం వల్ల మెదడులోని రెండు అర్ధభాగాలూ చైతన్యమవుతాయి.

**వ్యాయామం:** వ్యాయామంతో మెదడు కూడా లాభపడుతుంది. ఏరోబిక్ వ్యాయామంతో మెదడుకు రక్తప్రసరణ మెరుగవుతుంది. నడక, ఈత, డాన్స్... ఇవన్నీ మెదడును చురుగ్గా ఉంచుతాయి. కాబట్టి రోజుకు కనీసం 30 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.

**అనుబంధాలు:** సంభాషణ, హాస్యం, అనుబంధాలు మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. కాబట్టి స్నేహితులతో కాలక్షేపం చేయడం, కలిసి సినిమాలు చూడడం, చర్చలు జరపడం లాంటివి చేస్తూ ఉండాలి. సామాజిక సంబంధాలను పెంపొందించుకోవాలి.



# ఆ హక్కు ఏపీ ప్రభుత్వానికి ఉంది

- స్వేచ్ఛగా నడుచుకోవచ్చు..లిక్కర్ స్కామ్ కేసులో సుప్రీంకోర్టు
- ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి షాక్.. ముందస్తు బెయిల్‌కు నో



న్యూఢిల్లీ, మే 5 (ఆంధ్రజ్యోతి) : మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు కీలక నిందితులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. స్వేచ్ఛగా నడుచుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని వ్యాఖ్యానించింది. ఏపీ మద్యం కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఏపీ మాజీ సీఎం జగన్ కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నెల 2వ తేదీన హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో వివరాలు సమర్పించేందుకు ప్రాసిక్యూషన్ సమయం కోరడంతో హైకోర్టు ధర్మాసనం కేసును ఈనెల 7వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే, ఆ ముగ్గురు ఈ నెల 2వ తేదీన సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. మద్యం కొనుగోళ్లతో తమకెలాంటి సంబంధమూ లేదని, ఉద్దేశపూర్వకంగానే తమను కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని తమ పిటిషన్లలో పేర్కొన్నారు. ఆ మూడు పిటిషన్లను కలిపి సోమవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, ముందస్తు బెయిల్ కోసం ఎప్పుడు పిటిషన్లు దాఖలు చేశారు? కోర్టు ప్రత్యర్థులకు నోటీసులేమైనా జారీ చేసిందా? అని జస్టిస్ పార్దీవాలా పిటిషనర్ల తరఫు న్యాయవాదులను ప్రశ్నించారు. హైకోర్టు తమ వాదనలు వినడంలేదని, అందుకే ఈ నెల 2న సుప్రీంకోర్టును ఆశ్రయించినట్టు వారు బదులిచ్చారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, ముకుల్ రోహిత్గీ కలుగజేసుకుని, హైకోర్టులో ఈ నెల 7న ఇదే అంశంపై విచారణ జరగనుందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బుధవారమే హైకోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో జోక్యం చేసుకోవడానికి ధర్మాసనం ఆసక్తి చూపలేదు. అరెస్టు చేయకుండా ఉండేందుకు స్టే ఇవ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. హైకోర్టులో బుధవారమే విచారణ ఉంది కదా? అని మరోసారి జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించగా, అప్పటిలోగా అరెస్టు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెప్పాలని న్యాయవాదులు పట్టుబట్టారు. ఈ క్రమంలో జస్టిస్ పార్దీవాలా అసహనం వ్యక్తం చేశారు. అలా ఆదేశాలు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పారు. తమ పరిధి, అధికారాల ప్రకారం నడుచుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టం చేశారు. బుధవారం జరిగే విచారణలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు సూచించారు.

## 'గ్రూప్-1 కేసు'లో ఏ2 ఆఫీసులో సోదాలు

- హైదరాబాద్‌లో మధుసూదన్ విచారణ

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాం నాటి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నియామకాల్లో జరిగిన అక్రమాలు వెలికితీస్తున్న విజయవాడ పోలీసులు కీలక ముందడుగు వేశారు. వైఎస్ అభిమాని, జగన్ సన్నిహితుడు పమిడికాల్వ మధుసూదన్(ఏ2)ను విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో సోమవారం సుదీర్ఘంగా ప్రశ్నించారు. వైఎస్ సహకారంతో మధుసూదన్ 2008లో 'కామ్‌సైన్' మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించారు. కరోనా సమయంలో జరిగిన ఏపీపీఎస్సీ మూల్యాంకనంలో కీలక భూమిక పోషించారు. మాన్యువల్ విధానాన్ని కాదని, డిజిటల్ మూల్యాంకనం చేసి రూ.1.14 కోట్లు తీసుకున్న కామ్‌సైన్ కంపెనీ డైరెక్టర్ హోదాలో ఆయనపై కేసు నమోదైంది. గ్రూప్-1 మూల్యాంకనం అక్రమాల్లో అసలు సూత్రధారి అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు కాగా, రెండో నిందితుడిగా మధుసూదన్‌పై ఇటీవల సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లిన బెజవాడ పోలీసులు బంజారా హిల్స్‌లోని పంచవటి కాలనీలో ఉన్న కార్యాలయంలో మధుసూదన్‌ను ప్రశ్నించారు. అప్పట్లో ఏం జరిగింది.. ఏపీపీఎస్సీ కార్యాలయంలో కాకుండా ప్రైవేటు రిసార్ట్స్‌లో డిజిటల్ మూల్యాంకనం ఎందుకు చేశారు? అలా చేయమని పీఎస్ఆర్ ఆంజనేయులు చెప్పారా? ఏపీపీఎస్సీ నుంచి ఎవరైనా అడిగారా? మీరే ప్రభుత్వ పెద్దల నుంచి పైరవీ చేయించుకున్నారా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. అప్పట్లో డిజిటల్ మూల్యాంకనానికి వినియోగించిన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# మార్కులు తగ్గినా.. సీటు గ్యారంటీ

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తమవుతోంది. అయితే.. మార్కుల విషయంలో అనవసరంగా ఆందోళన చెందవద్దని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది మార్కులతో పోల్చితే ఈసారి కనీసం 100-150 మార్కులు తగ్గుతాయని వారు అంచనా వేస్తున్నారు. ఉదాహరణకు.. 720కి 700 మార్కులు కచ్చితంగా వస్తాయని భావిస్తున్న మెరికల్లాంటి విద్యార్థులకు సైతం 550 మార్కులే వచ్చే పరిస్థితి కనిపిస్తోందని పలు కార్పొరేట్ విద్యా సంస్థల్లో బోధించే నిపుణులు చెబుతున్నారు. కాబట్టి.. ఈసారి మార్కులు తగ్గినప్పటికీ సీటు గ్యారంటీగా వస్తుందని భరోసా ఇస్తున్నారు. సగటు విద్యార్థి కంటే మెరిట్ విద్యార్థే ఈసారి ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. ఎందుకంటే.. నీట్ పరీక్షలో 180 ప్రశ్నలుంటే, సరైన జవాబుకు ఒక్కోదానికి 4 మార్కులిస్తారు. తప్పు సమాధానమిస్తే ఒక మార్కు మైనస్ అవుతుంది. సగటు విద్యార్థులంతా బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీలో మొత్తం 520 మార్కులకుగాను సగటున 400-450 వరకు స్కోర్ చేస్తారని.. ఫిజిక్స్ కఠినంగా రావడంతో వారిలో చాలా మంది కేవలం 15-20 ప్రశ్నలకే జవాబు రాసి ఉంటారని అంచనా వేస్తున్నారు. అవి కూడా కలుపుకొంటే మొత్తంగా సగటు విద్యార్థులు 460-530 మధ్యలో స్కోర్ చేసే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. అయితే మెరిట్ స్టూడెంట్స్ మాత్రం ఫిజిక్స్‌లో అన్ని ప్రశ్నలనూ అటెంప్ట్ చేసి, నెగిటివ్ మార్కులు తెచ్చుకునే ప్రమాదం ఉందంటున్నారు. అందుకే యావరేజ్ స్టూడెంట్స్ కంటే మెరిట్ వారికే ఈసారి నష్టం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### 600 దాటితే ఎయిమ్స్‌లో సీటు

గత ఏడాది నీట్‌లో కనీసం 680 మార్కులు సాధించిన వారికే.. దేశవ్యాప్తంగా ఉన్న ఆలిండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్లలో ఎంబీబీఎస్ సీటు దక్కింది. ఈ ఏడాది పేపరు కఠినంగా రావడంతో 600 పైచిలుకు వస్తే జనరల్ కేటగిరీలో సీటు దక్కుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇక తెలంగాణలో నిరుడు జనరల్ కేటగిరీలో 660 మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి రౌండ్‌లో ఆలిండియా కోటాలో సీటు దక్కింది. ఈడబ్ల్యూఎస్‌లో 654, ఓబీసీలో 659, ఎస్సీలో 575, ఎస్టీలో 547 మార్కులు సాధించిన వారికి సీటు దక్కింది. ఈ ఏడాది తెలంగాణలో 400 మార్కులకు పైగా వస్తే జనరల్ కేటగిరీలో కన్వీనర్ కోటాలో సీటు వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో సీట్లు తక్కువ పోటీ ఎక్కువగా ఉండటంతో అక్కడ కనీసం 470 మార్కులు పైచిలుకు సాధిస్తే జనరల్ కేటగిరీలో సీటు దక్కే అవకాశం ఉంటుందని అంటున్నారు.




పూజ, మనోజ్ (ఫైల్)

### నీట్ సరిగా రాయలేదని ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య

- జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఘటనలు

జగిత్యాలరూరల్/ ఉట్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష సరిగా రాయలేదని మనస్తాపం చెంది జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామానికి చెందిన జంగ పూజ (19) రెండేళ్ల క్రితం ఇంటర్ పూర్తి చేసింది. పూజ గతంలో రెండు సార్లు నీట్ పరీక్ష రాసినా సీటు సాధించలేదు. ఆదివారం జగిత్యాల జిల్లాలోని ఓ కళాశాలలో నీట్ రాసింది. సోమవారం నీట్ 'కీ'ని పరిశీలించగా అందులో తక్కువ మార్కులు వచ్చాయి. దాంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అలాగే, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన రాయి మనోజ్ (18) ఆదివారం హైదరాబాద్‌లో నీట్ పరీక్ష రాసి, సోమవారం ఇంటికి వచ్చాడు. పరీక్షలో కఠినమైన ప్రశ్నలు వచ్చాయని, సరిగ్గా రాయలేదని తల్లిదండ్రులకు తెలిపిన మనోజ్, నిద్రపోతానని చెప్పి తన గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

### నిరుడు ఏ ర్యాంకు వరకూ అంటే..

కిందటి సంవత్సరం తెలంగాణలో మూడో రౌండు పూర్తి అయ్యేనాటికి ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటాలో సీటు దక్కించుకున్న ఆలిండియా నీట్ ర్యాంకులు, వారు చేసిన స్కోర్ వివరాలు...

| | ఓసీ | ఈడబ్ల్యూఎస్ | బీసీ-ఏ | బీసీ-బీ | బీసీ-సీ | బీసీ-డీ | బీసీ-ఈ | ఎస్సీ | ఎస్టీ |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ప్రభుత్వ కాలేజీల్లో | | | | | | | | | |
| ర్యాంకు | 1,84,738 | 1,80,510 | 3,04,074 | 2,10,281 | 2,78,769 | 2,01,377 | 2,14,874 | 2,86,369 | 2,67,799 |
| మార్కులు | 514 | 517 | 437 | 496 | 452 | 502 | 493 | 448 | 459 |
| ప్రైవేటు కాలేజీల్లో | | | | | | | | | |
| ర్యాంకు | 2,01,744 | 1,60,982 | 3,36,989 | 2,29,597 | 3,15,341 | 2,14,648 | 2,24,955 | 3,11,648 | 2,93,873 |
| మార్కులు | 502 | 532 | 419 | 483 | 431 | 493 | 486 | 433 | 443 |
| ఏపీలో ఏయూ పరిధిలో ప్రభుత్వ కాలేజీల్లో | | | | | | | | | |
| ర్యాంకు | 61,524 | 51,540 | 93,987 | 95,053 | 90,259 | 62,975 | 1,44,695 | 1,54,591 | 2,17,509 |
| మార్కులు | 614 | 623 | 585 | 585 | 589 | 613 | 544 | 537 | 491 |
| ఏపీలో ఏయూ పరిధిలో ప్రైవేటు కాలేజీల్లో | | | | | | | | | |
| ర్యాంకు | 71,940 | - | 1,18,626 | 1,31,307 | 1,14,089 | 87,005 | 2,00,039 | 1,85,187 | 2,59,283 |
| మార్కులు | 605 | - | 565 | 555 | 569 | 591 | 503 | 513 | 464 |

# సహ చట్టం ప్రధాన కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

- ఖరారు చేసిన గవర్నర్.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- దాదాపు ఐదేళ్లకు సీఐసీ నియామకం
- పెండింగ్‌లో ఏడుగురు కమిషనర్ల ఫైల్



హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం-2005 పటిష్ఠ అమలు కోసం ఉద్దేశించిన రాష్ట్ర సమాచార కమిషన్‌ను ప్రభుత్వం ఎట్టకేలకు నియమించింది. సహ చట్ట కమిషన్ ప్రధాన సమాచార కమిషనర్ పదవిని దాదాపు ఐదేళ్లకు భర్తీ చేసింది. ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ), ఏడుగురు కమిషనర్ల పేర్లను ప్రభుత్వం ఇటీవల గవర్నర్‌కు సిఫారసు చేసింది. వీరిలో సీఐసీగా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి జి.చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లుగా బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాసరావు, కప్పర హరిప్రసాద్, కేఎల్ఎన్ ప్రసాద్, రాములు, వైష్ణవి, పర్వీన్ మొహిసిన్‌లను ప్రతిపాదించింది. వీరిలో సీఐసీగా చంద్రశేఖర్ రెడ్డి పేరును గవర్నర్ సోమవారం ఖరారు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఏడుగురు సమాచార కమిషనర్ల ఫైల్ పెండింగ్‌లో ఉంది. వీరి నియామకం నిబంధనల ప్రకారం జరగలేదని, సమాచార కమిషనర్లుగా తగిన అర్హతలు లేవంటూ పలువురు ఆర్టీఐ కార్యకర్తలు గవర్నర్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై రెండు రోజుల క్రితం గవర్నర్ ప్రభుత్వాన్ని వివరణ కోరగా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. వీరి నియామకానికి సంబంధించి గవర్నర్ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. కాగా రాష్ట్ర సీఐసీ పదవి దాదాపు ఐదేళ్లకు భర్తీ అయింది. క్రితం రాజా సదారాంను గత ప్రభుత్వం 2017 సెప్టెంబరులో నియమించగా..ఆయన మూడేళ్ల పదవీకాలం 2020 ఆగస్టుతో పూర్తైంది. తర్వాత సీఐసీ పదవిని భర్తీ చేయలేదు.

### చంద్రశేఖర్ రెడ్డి నేపథ్యం...

ఆదిలాబాద్ జిల్లా ఎచ్చోడ మండలం బోరేగావ్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి 1991 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఉస్మానియా నుంచి బీఎస్సీ ఫారెస్ట్రీలో డిగ్రీ, ఢిల్లీలోని జేఎన్‌యూ నుంచి లైఫ్ సైన్సెస్‌లో పీజీ చేసిన ఈయన.. ఐఐఎం బెంగళూరు, యూఎస్ఏలోని సిరాక్యూస్ యూనివర్సిటీ నుంచి మేనేజ్‌మెంట్ అండ్ పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ చేశారు. పర్యావరణ శాస్త్రంలో వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. జపాన్ ఇంటర్నేషన్ కోఆపరేషన్ ఏజెన్సీ (జికా), ప్రపంచబ్యాంకులకు సంబంధించిన జీవనోపాధి, నీటి వనరుల ప్రాజెక్టుల్లో ప్రాజెక్టు డైరెక్టర్‌గా సేవలు అందించారు. అడవులు, సహజ వనరులు, వన్యప్రాణుల నిర్వహణలో 34ఏళ్ల అనుభవం కలిగిన ఈయన ప్రస్తుతం సీఎం ముఖ్య కార్యదర్శిగా, ముఖ్య అటవీ అధికారిగా, తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు.

## బాలికల విద్యాసంస్థల్లో మహిళా సిబ్బందే ఉండాలి

- జీవో నెం.1274 పటిష్ఠంగా అమలు చేయాలి
- ఎస్సీ గురుకుల సొసైటీ నిర్ణయం

బాలికల గురుకుల పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందిగా మహిళలు మాత్రమే పనిచేయాలనే ప్రభుత్వ నిబంధనను కచ్చితంగా అమలుచేయాలని ఎస్సీ గురుకుల సొసైటీ నిర్ణయించింది. బాలికల పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న 57 మంది పురుష సిబ్బందిని బాలుర పాఠశాలలకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. బాలికల గురుకుల పాఠశాలల్లో మహిళలు మాత్రమే పనిచేయాలని 2016లో అప్పటి ప్రభుత్వం జీవో ఆర్‌టీ నెం.1274 ను విడుదల చేసింది. దీనిని అమలు చేయడంలో సంబంధిత సొసైటీ అధికారులు నిర్లక్ష్యం వహించారు. రాష్ట్రంలో చాలా చోట్ల బాలికల పాఠశాలల్లో పురుషులు పనిచేస్తున్నారు. ఎస్సీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కొందరిపై ఇటీవల ఏడు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. దీంతో జీవో నెం. 1274ను పటిష్ఠంగా అమలు చేయాలని సొసైటీ అధికారులు నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 268 ఎస్సీ గురుకుల విద్యాసంస్థలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న 57 మంది పురుష సిబ్బందిని బాలుర పాఠశాలలకు బదిలీ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తమ ఆదేశాలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పొరుగు సేవలు, పార్ట్‌టైం సిబ్బందిని కూడా మహిళలతోనే భర్తీ చేస్తామని ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు.

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## టైటిల్ వీడియోకు సెన్సార్ అనుమతి



భారతీయ చిత్ర పరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'రామాయణ' సినిమాకు సంబంధించి ఓ కీలక అడుగు పడింది. సాయిపల్లవి, రణబీర్ కపూర్ సీతారాములుగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నితీశ్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ వీడియోకు సెన్సార్ బోర్డ్ ఆమోద ముద్ర వేసింది. రెండు నిముషాల 36 సెకండ్లు ఉన్న ఈ వీడియోకు యు సర్టిఫికెట్ ఇచ్చింది. దీంతో ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'రామాయణ' చిత్రం ప్రమోషన్స్ అధికారికంగా ప్రారంభించడానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. విమర్శలకు తావు లేకుండా అత్యంత భక్తిశ్రద్ధలతో చిత్రాన్ని తీస్తున్నామనీ, విజువల్ వండర్‌గా ప్రేక్షకులను 'రామాయణ' అలరిస్తుందనే నమ్మకం ఉందని నితీశ్ తివారీ పేర్కొన్నారు.

## తమిళంలోకి ఎంట్రీ!



స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా కథాంశంతో తమిళ నిర్మాత ఎల్రెడ్ కుమార్ నిర్మించే కొత్త తమిళ చిత్రం 'మండాడి'. ప్రధాన పాత్రలో సూరి నటించనున్నారు. తెలుగు నటుడు సుహాస్ ఈ చిత్రంతోనే తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగు పెడుతున్నారు. సినిమాలో ఆయన ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. సూరి, సుహాస్ మధ్య వచ్చే సన్నివేశాలు ఆసక్తికరంగా ఉంటాయి. మహిమా నంబియార్ కథానాయికగా నటించే ఈ సినిమాకు 'సెల్ఫీ' చిత్ర దర్శకుడు మతిమారన్ పుహళేంది దర్శకత్వం వహించనున్నారు. అన్ని భాషల్లోనూ ఆకట్టుకొనే విధంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్‌ను, సుహాస్ ఫస్ట్ లుక్‌ను నిర్మాత విడుదల చేశారు.

## కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రం



కార్తీక్ రాజు

'నిను వీడని నీడను నేనే' ఫేమ్ కార్తీక్ రాజు తెరకెక్కించిన చిత్రం 'హ్యాష్‌ట్యాగ్ సింగిల్'. శ్రీవిష్ణు హీరోగా గీతాఆర్ట్స్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించారు. ఇవానా, కేతిక శర్మ కథానాయికలు. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 9న చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా కార్తీక్ మీడియాతో ముచ్చటించారు. "ఈ కథను శ్రీవిష్ణుకి చెప్పగానే.. 'బాగుంది తప్పకుండా చేద్దాం' అన్నారు. సినిమా ఆయన బాడీలాంగ్వేజ్‌కు తగ్గట్లుగా ఉంటుంది. ఆయన నటనలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఆద్యంతం వినోదంతో సాగిపోయే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులనూ అలరిస్తుంది. వెన్నెల కిషోర్ పాత్ర సినిమాలో కీలకం. శ్రీవిష్ణు, వెన్నెల కిషోర్ మధ్య వచ్చే కామెడీ సన్నివేశాలకి ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటారు. ఇవానా, కేతిక పాత్రలకు సమాన ప్రాధాన్యత ఉంటుంది. శ్రీవిష్ణు అద్భుతమైన నటుడు. ఆయన టైమింగ్ చాలా బాగుంటుంది. ఆయన నటన సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. విశాల్ చంద్రశేఖర్ ఇచ్చిన సంగీతం ప్రధానాకర్షణ. వినోదంతో పాటూ మంచి భావోద్వేగాలూ ఉన్నాయి. కుటుంబసమేతంగా చూడదగ్గ ఈ చిత్రం విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు.



## విగ్రహావిష్కరణకు ముహూర్తం

లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌లో ఈ నెల 9న రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సంగతి తెలిసిందే. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొనడానికి లండన్ బయల్దేరారు మెగాస్టార్ చిరంజీవి, సురేఖ, రామ్‌చరణ్, ఉపాసన, క్లీంకార. ఈ విగ్రహంలో రామ్‌చరణ్‌తో పాటు తన పెంపుడు కుక్క రైమీ కూడా ఉండనుంది. ఆవిష్కరణ అనంతరం ఈ విగ్రహాన్ని సింగపూర్‌కు తరలించనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే మేడమ్ టుస్సాడ్స్‌లో అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్, మహేశ్, ప్రభాస్, అల్లు అర్జున్, ఐశ్వర్యా రాయ్ తదితరుల విగ్రహాలను ఏర్పాటు చేశారు.

## ఆ ఉద్దేశంతోనే నిర్మాతగా మారా



సమంత

"నేను వైజాగ్ వస్తే, ప్రతీ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతోంది. ఇక్కడి అభిమానుల్ని చూశాకే నాకు నిజమైన ప్రేమ అంటే ఏంటో అర్థమైంది. దర్శకుడు ప్రవీణ్ ఎనర్జీ చూసి అంతా మర్చిపోయాను" అని అన్నారు సమంత. ఆమె నిర్మాతగా మారి రూపొందించిన తొలి చిత్రం 'శుభం'. హర్షిత్ రెడ్డి, శ్రీనివాస్ గవిరెడ్డి, చరణ్ పెరి, షాలినీ కొండెపూడి ప్రధాన పాత్రల్లో ప్రవీణ్ కండ్రీగుల తెరకెక్కించారు. ఈ నెల 9న సినిమా విడుదలవుతున్న సందర్భంగా వైజాగ్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ "నిర్మాతగా ఓ కొత్త ఆలోచనతో ఈ చిత్రాన్ని ప్రారంభించాను. కొత్తవారితో కొత్తకథల్ని నిర్మించి ప్రేక్షకులను అలరించడమే ఉద్దేశంగా 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'ను మొదలుపెట్టాను. థియేటర్‌లో సినిమాను చూసిన ప్రతీ ఒక్కరూ నవ్వుతూ బయటకి వస్తారు" అని చెప్పారు. "సినిమా అద్భుతంగా ఉంటుంది. ఇంతవరకూ తెలుగులో ఇలాంటి కంటెంట్‌తో సినిమా రాలేదు. సమంత లేకపోతే 'శుభం' ఇంతవరకూ వచ్చి ఉండేది కాదు" అని దర్శకుడు ప్రవీణ్ కండ్రీగుల తెలిపారు. "నిర్మాతగా సమంత ఎంతో ప్యాషన్‌తో తీసిన సినిమా ఇది. తప్పకుండా అందరినీ ఆకట్టుకుంటుంది" అని హర్షిత్ రెడ్డి అన్నారు. "ఇది అందర్నీ మెప్పించే హారర్ కామెడీ" అని చరణ్ పెరి చెప్పారు. "సమంత ధైర్యం చేసి నిర్మించిన ఈ చిత్రం ద్వారా ఎంతో మంది వెండితెరకు పరిచయమవ్వడం శుభపరిణామం" అని శ్రీనివాస్ గవిరెడ్డి తెలిపారు.

# అమెరికాలో మన సినిమాలకు దెబ్బ

- వంద శాతం సుంకాల విధింపు
- తక్షణ అమలుకు ట్రంప్ ఆదేశాలు
- సినీ రంగానికి నష్టమన్న నిపుణులు
- భారత్‌పై తీవ్ర ప్రభావం పడే చాన్స్




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా విదేశీ సినిమాలపై కొరడా ఝళిపించారు. అమెరికాలో నిర్మించని సినిమాలపై 100 శాతం సుంకాలను విధించనున్నట్టు పేర్కొన్నారు. హాలీవుడ్ ప్రస్తుతం సంక్షోభంలో ఉందని.. నానాటికీ ఇబ్బందుల్లో కూరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన.. "అమెరికా సినీ పరిశ్రమ అత్యంత వేగంగా మరణానికి చేరువ అవుతోంది" అని సంచలన వ్యాఖ్య చేశారు.

"విదేశీ గడ్డపై నిర్మించిన సినిమాలకు తక్షణమే 100 శాతం సుంకాలు విధించాలని నిర్ణయించా. వాణిజ్య విభాగం, వ్యాపార ప్రతినిధులు తగు విధంగా చర్యలు తీసుకోవాలి. అన్ని సినిమాలకూ ఇది వర్తిస్తుంది. మనం కోరుకునేది.. అమెరికాలోనే మళ్లీ సినిమా నిర్మాణాలు జరగాలి" అంటూ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు.

### కొరవడిన స్పష్టత

అమెరికాలో విడుదల చేసే విదేశీ చిత్రాలకే ఈ టారిఫ్‌లు అమలు చేస్తారా? లేక విదేశాల్లో నిర్మించే అమెరికా సినిమాలపైనే వేస్తారా అన్నదానిపై స్పష్టత కొరవడింది. అయితే హాలీవుడ్ వెలుపల షూటింగ్ చేసే సినిమాలకు, టెలివిజన్ కార్యక్రమాలకు కొన్ని నగరాలు భారీ ఎత్తున పన్ను మినహాయింపులు కల్పిస్తున్నాయి. దీంతో ఇటీవల చాలా నిర్మాణ సంస్థలు తమ కార్యకలాపాలను హాలీవుడ్ నుంచి టొరంటో(కెనడా), డబ్లిన్(ఐర్లాండ్) వంటి నగరాలకు తరలించాయి. ఈ క్రమంలోనే ట్రంప్ తాజా నిర్ణయం తీసుకున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసోమ్ స్పందిస్తూ.. తమ రాష్ట్రంలో సినిమాలు తీసేవారికి భారీ పన్ను రాయితీలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

### భారత్‌పై తీవ్ర ప్రభావం

అమెరికాలో మన సినిమాలకు మంచి క్రేజీ ఉంటుంది. చాలా సినిమాలను భారత్‌లో కంటే ఒక రోజు ముందుగానే అక్కడ విడుదల చేస్తారు. రాజమౌళి తెరకెక్కించిన ఆర్ఆర్ఆర్‌తో పాటు బాలీవుడ్‌కి చెందిన డుంకీ, జవాన్ చిత్రాలు ఇక్కడ భారీ వసూళ్లు రాబట్టాయి. ఇటీవలె విడుదలైన 'ఛావా' కేవలం రెండు వారాల్లో 5 మిలియన్ డాలర్ల కలెక్షన్స్ సాధించింది. దీన్ని బట్టి అమెరికాలో మన సినిమాల పట్ల ఉన్న క్రేజీ అంతా ఇంతా కాదని అర్థమవుతోంది. "బాలీవుడ్ సినిమా అయినా టాలీవుడ్ చిత్రమైనా ఓవర్సీస్ కలెక్షన్లపైనే ఆధారపడే రోజులివి. ఇప్పుడు వంద శాతం సుంకాలు అమలైతే భారతీయ చలన చిత్రపరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది" అని ఓ తెలుగు నిర్మాత ఆందోళన వ్యక్తం చేశారు. ఉదాహరణకు బయ్యర్ ఓ భారతీయ సినిమాను ఒక మిలియన్ డాలర్లకు కొన్నాడనుకుందాం. వంద శాతం సుంకాలు అమల్లోకి వస్తే సదరు బయ్యర్ మరో మిలియన్ డాలర్లు అక్కడి ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తుంది. ఇది బయ్యర్‌కు భారమవుతుంది. ఆ భారాన్ని ప్రేక్షకులపై వేస్తాడు. ప్రస్తుతం అమెరికాలో భారతీయులు ఎక్కువగా నివసిస్తున్న రాష్ట్రాల్లో టిక్కెట్ రేట్లు 14 డాలర్ల నుంచి 20 డాలర్ల మధ్య ఉన్నాయి.. వంద శాతం సుంకాలు గనుక అమల్లోకి వస్తే అప్పుడు 14 డాలర్లుగా ఉన్న టిక్కెట్ రేటును 28 డాలర్లకు పెంచక తప్పదు. స్థానిక పన్నుల్ని కూడా కలిపితే కనీస టిక్కెట్ రేటు 30 డాలర్లకు చేరుకుంటుంది. అప్పుడు 30 డాలర్ల టిక్కెట్‌పై స్థానిక పన్నులు, డిస్ట్రిబ్యూటర్ షేర్, థియేటర్ ఓనర్ షేరు పోగా నిర్మాతకు 15 డాలర్లు(50 శాతం) మిగులుతాయి అదే వంద శాతం ట్యాక్స్ అమల్లోకి వస్తే కేవలం 5 నుంచి 10 డాలర్లు మాత్రమే మిగులుతాయి. అంటే ఆదాయం సగానికి పడిపోతుందన్నమాట. తెలుగు సినిమానే ఉదాహరణగా తీసుకుంటే మన నైజాం ఏరియాలో ఓ సూపర్ డూపర్ హిట్ సినిమాకు ఎంత ఆదాయం వస్తుందో దాదాపుగా అంతే ఆదాయం అమెరికాలో షోల ద్వారా నిర్మాతలకు లభిస్తోంది. 'ట్రంప్ తాజా నిర్ణయంపై వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుంది. ఎందుకంటే గత ముప్పై, నలభై రోజులుగా ఆయన తీసుకుంటున్న అనేక నిర్ణయాలు పలు మార్పులు చేర్పులకు గురయ్యాయి. ఇదీ అంతే అని అనుకుంటున్నాను. ఒక వేళ అమల్లోకి వస్తే అమెరికాలో థియేట్రికల్ బిజినెస్ కుప్పకూలే ప్రమాదముంది' అని ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు శిబాసిస్ సర్కార్ వ్యాఖ్యానించారు. కాగా, ట్రంప్ నిర్ణయం వల్ల హీరోల రెమ్యూనరేషన్లు, సినిమాల బడ్జెట్లు కూడా తగ్గే అవకాశం ఉంది.

### చైనా ఇప్పటికే..

కరోనా అనంతరం అమెరికా చిత్ర రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. సినిమాలు తీసేవారు తగ్గిపోగా.. థియేటర్‌కు వచ్చి వీక్షించే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. దీనికితోడు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు ప్రజలు అలవాటు పడ్డారు. దీంతో థియేటర్లు బోసిపోతున్నాయి. ఇక, దీనికితోడు ట్రంప్ అమలు చేస్తున్న వాణిజ్య విధానాలు కూడా సినీ రంగంపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. కాగా, చైనా నెల రోజుల కిందటే అమెరికా సినిమాలపై చర్యలు ప్రారంభించింది. తక్కువ సంఖ్యలోనే అగ్రరాజ్యానికి చెందిన సినిమాలను చైనాలో ప్రదర్శిస్తున్నారు. చైనా మీద కోపంతోనే ట్రంప్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడనే టాక్ ఫిల్మ్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది.

### బయ్యర్లలో భయాందోళనలు

ట్రంప్ తాజా ప్రకటనతో ఓవర్సీస్ బయ్యర్లలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే చేసుకొన్న ముందస్తు ఒప్పందాల కారణంగా వారు తీవ్రంగా నష్టపోతారు. హరిహర వీరమల్లు, కింగ్‌డమ్, కుబేర, వార్-2, విశ్వంభర వంటి భారీ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. వీటిలో చాలా సినిమాలకు యూఎస్‌లో డిస్ట్రిబ్యూషన్ బిజినెస్ కూడా ఖరారైంది "ట్రంప్ అసంబద్ధ నిర్ణయాలతో ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న భారత చలన చిత్ర రంగం ఒక్కసారిగా కుప్పకూలుతుంది. దీనిని ఎవరూ రక్షించలేరు." అని నిర్మాత వివేక్ అగ్నిహోత్రి వ్యాఖ్యానించారు.

| నేటి మ్యాచ్ | వేదిక ముంబై |
|---|---|
| ముంబై x గుజరాత్ | రా.7.30 నుంచి |

**పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 11 | 8 | 3 | 0 | 16 | 0.482 |
| పంజాబ్ | 11 | 7 | 3 | 1 | 15 | 0.376 |
| ముంబై | 11 | 7 | 4 | 0 | 14 | 1.274 |
| గుజరాత్ | 10 | 7 | 3 | 0 | 14 | 0.867 |
| ఢిల్లీ | 11 | 6 | 4 | 1 | 13 | 0.362 |
| కోల్‌కతా | 11 | 5 | 5 | 1 | 11 | 0.249 |
| లఖ్‌నవూ | 11 | 5 | 6 | 0 | 10 | -0.469 |
| హైదరాబాద్ | 11 | 3 | 7 | 1 | 7 | -1.192 |
| రాజస్థాన్ | 12 | 3 | 9 | 0 | 6 | -0.718 |
| చెన్నై | 11 | 2 | 9 | 0 | 4 | -1.117 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



# రైజర్స్ ఆశలపై 'నీళ్లు'

వర్షంతో మ్యాచ్ రద్దు

ప్లేఆఫ్స్ రేసు నుంచి హైదరాబాద్ అవుట్

ఢిల్లీ 133/7

హైదరాబాద్: ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసులో సాంకేతికంగానే ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇప్పుడా అవకాశం కూడా లేకుండా పోయింది. సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దీంతో కేవలం ఏడు పాయింట్లతో ఉన్న రైజర్స్ అధికారికంగానే నిష్క్రమించింది. మరోవైపు ఈ వర్షం ఢిల్లీ పాలిట వరంగా మారింది. ఆ జట్టు 13 పాయింట్లతో తమ చాన్స్‌ను మరింత మెరుగుపర్చుకుంది. సరిగ్గా ఢిల్లీ ఇన్నింగ్స్ పూర్తయ్యాక దాదాపు గంటన్నర పాటు కురిసిన వర్షంతో మైదానం పూర్తి చిత్తడిగా మారింది. వర్షం తగ్గినా అక్కడక్కడా నీటి గుంటలు ఏర్పడడంతో ఐదు ఓవర్ల మ్యాచ్ కూడా వీలు పడలేదు. దీంతో అంపైర్లు మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించడంతో ఇరు జట్లకు ఒక్కో పాయింట్‌ను కేటాయించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీని రైజర్స్ బౌలర్లు వణికించారు. దీంతో 20 ఓవర్లలో 7 వికెట్లకు 133 పరుగులు చేసింది. అశుతోష్ (26 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 41), స్టబ్స్ (36 బంతుల్లో 4 ఫోర్లతో 41) రాణించారు. కమిన్స్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత వర్షం కారణంగా సన్‌రైజర్స్ బరిలోకి దిగలేకపోయింది.

**పేకమేడను తలపించేలా...**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ అనూహ్యంగా తడబడింది. గతంలో ఇదే పిచ్‌పై రైజర్స్ 190 రన్స్ చేయగా.. లఖ్‌నవూ 16 ఓవర్లలోపే బాదేసింది. ఈసారి కూడా అలవోకగా 200 పరుగులు వస్తాయని క్రీడా విశ్లేషకులు అంచనా వేశారు. కానీ రైజర్స్ పేసర్లు అద్భుతమే చేశారు. టపటపా వికెట్లు తీయడంతో ఒక్కో పరుగు సాధించేందుకు డీసీ అష్ట కష్టాలు పడింది. స్టబ్స్-అశుతోష్ ఏడో వికెట్‌కు 66 పరుగులు జోడించడంతో కాస్త గౌరవప్రదమైన స్కోరందుకుంది. కెప్టెన్ కమిన్స్ ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ కరుణ్ (0)ను అవుట్ చేసి షాకిచ్చాడు. ఆ తర్వాత తన వరుస ఓవర్లలో డుప్లెసి (3), పోరెల్ (8)లను వెనక్కి పంపాడు. ఈ ముగ్గురి క్యాచ్‌లను కీపర్ ఇషాన్ పట్టేయడం విశేషం. ఇక ఆరో ఓవర్‌లో అక్షర్ (6)ను హర్షల్ దెబ్బ తీయగా, పవర్‌ప్లేలో జట్టు 26/4 స్కోరుతో అత్యంత ఇబ్బందికర పరిస్థితిలో నిలిచింది. ఫామ్‌లో ఉన్న రాహుల్ (10) కూడా మరో మూడు పరుగులకే పెవిలియన్‌కు చేరడంతో ఢిల్లీ కనీసం వంద పరుగులైనా చేయగలుగుతుందా? అనే సందేహం నెలకొంది. విప్రజ్ (18) ధాటిగా ఆడినా 13వ ఓవర్‌లో రనౌటయ్యాడు. ఈదశలో స్టబ్స్-అశుతోష్ జోడీ క్రీజులో నిలిచి పరువు కాపాడే ప్రయత్నం చేశారు. 15వ ఓవర్‌లో అశుతోష్ రెండు సిక్సర్లతో 14 రన్స్ సమకూరాయి. అలాగే హర్షల్ ఓవర్‌లోనూ రెండు వరుస ఫోర్లతో స్కోరును వంద దాటించాడు. అటు స్టబ్స్ కూడా 18వ ఓవర్‌లో రెండు ఫోర్లతో సహకరించాడు. కానీ చివరి రెండు ఓవర్లలో 18 పరుగులే చేసిన డీసీ అశుతోష్ వికెట్‌ను కోల్పోవడంతో స్వల్ప స్కోరుకే పరిమితమైంది.



కమిన్స్, అక్షర్

**స్కోరుబోర్డు**

ఢిల్లీ: కరుణ్ నాయర్ (సి) ఇషాన్ (బి) కమిన్స్ 0, డుప్లెసి (సి) ఇషాన్ (బి) కమిన్స్ 3, అభిషేక్ పోరెల్ (సి) ఇషాన్ (బి) కమిన్స్ 8, కేఎల్ రాహుల్ (సి) ఇషాన్ (బి) ఉనాద్కట్ 10, అక్షర్ (సి) కమిన్స్ (బి) హర్షల్ 6, స్టబ్స్ (నాటౌట్) 41, విప్రజ్ (రనౌట్) 18, అశుతోష్ (సి) మనోహర్ (బి) మలింగ 41, స్టార్క్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 5; **మొత్తం: 20 ఓవర్లలో 133/7; వికెట్ల పతనం:** 1-0, 2-6, 3-15, 4-26, 5-29, 6-62, 7-128; **బౌలింగ్:** కమిన్స్ 4-0-19-3, ఉనాద్కట్ 4-0-13-1, హర్షల్ 4-0-36-1, మలింగ 4-0-28-1, జీషన్ 3-0-30-0, అభిషేక్ శర్మ 1-0-5-0.

## చెన్నై జట్టులో ఉర్విల్ పటేల్

రైజర్స్‌కు హర్ష్ దూబే

న్యూఢిల్లీ: గాయపడిన వంశ్ బేడీ స్థానంలో గుజరాత్‌కు చెందిన ఉర్విల్ పటేల్‌ను జట్టులోకి తీసుకున్నట్టు చెన్నై సూపర్ కింగ్స్ ప్రకటించింది. టీ20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ (28 బంతుల్లో) చేసిన రెండో క్రికెటర్‌గా ఈ 26 ఏళ్ల కీపర్ రికార్డులకెక్కాడు. మరోవైపు సన్‌రైజర్స్ జట్టులోకి స్మరణ్ రవిచంద్రన్ స్థానంలో ఆల్‌రౌండర్ హర్ష్ దూబే వచ్చాడు.

## షమికి బెదిరింపు



అమ్రోహా (యూపీ): భారత పేసర్ మహ్మద్ షమిని చంపుతామంటూ ఓ వ్యక్తి ఈ-మెయిల్ ద్వారా బెదిరించాడు. దాంతో షమి సోదరుడు హసీబ్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బెదిరించిన వ్యక్తిని రాజ్‌పుత్ సిందర్‌గా గుర్తించారు. కోటి రూపాయలు ఇవ్వాలని.. లేదంటే షమిని చంపుతామని రాజ్‌పుత్ బెదిరించాడు.



ఖేలో ఇండియా యూత్ గేమ్స్

## స్విమ్మింగ్‌లో సంపత్‌కు కాంస్యం

గయ (బిహార్): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలుగు స్విమ్మర్ సంపత్‌కుమార్ యాదవ్ కాంస్య పతకంతో సత్తా చాటాడు. బాలుర 200 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంపత్ 1:55.89 సెకన్లలో గమ్యాన్ని చేరి మూడోస్థానంలో నిలిచాడు. కేరళ స్విమ్మర్ అభినవ్‌కు స్వర్ణం, కర్ణాటకకు చెందిన దక్షణ్‌కు రజత పతకాలు దక్కాయి.

## మన ఆధిపత్యానికి తిరుగులేదు!

వన్డేలు, టీ20లలో టాప్ ర్యాంక్

- టెస్టుల్లో నాలుగో స్థానం
- ఐసీసీ వార్షిక ర్యాంకింగ్స్

దుబాయ్: తెల్ల బంతుల ఫార్మాట్‌లో తనకు తిరుగులేదని భారత్ నిరూపించుకుంది. అయితే టెస్టుల్లో మాత్రం ఒకింత వెనుకంజలో నిలిచింది. ఈమేరకు ఐసీసీ సోమవారం ప్రకటించిన వార్షిక ర్యాంకింగ్స్‌లో..టీమిండియా వన్డేలు, టీ20ల్లో అగ్రస్థానాన్ని కాపాడుకుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో మాత్రం నాలుగో ర్యాంక్ దక్కించుకుంది. పురుషుల తాజా ర్యాంకింగ్స్‌లో..2024 మే నుంచి ఆడిన అన్ని మ్యాచ్‌లనుంచి 100 శాతం పాయింట్లను పరిగణనలోకి తీసుకున్నారు. అంతకుముందు రెండు సంవత్సరాలలో ఆడిన మ్యాచ్‌లనుంచి 50 శాతం పాయింట్లనే తీసుకున్నారు.

**వన్డేలు:** భారత్ 50 ఓవర్ల ఫార్మాట్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. దాంతో జట్టు రేటింగ్ పాయింట్లు 122 నుంచి 124కు పెరిగాయి. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. శ్రీలంక, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా తర్వాతి ర్యాంకులు సాధించాయి. ఇంగ్లండ్‌ను వెనక్కు నెట్టిన అఫ్ఘానిస్థాన్ ఏడో స్థానంలో నిలవడం విశేషం.

**టీ20లు:** ఈ విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ టీమిండియా (271 పాయింట్లు) నెం.1గా నిలిచింది. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (254) వరుసగా రెండు మూడు స్థానాలు దక్కించుకున్నాయి. న్యూజిలాండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లకు వరుసగా ఆ తదుపరి ర్యాంక్‌లు లభించాయి.

**టెస్టులు:** ప్రస్తుత ప్రపంచ టెస్ట్ చాంపియన్ ఆస్ట్రేలియా (126 పాయింట్లు) సుదీర్ఘ ఫార్మాట్‌లో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఇంగ్లండ్ (113), దక్షిణాఫ్రికా (111), భారత్ (105) వరుసగా వరుసగా రెండు, మూడు, నాలుగు ర్యాంక్‌లలో నిలిచాయి. న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్థాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, జింబాబ్వే వరుసగా ఆ తదుపరి ర్యాంకులు కైవసం చేసుకున్నాయి.

## ఇండియన్ ఐడల్ నుంచి ఐపీఎల్‌కు..

అంపైర్ పరాశర్ ఆసక్తికర ప్రయాణం



న్యూఢిల్లీ: ఆటగాడిగా.. పాటగాడిగా.. ఇప్పుడు అంపైర్‌గా పరాశర్ జోషి (30) బహుముఖ ప్రజ్ఞ అద్భుతం. గతేడాది మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అందరి దృష్టినీ ఆకర్షించాడు పరాశర్ (30). కారణం టీమిండియా క్రికెటర్ శ్రేయాస్ అయ్యర్‌ను పోలి ఉండడమే. అయితే, ఈ ఏడాది జోషి ఏకంగా ఐపీఎల్‌లోకి అడుగుపెట్టాడు. గతనెల 5న చెన్నై-ఢిల్లీ మ్యాచ్‌కు అంపైరింగ్ చేశాడు. చిన్నతనంలో క్లబ్ స్థాయిలో జోషి మ్యాచ్‌లు ఆడాడు. 2008లో ప్రఖ్యాత రియాల్టీ షో ఇండియన్ ఐడల్‌లో పోటీపడ్డాడు. ఈ క్రమంలో పియానో రౌండ్‌కు ఎంపికయ్యాడు. తర్వాత గాయకుడిగా ఎదగడం కష్టంగా మారడంతో మళ్లీ క్రికెట్ వైపు అడుగులు వేశాడు. అయితే, ఈసారి అంపైర్‌గా. 2015లో బీసీసీఐ అంపైరింగ్ ప్యానెల్‌లో చోటు సంపాదించిన జోషి.. రంజీలు, దులీప్ ట్రోఫీ లాంటి దేశవాళీ టోర్నీలకు అంపైరింగ్ చేశాడు. దీంతో గతేడాది డబ్ల్యూపీఎల్‌లో చాన్స్ లభించింది. అక్కడ తన పనితీరుకు మంచి మార్కులు రావడంతో.. ఈ సీజన్ ఐపీఎల్‌లో చోటు దక్కించుకున్నాడు..

### మయామి గ్రాండ్ ప్రీ విజేత ఆస్కార్



మయామి గార్డెన్ (ఫ్లోరిడా): మెక్‌లారెన్స్ ఎఫ్-1 డ్రైవర్ ఆస్కార్ పియాస్త్రి.. మయామి గ్రాండ్ ప్రీ విజేతగా నిలిచాడు. మెక్‌లారెన్స్‌కే చెందిన లాండో నోరిస్ రెండు, మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ మూడు స్థానాలను సొంతం చేసుకొన్నారు. కాగా, పోల్ పొజిషన్ నుంచి రేస్ ఆరంభించిన వరల్డ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు.

### రూడ్‌కు 'మాడ్రిడ్' టైటిల్



మాడ్రిడ్: నార్వేకు చెందిన కాస్పెర్ రూడ్ మాడ్రిడ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ టైటిల్ నెగ్గాడు. ఫైనల్లో రూడ్ 7-5, 3-6, 6-4తో జాక్ డ్రేపర్ (బ్రిటన్)ను ఓడించాడు. తద్వారా కెరీర్‌లో తొలిసారి మాస్టర్స్ 1000 టైటిల్‌ను కాస్పెర్ సొంతం చేసుకున్నాడు.

### శ్రీకాంత్ ఫామ్‌లోకొచ్చేనా?

తైపీ ఓపెన్ నేటి నుంచి

తైపీ: సుదీర్ఘ కాలంగా ఫామ్ కోసం తంటాలు పడుతున్న కిడాంబి శ్రీకాంత్‌తోపాటు యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, అనుపమ ఉపాధ్యాయ సత్తా చాటాలనుకొంటున్నారు. మంగళవారం నుంచి జరిగే తైపీ ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనపై గురిపెట్టారు. గాయాలతో ఇబ్బంది పడుతున్న శ్రీకాంత్.. తొలి రౌండ్‌లో భారత్‌కే చెందిన శంకర్‌తో తలపడనున్నాడు. తరుణ్, మిరాబా కూడా బరిలోకి దిగనున్నారు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, అనుపమ, ఆకర్షి కశ్యప్ పోటీపడనున్నారు.

### లిఫ్టర్ పర్వ్‌కు రెండు పతకాలు



లిమా (పెరూ): ఐడబ్ల్యూఎఫ్ యూత్, జూనియర్ ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ లిఫ్టర్ పర్వ్ చౌధరి రెండు పతకాలతో మెరిశాడు. యూత్ బాలుర 96 కిలోల విభాగంలో ఓవరాల్‌గా 315 కిలోలు ఎత్తి మూడోస్థానంతో కాంస్యం అందుకున్నాడు. ఇక, స్నాచ్‌లో 140 కిలోలు ఎత్తిన పర్వ్.. క్లీన్ అండ్ జెర్క్‌లో 175 కిలోలతో రెండోస్థానంలో నిలిచి రజతం దక్కించుకున్నాడు.

# 60 సంవత్సరాల్లో 55,02,284 శాతం

సీఈఓ పదవికి బఫెట్ గుడ్‌బై | గ్రెగ్ అబెల్‌కు కంపెనీ పగ్గాలు



బఫెట్ సారథ్యంలో బెర్క్‌షైర్ హ్యాత్‌వే స్టాక్ అందించిన రాబడి

ఒమాహా (అమెరికా): ప్రపంచ ప్రఖ్యాత స్టాక్ ఇన్వెస్టర్, బెర్క్‌షైర్ హ్యాత్‌వే చైర్మన్, సీఈఓ వారెన్ బఫెట్ ఎట్టకేలకు తన వారసుడిని ప్రకటించారు. ఈ ఏడాది చివరి నాటికి కంపెనీ సారథ్య బాధ్యతలను ప్రస్తుత వైస్ చైర్మన్ గ్రెగ్ అబెల్ చేతుల్లో పెట్టాలనుకుంటున్నట్లు గత శనివారం జరిగిన వాటాదారుల వార్షిక సమావేశం చివర్లో ప్రకటించారు. బఫెట్ సీఈఓ పదవి నుంచి తప్పుకోనున్నప్పటికీ కంపెనీ చైర్మన్‌గా మాత్రం కొనసాగుతారు. బఫెట్ నేతృత్వంలో బెర్క్‌షైర్ జైత్రయాత్ర సాగిందిలా..

- 94 ఏళ్ల బఫెట్.. గత 6 దశాబ్దాలుగా (1964-2024) బెర్క్‌షైర్ హ్యాత్‌వేకు సారథ్యం వహిస్తున్నారు. ఈ 60 వసంతాల్లో బెర్క్‌షైర్ హ్యాత్‌వేను ఓ విఫల టెక్స్‌టైల్ కంపెనీ నుంచి దాదాపు 180 వ్యాపారాల అతి పెద్ద సామ్రాజ్యంగా తీర్చిదిద్దారు. 1.2 లక్షల కోట్ల డాలర్ల (రూ.101 లక్షల కోట్లు) మార్కెట్ క్యాప్‌తో ప్రపంచంలోని అత్యంత విలువైన కంపెనీల్లో ఒకటిగా నిలబెట్టారు.
- గడిచిన అరవై ఏళ్లలో కంపెనీ స్టాక్ 55,02,284 శాతం రిటర్నులు పంచింది. అదే సమయంలో అమెరికన్ ఈక్విటీ ఇండెక్స్ 'ఎస్ అండ్ పీ 500' పంచిన రిటర్నులు 39,054 శాతమే. ఈ ఆరు దశాబ్దాల్లో బెర్క్‌షైర్ హ్యాత్‌వే షేరు విలువ ఏటేటా 19.9 శాతం చొప్పున వృద్ధి (సీఏజీఆర్) చెందుతూ వచ్చింది. ఎస్ అండ్ పీ 500 ఇండెక్స్ 10.4 శాతం సీఏజీఆర్‌తో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు.
- ప్రపంచంలోని అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీల జాబితాలో బెర్క్‌షైర్ ప్రస్తుతం 8వ స్థానంలో ఉంది.
- బెర్క్‌షైర్ గ్రూప్ వ్యాపారాల వార్షిక ఆదాయం దాదాపు 40,000 కోట్ల డాలర్ల (రూ.33.72 లక్షల కోట్లు) స్థాయికి చేరుకుంది.
- ఈ మార్చి 31 నాటికి కంపెనీ వద్ద ఉన్న నగదు నిల్వలు 34,770 కోట్ల డాలర్లకు (రూ.29.31 లక్షల కోట్ల పైమాటే) పెరిగాయి. అంతేకాదు, ప్రస్తుతం చలామణిలో ఉన్న యూఎస్ ట్రెజరీ బిల్లుల్లో 5 శాతం కంపెనీ చేతుల్లో ఉన్నాయి.
- గత ఏడాది చివరినాటికి కంపెనీలో 3.92 లక్షలకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

# బిజినెస్

## వడ్డీరేట్లు మరింత కిందికే

**మార్చిలోగా మరో 1.5% కోత..ఎస్‌బీఐ రీసెర్చ్**

న్యూఢిల్లీ: దేశంలో వడ్డీరేట్లు మరింత తగ్గడమే తప్ప, పెరిగే అవకాశం లేదని ఎస్‌బీఐ రీసెర్చ్ తేల్చి చెప్పింది. 2026 మార్చితో ముగిసే వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ కీలక రెపోరేటును 1.25 శాతం నుంచి 1.5 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని అంచనా వేసింది. గత నెల జరిగిన ఎంపీసీ భేటీలో ఆర్‌బీఐ రెపోరేటును 6.25 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గించింది. వచ్చే ఏడాది మార్చిలోగా మరో ఒక శాతం నుంచి 1.25 శాతం తగ్గించే అవకాశం ఉందని 'ద్రవ్యోల్బణం, రేట్ల కోత గమనం' పేరుతో విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. జూన్, ఆగస్టుల్లో జరిగే ఎంపీసీ సమావేశాల్లో ముప్పావు శాతం, వచ్చే ఏడాది మార్చిలోగా జరిగే భేటీల్లో మరో అర శాతం రెపో రేటు తగ్గించే అవకాశం ఉందని అంచనా వేసింది.

**కలిసొచ్చే అంశాలు:** ఈ ఆర్థిక సంవత్సరం రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు శాతం మించే అవకాశం లేకపోవడం ఆర్‌బీఐ రెపోరేటు తగ్గింపునకు ప్రధానంగా దోహదం చేయనుంది. మార్చి రిటైల్ ద్రవ్యోల్బణం ఇప్పటికే 67 నెలల కనిష్ఠ స్థాయి 3.34 శాతానికి దిగొచ్చింది. ప్రస్తుత ధరల ప్రకారం జీడీపీ వృద్ధిరేటు సైతం తొమ్మిది నుంచి తొమ్మిదిన్నర శాతం మధ్యన ఉండవచ్చునని అంచనా. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ రేపోరేటును పావు శాతం చొప్పున కాకుండా ఒకేసారి అర శాతం చొప్పున తగ్గిస్తే, ఆర్థిక వ్యవస్థపై ఆ ప్రభావం త్వరగా కనిపిస్తుందని ఎస్‌బీఐ రెసెర్చ్ అంచనా. ఈ సంవత్సరం డాలర్‌తో రూపాయి మారకం రేటు కూడా రూ.85-87 మధ్య స్థిరపడే అవకాశం ఉందని తెలిపింది.

## మహీంద్రా లాభంలో 13.5% వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో రూ.3,541.85 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.3,124.94 కోట్లతో పోల్చితే లాభం 13.34 శాతం పెరిగింది. ఆటో, వ్యవసాయ పరికరాల రంగాలు ప్రదర్శించిన అద్భుత పురోగతి ఇందుకు కారణం. కాగా ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.35,373.34 కోట్ల నుంచి రూ.42,585.67 కోట్లకు చేరింది. ఆటో విభాగంలో అమ్మకాలు 18 శాతం పెరిగి 2.53 లక్షల యూనిట్లకు చేరాయని ఆటోమోటివ్, వ్యవసాయ పరికరాల విభాగం సీఈఓ రాజేష్ జెజూరికర్ తెలిపారు. ఆదాయంలో ఎస్‌యూవీ అమ్మకాల వాటా 3.10 శాతం, ఎల్‌సీవీల వాటా 4.80 శాతం పెరిగినట్టు చెప్పారు. ట్రాక్టర్ల విభాగంలో జీవితకాల గరిష్ఠ స్థాయిలో 41.2 శాతంమార్కెట్ వాటా సాధించామన్నారు. మొత్తం త్రైమాసిక వ్యయాలు రూ.39,113.61 కోట్లుగా నమోదయ్యాయని తెలిపారు. త్రైమాసికంలో మొత్తం 2,53,028 వాహనాలు విక్రయించినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా మార్చి 31వ తేదీతో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,58,749.75 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.14,073.17 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించినట్టు గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అమర్‌జ్యోతి బారువా చెప్పారు. కాగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఒక్కో షేరుపై రూ.25.30 తుది డివిడెండును ప్రకటించింది.

**కార్ల తయారీకి కొత్త ప్లాంట్:** ప్రయాణికుల వాహనాల తయారీ కోసం కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది. 2028 మార్చి నాటికి ఈ ప్లాంట్ పని ప్రారంభిస్తుందని జెజూరికర్ తెలిపారు. అది పూర్తిగా భవిష్యత్ దృక్పథంతో, అధునాతన టెక్నాలజీలతో నిర్మించే అతి పెద్ద ప్లాంట్ అని ఆయన చెప్పారు. ప్రస్తుతానికి ఆ ప్లాంట్‌ను ప్రయాణికుల వాహనాలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని వాహనాల తయారీకి కూడా అవకాశాలు కల్పించే అంశం పరిశీలించవచ్చునని ఆయన తెలిపారు. ఏ ప్రాంతంలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నది ఇంకా నిర్ణయించలేదని, ఇందు కోసం వివిధ రాష్ట్రాల్లో అందుబాటులో ఉన్న పెట్టుబడి సబ్సిడీలు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామని ఆయన వెల్లడించారు. అయితే ఇందుకు అవసరం అయిన నిధులను మాత్రం పెట్టుబడి వ్యయాల్లో కేటాయించామని ఆయన తెలిపారు.

### ఐఎంఎఫ్ బోర్డులో భారత ప్రతినిధిగా అయ్యర్


న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమేశ్వరన్ అయ్యర్‌ను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) బోర్డులో భారత్ తరఫున డైరెక్టర్‌గా ప్రభుత్వం తాత్కాలికంగా నియమించింది. ఐఎంఎఫ్ బోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న కేవీ సుబ్రమణియన్‌ను ఆకస్మికంగా తప్పించిన ప్రభుత్వం.. ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు ఈ నియామకం జరిపింది. ఈ నెల 9న ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశమవుతున్న నేపథ్యంలో ఈ నియామకం ఆవశ్యకమైంది. ఎందుకంటే, ఆర్థికంగా దివాలా తీసిన పాకిస్థాన్‌కు 700 కోట్ల డాలర్ల ఉద్దీపన ప్యాకేజీపై ఐఎంఎఫ్ బోర్డు ఈ భేటీలోనే సమీక్ష జరపనుంది.

### ఆర్‌బీఐ వద్ద 880 టన్నుల పసిడి

ముంబై: ఆర్‌బీఐ కూడా పెద్ద ఎత్తున పసిడి కొనుగోలు చేస్తోంది. గత ఆర్థిక సంత్సరం 57 టన్నుల పసిడి కొనుగోలు చేసింది. గత ఏడేళ్లలో ఆర్‌బీఐ ఎన్నడూ ఇంత పెద్ద మొత్తంలో పసిడి కొనుగోలు చేయలేదు. ఇందులో 25 టన్నులు 2024 సెప్టెంబరు-2025-మార్చి మధ్య కొనుగోలు చేసింది. దీంతో గత నెలాఖరు నాటికి ఆర్‌బీఐ వద్ద ఉన్న పసిడి నిల్వలు 879.59 టన్నులకు చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 24.86 టన్నులు ఎక్కువ. దీంతో ఆర్‌బీఐ మొత్తం విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో పసిడి వాటా గత నెలాఖరుకు 11.70 శాతానికి చేరింది.

## క్రూడ్ డౌన్.. మార్కెట్ అప్

- 60 డాలర్ల దిగువకు ముడిచమురు
- 295 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్




ముంబై: ఈక్విటీ సూచీలు సోమవారం 4 నెలల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. అంతర్జాతీయ విపణిలో బ్యారెల్ క్రూడాయిల్ ధర 60 డాలర్ల కన్నా దిగి రావడం ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ ఒకదశలో 547.04 పాయింట్ల లాభంతో 81,049.03 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 294.85 పాయింట్ల వృద్ధితో 80,796.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114.45 పాయింట్లు బలపడి 24,461.15 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో సూచీలకిదే గరిష్ఠ ముగింపు స్థాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు కొనసాగడం కూడా మార్కెట్ లాభాలకు దోహదపడింది.

**ఆయిల్ షేర్లు హైజంప్ :** ముడిచమురు ధరలు బాగా తగ్గడంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల షేర్లు మంచి లాభాలను నమోదు చేశాయి. హెచ్‌పీసీఎల్ 6.65 శాతం, ఐఓసీ 3.66 శాతం, బీపీసీఎల్ 3.25 శాతం పెరిగాయి. జూన్‌లో చమురు ఉత్పత్తిని మరింత పెంచనున్నట్లు సౌదీ అరేబియా నేతృత్వంలోని పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య (ఒపెక్+) ప్రకటించడంతో క్రూడాయిల్ ధర 60 డాలర్ల కన్నా దిగువకు తగ్గింది.

**అదానీ షేర్లు జూమ్**

అదానీ గ్రీన్ ఎనర్జీ నుంచి సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాలు చేసుకునేందుకు ఏపీ సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులకు రూ.2,200 కోట్ల లంచాలు ఇచ్చారనే ఆరోపణలపై గత ఏడాదిలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా 8 మంది వ్యక్తులపై అమెరికాలో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో నేరారోపణలను రద్దు చేయాలంటూ అదానీ తరఫున ప్రతినిధులు అమెరికా అధికారులను కలిసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ షేరు ఏకంగా 11.01 శాతం ఎగబాకగా.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6.96 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 6.61 శాతం, అదానీ పోర్ట్స్ 6.29 శాతం, అదానీ పవర్ 5.96 శాతం పెరిగాయి. దాంతో గ్రూప్ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13.33 లక్షల కోట్లకు పెరిగింది.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 27 పైసలు పెరిగి రూ.84.30 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో లాభాలతోపాటు ముడిచమురు ధరల తగ్గుదల ఇందుకు తోడ్పడ్డాయి.

### షెల్ గూటికి బీపీ?

అంతర్జాతీయ ఇంధన రంగంలో త్వరలోనే మెగా డీల్ కుదిరే అవకాశాలు కన్పిస్తున్నాయి. బ్రిటిష్ ఇంధన దిగ్గజం బీపీ పీఎల్‌సీని కొనుగోలు చేసేందుకు బ్రిటన్‌కు చెందిన మరో ప్రముఖ ఆయిల్ కంపెనీ షెల్ పీఎల్‌సీ ఆసక్తిగా ఉన్నట్లు తెలిసింది. మార్కెట్లో ముడిచమురు ధరలతోపాటు బీపీ స్టాక్ మరింతగా తగ్గుముఖం పట్టాక టేకోవర్ చేయాలని షెల్ యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**




| 6వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 475 | విజయవాడ | 500 |
| వరంగల్ | 477 | గోదావరి | 490 |
| చిత్తూరు | 553 | విశాఖపట్నం | 500 |
| | | డజను గుడ్లు రూ. 66 | |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 140 | విజయవాడ | 142 |
| వరంగల్ | 140 | గుంటూరు | 140 |
| కరీంనగర్ | 140 | ఒంగోలు | 140 |
| మహబూబ్‌నగర్ | 140 | చిత్తూరు | 112 |
| కర్నూలు | 140 | నెల్లూరు | 117 |
| విశాఖపట్నం | 141 | అనంతపురం | 117 |
| గోదావరి | 142 | | |



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 95,730 ▲ | 87,750 ▲ | 1,08,000 ▼ |
| విజయవాడ | 98,300 ▲ | 92,500 ▲ | 96,700 ▲ |
| విశాఖపట్నం | 98,300 ▲ | 87,750 ▲ | 1,08,000 ▼ |
| రాజమండ్రి | 95,730 ▲ | 87,750 ▲ | 96,600 ▲ |
| ప్రొద్దుటూరు | 96,700 ▲ | 88,320 ▲ | 96,000 ▼ |
| ముంబై | 95,280 ▲ | 87,780 ▲ | 94,100 ▼ |


కేంద్రమంత్రి గడ్కరీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, ఎంపీ లక్ష్మణ్

# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి ఆమోదం తెలపండి

- ఆర్థిక అనుమతులు మంజూరు చేయండి
- ప్రాజెక్టును ఒకేసారి పూర్తిచేసేందుకు సహకరించండి
- గడ్కరీకి రేవంత్ విజ్ఞప్తి.. కేంద్ర మంత్రితో సీఎం భేటీ

హైదరాబాద్/బేగంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంతో పాటు ఇప్పటికే టెండర్లను ఆహ్వానించిన నేపథ్యంలో ఆర్థిక అనుమతులను మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన గడ్కరీ తిరుగు ప్రయాణంలో సాయంత్రం 8 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ క్రమంలో అక్కడి లాంజ్‌లో ఆయనతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణాలపై గడ్కరీతో చర్చించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగంతో పాటు దక్షిణభాగం నిర్మాణాన్ని ఏకకాలంలో పూర్తిచేసేందుకు సహకరించాలని కోరారు. ఎన్‌హెచ్-765లోని హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను వీలైనంత త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్)-ఆర్ఆర్ఆర్‌లను కలుపుతూ రేడియల్ రోడ్ల అభివృద్ధి ఆవశ్యకతను గడ్కరీకి వివరించారు. హైదరాబాద్-డిండి-మన్ననూర్, హైదరాబాద్-మంచిర్యాల గ్రీన్‌ఫీల్డ్ హై వే, ఓఆర్ఆర్ నుంచి మన్నెగూడ వరకు రేడియల్ రోడ్ల అభివృద్ధి పనులు కూడా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్‌లో ఐడీటీఆర్ ఏర్పాటు చేయండి

- ఐటీఎంఎస్ ఏర్పాటుకు రూ.55 కోట్లు ఇవ్వండి
- ఎస్ఏఎస్‌సీఐకి రూ.176.5 కోట్లు విడుదల చేయండి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి పొన్నం లేఖ



హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రవాణా రంగ అభివృద్ధికి కేంద్ర సర్కారు సహకారం అందించాలని కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐటీఎంఎస్), డ్రైవింగ్ ట్రైనింగ్ సంస్థల ఏర్పాటు, డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఆటోమేషన్, ఎలక్ట్రిక్ వాహన ప్రోత్సాహం వంటి రంగాల్లో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఐడీటీఆర్) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సిరిసిల్లలో ఉన్న ఐడీటీఆర్ నగరానికి దూరంగా ఉండటం ఇబ్బందిగా మారిందని అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 40 ఎకరాల భూమి ఉందని, అక్కడ కొత్త ఐడీటీఆర్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించి తక్షణమే ఈ-చలాన్లు జారీ చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను(ఐటీఎంఎస్) తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించిందని, దీని కోసం కేంద్రం రూ.55 కోట్లు సాయం అందించాలన్నారు. వాహన స్క్రాపింగ్ విధానం మరియు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల అమలులో భాగంగా కేంద్రం మంజూరు చేసిన రూ.176.5 కోట్లు ఇంకా విడుదల చేయలేదని, వాటిని 2025-26 ఆర్థిక సంవత్సరంలో తప్పనిసరిగా విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న 57 డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను ఆటోమేట్ చేయడానికి రూ.43.45 కోట్ల ఖర్చు అవుతుందని, డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను పారదర్శకంగా మార్చే ఈ ప్రయత్నానికి కేంద్రం నిధులు ఇవ్వాలని గడ్కరీని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## కులగణన, ఎస్సీ వర్గీకరణ.. టీకాంగ్రెస్ విజయాలు: మహేశ్ గౌడ్



హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): కులగణన, ఎస్సీ వర్గీకరణ రెండూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సాధించిన గొప్ప విజయాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఒత్తిడి వల్లే జనగణనతో పాటు కులగణన చేపడతామంటూ కేంద్రం ప్రకటించిందని చెప్పారు. గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్‌ను కలిసిన గౌడ సంఘం నేతలు.. ఖమ్మంలో గౌడసంఘం భవన నిర్మాణానికి నిధులివ్వాలని కోరారు.మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చించి.. నిధులు ఇప్పిస్తానంటూ మహేశ్‌గౌడ్ హామీనిచ్చారు. తాను గౌడ్‌గా పుట్టినందుకు గర్విస్తున్నానని.. రాజకీయంగా గౌడ్‌లు ఎదగాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ (ఏఐపీసీ) తలపెట్టిన మన్మోహన్‌సింగ్ ఫెలోషిప్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని మహేశ్‌గౌడ్ ఆవిష్కరించారు.

## సోమశిల నుంచి సిద్దేశ్వరానికి కేబుల్ బ్రిడ్జిని మంజూరు చేయండి..

- గడ్కరీని కోరిన కాంగ్రెస్ ఎంపీలు

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల నుంచి సిద్దేశ్వరానికి కేబుల్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కాంగ్రెస్ ఎంపీలు కోరారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు హైదరాబాద్‌కు వచ్చిన గడ్కరీని ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, బలరాం నాయక్, రఘువీర్‌రెడ్డి కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. 'అలంపూర్ క్రాస్ రోడ్డు నుంచి నల్లగొండ, గద్వాల నుంచి రాయ్‌చూర్ వరకు జాతీయ రహదారులు మంజూరు చేయాలి. మద్దిమడుగు నుంచి ఏపీలోని మాచర్ల మీదుగా కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించాలి. యాదగిరిగుట్ట కారిడార్‌ను అభివృద్ధి చేయాలి' అని ఎంపీలు కోరారు. తమ ప్రతిపాదనలపై గడ్కరీ సానుకూలంగా స్పందించారని చామల ఓ ప్రకటనలో వెల్లడించారు.

## మా సమస్యలు గుర్తించండి:ఎంపీడీవోల సంఘం

తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఎంపీడీఓలు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ సృజనకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం అధ్యక్షురాలు జె.పద్మావతి, కార్యదర్శి మోహన్, ఇతర ఎంపీడీఓలు పీఆర్ డైరెక్టర్‌ను కలిసి కార్యాలయ నిర్వహణ ఖర్చులు, వాహన సౌకర్యం, ఇతర సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో తిరిగే అవసరం ఎక్కువగా ఉంటుందని, 24నెలలుగా పెండింగ్‌లో ఉన్న వాహన అలవెన్స్‌లను పునరుద్ధరించాలని, ట్రెజరీ ద్వారా చెల్లింపులు జరిపేలా చూడాలని ఎంపీడీఓలు కోరారు.

## అర్హతలతో సంబంధం లేకుండా జీపీవోలుగా అవకాశాలు ఇవ్వండి

- నవీన్ మిత్తల్‌ను కోరిన రెవెన్యూ ఉద్యోగుల సంఘం

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): అపార పని అనుభవం ఉన్న పూర్వపు వీఆర్వో, వీఆర్ఏలకు అర్హతలతో సంబంధం లేకుండా గ్రామ పాలనా అధికారులుగా(జీపీవో) పనిచేసే అవకాశం కల్పించాలని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం(టీజీఆర్ఎస్ఏ) అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉద్యోగ సంఘం నాయకులతో కలిసి భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు వినతి పత్రం అందజేశారు. 2018-19సంవత్సరంలో వీఆర్వోలుగా పదోన్నతులు పొందిన సుమారు 250 మంది ప్రస్తుతం వివిధ విభాగాల్లో పని చేస్తున్నారని అధికారులకు వివరించారు. సాంకేతిక కారణాలతో దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి మరో అవకాశం కల్పించాలని లచ్చిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## బండి సంజయ్‌ది ఉగ్రవాద భాష:చాడ

భీమదేవరపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): 'పేల్చేస్తాం.. లేపేస్తాం' అనే భాషను ఉగ్రవాదులు వాడతారని, అలాగే మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌దీ ఉగ్రవాద భాషే అవుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో వారు మాట్లాడారు. ఎంపీగా ఎన్నికైన సంజయ్ ఉగ్రవాద భాష మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులను అంతమొందిస్తామని అమిత్‌షా, బండి సంజయ్ మాట్లాడడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను ఆపేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు.

## 1న డల్లాస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవాలు

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని డల్లాస్ నగరంలోనూ బీఆర్ఎస్ రజతోత్సవాలను నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏడాది పాటు రజతోత్సవాలను జరపాలని నిర్ణయించిన విషయం విదితమే..! అందులో భాగంగానే డల్లాస్ నగరంలో రజతోత్సవాలను చేపట్టాలని నిర్ణయించినట్లు బీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేష్‌బిగాల, యూఎస్ఏ పార్టీ అడ్వైజరీబోర్డు చైర్మన్ తన్నీరు మహేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డల్లాస్‌లోని పెప్పర్‌అరేనాలో జూన్ 1న చేపట్టే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. అమెరికాతో పాటు.. వివిధ దేశాల్లోనూ ఏడాదిపాటు పార్టీ రజతోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు.

# అమృత సరోవరంగా రాష్ట్రం

(మొదటిపేజీ తరువాయి)

వెయ్యి అమృత సరోవర్లను నిర్మించామని, తద్వారా భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. రూ.3,099 కోట్లతో నిర్మించిన మంచిర్యాల-వాంకిడి జాతీయ రహదారి-363ని సోమవారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద గడ్కరీ ప్రారంభించారు. మరో రూ.3 వేల కోట్లతో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. అదే విధంగా హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ చౌరస్తాలో రూ.138 కోట్లతో, అంబర్‌పేటలో రూ.145 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్లను గడ్కరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద, అంబర్‌పేటలో జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని ఏ పట్టణం నుంచైనా ఐదు గంటల్లో హైదరాబాద్‌కు వచ్చేలా జాతీయ రహదారుల వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వచ్చే మూడేళ్లలో తెలంగాణలో పలు ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలను హైదరాబాద్‌కు అనుసంధానం చేసేలా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు చేస్తున్న సంస్థను మార్చామని 8, 10 నెలల్లో పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్-విశాఖపట్టణం మధ్య నిర్మించే రహదారితో ప్రయాణ సమయం 12 నుంచి 6 గంటలకు తగ్గుతుందని చెప్పారు. రూ.20వేల కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న హైదరాబాద్-గోవా జాతీయ రహదారితో 50 కి.మీ. దూరం తగ్గనుందన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల రోడ్డును ఆరు లేన్లకు విస్తరించనున్నట్టు గడ్కరీ పేర్కొన్నారు. రూ.16 వేల కోట్లతో చేపడుతోన్న నాగ్‌పూర్-విజయవాడ రహదారి 21శాతం పూర్తయిందని, పనులు పూర్తయితే ఈ మార్గంలో ప్రయాణ సమయం 13 నుంచి 6 గంటలకు తగ్గుతుందన్నారు. మనోహరాబాద్‌లో రూ.2 వేల కోట్లతో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు నిర్మిస్తున్నామని గడ్కరీ చెప్పారు. కృష్ణానదిపై రూ.1200 కోట్లతో ఐకానిక్ బ్రిడ్జి నిర్మించనున్నట్టు గడ్కరీ ప్రకటించారు. వంతెన అందుబాటులోకి వస్తే హైదరాబాద్, నంద్యాల, తిరుపతి, చెన్నై మధ్య 80 కి.మీ. దూరం తగ్గుతుందని పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో ఫ్లాష్ చార్జింగ్ బస్సులు(గడ్కరీ ఎయిర్ బస్) అందుబాటులోకి తెచ్చామని, 100కుపైగా సీటింగ్ సామర్థ్యం ఉండే బస్సులో అల్పాహారం, టీ వంటివి లభిస్తాయని, బస్ హోస్టెస్ కూడా ఉంటారని చెప్పారు. హైదరాబాద్ రింగు రోడ్డుపై ఎయిర్ బస్ నడిపి చూడాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.


కాగజ్‌నగర్‌లో ఎన్‌హెచ్-363 ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రులు గడ్కరీ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎంపీలు నగేశ్, వంశీ కృష్ణ

### బయోచార్ బ్రోచర్ ఆవిష్కరణ

గ్రామీణ పారిశ్రామిక వేత్తలు, రైతులకు నైపుణ్యాభివృద్ధి కోసం బయోచార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్ర మంత్రి గడ్కరీ అన్నారు. రంగారెడ్డి జిల్లా కన్హాశాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్, పేపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బయోచార్ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. బయోచార్ విధానం వల్ల దేశంలో వ్యవసాయం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

### శరవేగంగా ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణం: కిషన్‌రెడ్డి

దేశంలో ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కాగజ్‌నగర్ సభలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం రోడ్డు, రైల్వే, విమానాల కనెక్టివిటీ పెంచిందని తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్, మంచిర్యాల రాజీవ్ రహదారి అధ్వానంగా ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నాణ్యత లేకుండా పనులు చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రాజీవ్ రహదారికి సంబంధించి కొన్ని సమస్యలున్నాయని, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు. రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ కూడా ఇచ్చారని తెలిపారు. తాము ఎన్నికల వరకే రాజకీయాలు చేస్తామని, తర్వాత అభివృద్ధే లక్ష్యమని సంజయ్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అటవీ అనుమతులకు క్లియరెన్స్ ఇచ్చేలా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ రహదారులను నిర్మించాలని, అటవీ అనుమతులు లేని రహదారులకు అనుమతులు ఇప్పించాలని మంత్రి సీతక్క కోరారు.

రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే..

## మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలి

అనేక మందిని నక్సల్స్ అన్యాయంగా చంపేశారు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

గోదావరిఖని, మే 5(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల మెప్పు పొందేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ పోటీ పడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీనే మావోయిస్టులను నిషేధించిందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్.. మావోయిస్టులపై నిషేధం ఎత్తివేసి చర్చలు ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. మావోయిస్టు పార్టీతో చర్చలు లేవని, వారు బేషరతుగా తుపాకులు వీడి లొంగిపోవాలన్నారు. రాష్ట్రంలో పీపుల్స్ వార్ పార్టీ, మావోయిస్టులు అనేక విధ్వంసాలకు పాల్పడ్డారని, ఎంతో మంది ప్రజాప్రతినిధులు, నాయకులను పొట్టన పెట్టుకున్నారని పేర్కొన్నారు. ధర్మం కోసం పాటుపడిన ఎంతో మంది జాతీయ వాదులను దుర్మార్గంగా కడతేర్చారని చెప్పారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ గురించి మాట్లాడుతున్న హరగోపాల్, వరవరరావులు అంత్యక్రియల్లో మృతదేహాలను మోయడం తప్ప ఏం సాధించారో చెప్పాలన్నారు.


## పిల్లలు పుట్టినా కల్యాణలక్ష్మి ఊసేలేదు: ఈటల

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి చెక్కులను పెళ్లి పందిరిలోనే అందజేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చినవారు, ఇప్పుడు పిల్లలు పుట్టాక కూడా ఇవ్వడం లేదని ఎంపీ ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేయడానికి నైతిక హక్కు లేదని విమర్శించారు. బిల్లులు చెల్లించేందుకు మంత్రులకు 10 శాతం కమీషన్ ఇవ్వాల్సిన దయనీయ పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని, అలా ఇచ్చినా కూడా బిల్లులు పొందలేక పోతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతున్నారు కానీ రాజ్యాంగ రచయిత అంబేద్కర్‌ను ఓడించింది కాంగ్రెస్ పార్టీయే అని ఈటల అన్నారు.

# జగ్గారెడ్డితో ఆదిశ్రీనివాస్, వినోద్‌రెడ్డి భేటీ

- పటాన్‌చెరు కాంగ్రెస్ రాజకీయాలపై చర్చ
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, సీనియర్ నేత కాట శ్రీనివాస్‌గౌడ్‌లను సమన్వయం చేయండి
- ఈ మేరకు అభిప్రాయం చెప్పిన జగ్గారెడ్డి

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డిలు సోమవారం భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని జగ్గారెడ్డి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న రాజకీయ అంశాలపైన వారు చర్చించుకున్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత కాట శ్రీనివాస్‌గౌడ్.. ఆయన అనుచరులకు మధ్య వివాదం నెలకొని ఉన్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి విచారణ కోసం ఆది శ్రీనివాస్, వినోద్ రెడ్డిలతో టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ కమిటీ వేశారు. ఈ వివాదం పరిష్కారానికి ఉమ్మడి మెదక్ జిల్లా ముఖ్య నాయకులను ఆది శ్రీనివాస్, వినోద్‌రెడ్డిలు కలుస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు జగ్గారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డిని, కాటం శ్రీనివాస్‌గౌడ్.. ఆయన అనుచరులనూ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని కమిటీ సభ్యులకు జగ్గారెడ్డి తన అభిప్రాయంగా చెప్పారు.



# సాదాబైనామాపై ఏం చేద్దాం?

(మొదటిపేజీ తరువాయి)

పెద్దసంఖ్యలో వచ్చే అవకాశాలుండడం.. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండడంతో ఈ కేటగిరీని తాత్కాలికంగా తొలగించినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి భూపరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) ఇంకా కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. శక్తిమంతమైన కౌంటర్ వేసి, కేసును కొట్టివేయించాక.. సాదాబైనామాల సమస్య పరిష్కారంపై సర్కారు పూర్తిస్థాయిలో దృష్టి సారించే అవకాశాలున్నాయి.

### దరఖాస్తుల పెండింగ్‌కు కారణాలివే..

ప్రస్తుతం ప్రభుత్వం వద్ద 9.26 లక్షల మేర సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో ధరణికి ముందు వరకు ఉన్న దరఖాస్తులు 2.26 లక్షలు. ఇవన్నీ జూన్ 2, 2014కు ముందు జరిగిన సాదాబైనామా లావాదేవీలే. పాత ఆర్వోఆర్ చట్టం రద్దయి.. ధరణి అమల్లోకి వచ్చిన (అక్టోబరు 28, 2020) తర్వాత మరో 7 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇవన్నీ 2020 అక్టోబరు 28వ తేదీ కటాఫ్(జీవో 122 ప్రకారం)గా వచ్చినవే. అయితే.. సాదాబైనామాల విషయంలో సర్కారు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. నిర్మల్‌కు చెందిన ఓ రైతు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని(పిల్) దాఖలు చేశారు. రద్దు చేసిన చట్టం ఆధారంగా దరఖాస్తులను ఎలా స్వీకరిస్తారని తన పిటిషన్‌లో ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. 2020 నవంబరు 11న తీర్పునిచ్చింది. 2020 అక్టోబరు 29 తరువాత వచ్చిన సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనను నిలిపివేయాలని ఆదేశించింది. ఆ ఏడాది అక్టోబరు 12 నుంచి 28 మధ్య వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలనలోకి తీసుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే తుది తీర్పు వరకు వాటికి కల్పించే చట్టబద్ధత నిలిపివేయాలని ఆదేశించింది. న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు ప్రభుత్వం అడ్వొకేట్ జనరల్(ఏజీ) ద్వారా కౌంటర్ దాఖలు చేసి.. సాదాబైనామాపై ఉన్న పెండింగ్ కేసును కొట్టివేయించాల్సి ఉంది. కోర్టు 2020లో ఇచ్చిన మధ్యంతర ఆదేశాల సమయానికి ధరణిలో సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారానికి చట్టబద్ధత లేదు. కానీ, భూభారతి చట్టంలో ప్రభుత్వం సాదాబైనామా సమస్యలకు పరిష్కారాలను సూచించింది. భూభారతిలో ఈ సమస్య చట్టబద్ధమైనదే కావడంతో.. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ఆస్కారముంది. అయితే.. అధికారులు మాత్రం కేసు తేలే వరకు కటాఫ్(అక్టోబరు 28, 2020)కి ముందు వరకు వచ్చి 2.26 లక్షల దరఖాస్తులకు పరిష్కారం చూపాలని భావిస్తున్నారు. నిర్మల్ రైతు వేసిన పిల్‌ను కోర్టు కొట్టివేసిన తర్వాత.. మిగతా 7 లక్షల దరఖాస్తులకు పరిష్కారం చూపవచ్చని నిర్ణయించినట్లు తెలిసింది.



### భూభారతితో పరిష్కారం

గతంలో ధరణి చట్టానికి చట్టబద్ధత లేనందున సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి అవకాశం లేదు. అందుకే కోర్టు 2020 అక్టోబరు 29 తరువాత వచ్చిన సాదాబైనామా దరఖాస్తులను నిలిపివేయాలని ఆదేశించింది. భూభారతి చట్టంలో ఈ సమస్యకు చట్టబద్ధత కల్పించినందున పరిష్కరించేందుకు వీలుంది. అయితే పాత కేసులో తుది తీర్పు వచ్చే వరకు పాత దరఖాస్తుల చట్టబద్ధతను నిలిపివేయాలని కోర్టు ఆదేశించినందున.. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసి.. కేసు కొట్టివేయించవచ్చు. ఆ తర్వాత సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవచ్చు.

\- భూమి సునీల్, భూ చట్టాల నిపుణుడు

### నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..?

సాదాబైనామా చట్టబద్ధతకు కొన్ని ముఖ్యమైన అర్హతలను ప్రభుత్వం భూభారతి చట్టంలో పేర్కొంది. అవి..

- సాదాబైనామా ఒప్పందం 2014 జూన్ 2కు ముందు జరిగి ఉండాలి
- ఒప్పందం చేసుకున్న వ్యక్తి చిన్న/సన్నకారు రైతు అయ్యి ఉండాలి
- భూపరిమితి విధించింది. అంటే.. 2.5 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్ట భూమి దాటని సాదాబైనామాలను పరిష్కరించాలని నిర్ణయించింది
- కొనుగోలు చేసిన భూమి గ్రామీణ ప్రాంతంలోనే ఉండాలి. నగర ప్రాంతాలకు ఈ నిబంధన వర్తించదు
- సాదాబైనామా ఒప్పందం ద్వారా కొనుగోలు చేసిన భూమి అనుభవంలో ఉండాలి

## హెచ్‌టీ కొత్త కనెక్షన్ల జారీకి సింగిల్ విండో!

- ఆగస్టు నాటికి అందుబాటులోకి..
- మెరుగైన సేవలే లక్ష్యంగా చర్యలు
- 'ఆంధ్రజ్యోతి'తో టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌టీ కొత్త కనెక్షన్ల జారీకి ఆగస్టు నాటికి సింగిల్ విండో విధానం అందుబాటులోకి తీసుకువస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూఖి తెలిపారు. హెచ్‌టీ వినియోగదారులు కార్యాలయాలకు రాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే కనెక్షన్లు ఇచ్చేలా ఈ విధానం రూపొందించినట్లు తెలిపారు. ఆగస్టు మొదటి వారానికల్లా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్ టీజీ ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో సీఎండీ ముషారఫ్ మాట్లాడారు. దక్షిణ డిస్కంలో సాంకేతికత పరంగా అనేక మార్పులు తీసుకువస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రంగారెడ్డి, మేడ్చల్, పఠాన్‌చెరువుతో పాటు శివారు ప్రాంతాల్లో వస్తున్న భారీ పరిశ్రమలు, అంతర్జాతీయ సంస్థల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆ ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. డిస్కంలో మొత్తం 13,099 హెచ్‌టీ కనెక్షన్లు ఉండగా ఇప్పటి వరకు వెయ్యి కనెక్షన్లకు ఏఎంఆర్ విధానంతో ప్రతి నెలా 30వ తేదీన అర్ధరాత్రి బిల్లు ఆటోమేటిక్‌గా వినియోగదారులకు ఈ మెయిల్ ద్వారా వెళుతుందన్నారు. రెండు నెలల తర్వాత హెచ్‌టీ బిల్లుల జారీ ప్రక్రియ అంతా ఆటోమెటిక్ ఆన్‌లైన్ రీడింగ్(ఏఎంఆర్)తో జరుగుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించామని, ఎక్కడ ఫీడర్ ట్రి ప్పింగ్ జరిగినా నిమిషాల్లో అక్కడికి సిబ్బంది వెళ్లి సమస్యలు పరిష్కరించేలా ఏర్పాటు చేసిన 1912 మొబైల్ వాహనాలు మంచి ఫలితాలిస్తున్నాయని తెలిపారు.

## బీసీ కులగణన కాంగ్రెస్ పేటెంట్: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): 'బీసీ కులగణన కాంగ్రెస్ పేటెంట్.. కులగణనకు పునాది రాయి వేసింది కాంగ్రెస్సే. తెలంగాణలో కులగణన విజయవంతమవడంతో బీజేపీ కళ్లు తెరిచింది. ఇక ఆ పార్టీ ఎన్ని సమావేశాలు పెట్టినా ప్రయోజనం ఉండదు' అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వానిది కులగణన సర్వే.. కేంద్రం చేపట్టేది కులగణన అంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ఆ రెండింటి మధ్య తేడా ఏంటో స్పష్టం చేయాలన్నారు. కులగణన సర్వే చేసినా, కులగణన చేసినా వ్యక్తుల కులం మారుతుందా అని ప్రశ్నించారు. గుజరాత్ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు బీసీ రిజర్వేషన్లు అమలవుతున్నాయని, దీనికి బండి సంజయ్ సమాధానం చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్‌లో కుర్చీ కోసం కేటీఆర్, కవిత, హరీశ్‌రావులు పోటీ పడుతున్నారన్నారు. హరీశ్ ట్రబుల్ షూటర్ అయితే.. కేటీఆర్ ఆయన్ను ఎందుకు సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేశారని ప్రశ్నించారు.


జస్టిస్ గిరిజాప్రియదర్శిని మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న సీఎం

## అధికారిక లాంఛనాలతో జస్టిస్ గిరిజా ప్రియదర్శిని అంత్యక్రియలు

» నివాళులు అర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి

రాయదుర్గం, మే 5(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కన్నుమూసిన హైకోర్టు న్యాయమూర్తి గిరిజా ప్రియదర్శిని అంత్యక్రియలు సోమవారం ప్రభుత్వ అధికార లాంఛనాలతో రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో జరిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు, బంధువులు, కుటుంబ సభ్యులు ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. పోలీసులు మూడు రౌండ్‌లు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం కుటుంబస భ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

**కొత్త సీఎస్ రామకృష్ణారావును అభినందించిన మంత్రి ఉత్తమ్**


మంత్రి ఉత్తమ్‌నుకలుసుకున్న సీఎస్, చిత్రంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు ప్రజలకు మెరుగైన సేవలందించాలని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. సీఎస్‌గా నియమితులైన రామకృష్ణారావు సోమవారం మర్యాదపూర్వకంగా మంత్రి ఉత్తమ్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారావుతో పాత పరిచయాన్ని మంత్రి ఉత్తమ్ గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్ల కిందట నల్గొండలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసినప్పటి నుంచి పరిచయమని, 1999లో ఎమ్మెల్యేగా ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని రామకృష్ణారావు చేతుల మీదుగా అందుకున్నానని మంత్రి చెప్పారు.

## స్టాఫ్‌నర్స్ రాత పరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్‌నర్స్ రాత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. అభ్యర్థులు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌లో తమ మార్కులు తెలుసుకోవచ్చని బోర్డు కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. గతేడాది నవంబరు 23న జరిగిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఫలితాలతోపాటు ఫైనల్ కీని వెబ్‌సైట్‌లో ఉంచారు. మొత్తం 2,322 నర్సు పోస్టులకుగాను 42,244 మంది దరఖాస్తు చేయగా 40,423 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రెండు సెషన్లలో జరిగింది. దీంతో మార్కులను నార్మలైజేషన్ చేశారు. కాగా ఉదయం సెషన్ వారికి ఒకటి రెండు మార్కులు పెరగ్గా... సాయంత్రం రాసిన వారికి ఒకటి రెండు తగ్గినట్లు అభ్యర్థులు తెలిపారు. తాజాగా విడుదలైన మార్కులకు వెయిటేజ్ మార్కులను కలిపి త్వరలోనే ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేయనున్నట్లు మెడికల్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.

## ఎప్‌సెట్ ప్రాథమిక 'కీ' విడుదల

ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీ విడుదలైంది. సమాధానాలు, రెస్పాన్స్ షీట్, మాస్టర్ క్వశ్చన్ పేపర్‌ను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎప్‌సెట్ కన్వీనర్ తెలిపారు. అభ్యంతరాలుంటే ఈనెల 7వతేదీ సాయంత్రం 5 గంటల లోపు తెలియజేయాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత ఫైనల్ కీ విడుదల చేసి ఫలితాలు ప్రకటిస్తారు.

## ఐపీఎస్ అభిలాష బిస్త్‌కు ఊరట

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ మధ్య క్యాడర్ వివాదంలో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారిణి అభిలాష బిస్త్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆమె తెలంగాణలోనే కొనసాగేలా హైకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. 2014 నుంచి మధ్యంతర ఉత్తర్వుల సహాయంతో ఆమె తెలంగాణలోనే కొనసాగుతున్నారని, ప్రస్తుతం అదే రక్షణను కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

## మాతృభాషతో కూడిన ఆంగ్లం ఉండాలి

» తెలంగాణ విద్యా కమిషన్ సదస్సులో నిపుణులు

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మాతృభాష తెలుగుకు ప్రాధాన్యం ఇస్తూనే ఆంగ్ల భాషనూ ప్రవేశపెట్టాలని విద్యారంగ నిపుణులు సూచించారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా మాధ్యమంగా ఇంగ్లిష్ నైపుణ్యాల పెంపు' అంశంపై సోమవారం రాష్ట్రస్థాయి సదస్సు నగరంలో జరిగింది. తెలంగాణ విద్యా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు చైర్మన్ ఆకునూరి మురళి అధ్యక్షత వహించారు. బోధనా మాధ్యమంగా ఇంగ్లిష్ అనే అంశాన్ని విశాల దృక్పథంతో, విద్యార్థుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని పరిశీలిస్తున్నామని అన్నారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసం, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని అన్నారు. ప్రాథమిక తరగతుల్లో మాతృభాషతోపాటు ఆంగ్లభాష కూడా ఉండాలని గిరిజన వర్గాల విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న ఎఱ్రాం సంతోష్, నిపుణుడు అశోక్ రెడ్డి, ఆచార్య సురేపల్లి సుజాత, డాక్టర్ సంతోష్ మహాపాత్ర తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## 2 నెలల్లో ట్రూ-అప్ పిటిషన్లు వేయండి

» రాష్ట్ర డిస్కమ్‌లకు టీజీఈఆర్‌సీ ఆదేశం

గత మూడేళ్ల (2022-23, 2023-24, 2024-25) కాలానికి రెండు నెలల్లో 'ట్రూ-అప్' పిటిషన్లు దాఖలు చేయడానికి రాష్ట్ర డిస్కమ్‌లకు టీజీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ అనుమతి ఇస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఒక ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత చార్జీల ఆదాయం, విద్యుత్ సంస్థల ఖర్చు మధ్య వ్యత్యాసాన్ని భర్తీ చేయడానికి ఈఆర్‌సీ ముంగిట సంబంధిత రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు).. ట్రూ-అప్ లేదా ట్రూ-డౌన్ పిటిషన్లు వేయాలి. ఆ పిటిషన్లపై ఈఆర్‌సీ ఆదేశాలకు అనుగుణంగా డిస్కమ్‌లు చార్జీల పెంపు ద్వారా ఖర్చులు సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. తాజాగా డిస్కమ్‌లు పిటిషన్‌లు వేయడానికి టీజీఈఆర్‌సీ అనుమతి ఇవ్వడంతో మూడేళ్లకు కలిపి వినియోగదారులపై ఎంత భారం పడుతుందో తేలాల్సి ఉంది.

## తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలో డీఎన్‌బీ పీజీ కోర్సులు

» మూడు విభాగాల్లో 7 సీట్లు మంజూరు

తార్నాకలోని టీజీఎస్ఆర్టీసీ ఆసుపత్రిలో డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ (డీఎన్‌బీ) పీజీ మెడికల్ కోర్సులకు అనుమతి లభించింది. మూడు విభాగాల్లో ఏడు సీట్లను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) మంజూరు చేసింది. జనరల్ మెడిసిన్‌లో 3, జనరల్ సర్జరీలో 2, ఆర్థోపెడిక్ సర్జరీలో 2 సీట్లు మొత్తం కలిపి 7 సీట్లు మంజూరయ్యాయి. ఆర్టీసీ ఆసుపత్రిని మెరుగైన వైద్య విద్యా సంస్థగా తీర్చిదిద్దేందుకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఎన్‌బీఈఎంఎస్‌కు దరఖాస్తు చేసింది. ఈ దరఖాస్తును సమగ్రంగా పరిశీలించిన ఎన్‌బీఈఎంఎస్ అనుమతి ఇచ్చింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభం కానున్నాయి. ఈ అనుమతితో తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత బలోపేతం అవుతాయని, ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందుతుందని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# నన్ను కోసినా...!

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు మొత్తం కలిస్తే కేవలం 2 శాతం మాత్రమే ఉన్నారని చెప్పారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి బాధ్యత ఈ రెండు శాతం మంది మీద ఉందన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రకటించిన సమరం 98% ఉన్న రాష్ట్ర ప్రజలపైనా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. పదేళ్లల్లో ప్రభుత్వ ఉద్యోగి ఏనాడే 1న వేతనం తీసుకోలేదని రేవంత్ ప్రస్తావించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1.58 లక్షల కోట్లు అప్పు తెచ్చిందని, గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు రూ. 1.52 లక్షల కోట్లు కట్టామని వివరించారు. తెచ్చిన అప్పులోంచి ఒక్క రూపాయి కూడా ప్రజా సంక్షేమానికి గానీ, ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకు గానీ వాడలేదని చెప్పారు. గత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు సంబంధించి నెలకు రూ. 7 వేల కోట్లు అసలు, మిత్తి చెల్లిస్తున్నామని వివరించారు. ఉద్యోగుల పదవీ కాలం 58 ఏళ్లనుంచి మూడేళ్లు పెంచిపోయారని, రిటైర్మెంట్ బకాయిలు రూ.8,500 కోట్లు పెడింగ్ పెట్టి వెళ్లారని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పదహారు నెలల్లో రూ.30 వేల కోట్లు రైతుల ఖాతాలకు బదిలీ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం ఉచిత విద్యుత్ బకాయిలు వేల కోట్లు బాకీ పెట్టిందని చెప్పారు. బొగ్గు కొనుగోలు చేసి సింగరేణికి బకాయిలు పెట్టిందని వివరించారు. ప్రాజెక్టులకు సంబంధించే కాంట్రాక్టర్లకు రూ.50 వేల కోట్లు బకాయిలు పెట్టారని వివరించారు. ప్రభుత్వమై ఉండి 11% వడ్డీకి అప్పులు తెచ్చారని, ఇంత దుర్మార్గం దేశంలో ఎక్కడా ఉండదని వ్యాఖ్యానించారు. ఔటర్ రింగురోడ్డు, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్‌లో ఉన్న భూములన్నీ అమ్మేశారని ప్రస్తావించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఒక గుంట భూమి అమ్మలేదని స్పష్టం చేశారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములుగా, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సమరం అని ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవర్ని నిందించదలుచుకున్నారు? అన్నారు. ఉద్యోగులకు 35 ఏళ్ల జీతభత్యాలు, పదవీ విరమణ తర్వాత పెన్షన్లు ఇచ్చేది 98% ప్రజలేనని, వారి విషయంలో ఉద్యోగులకు బాధ్యత లేదా? అని సీఎం ప్రశ్నించారు.


ఉత్తమ పనితీరు కనబరిచిన ఓ పోలీసుకు అవార్డు ఇస్తున్న సీఎం

### ప్రజల్ని ఇబ్బందులకు గురిచేద్దామా?

రాష్ట్ర ఆదాయం ప్రతి నెలా రూ.18,500 కోట్లు మాత్రమే వస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర కనీస అవసరాలు తీర్చేందుకు రూ.22,500 కోట్లు అవసరమని వివరించారు. వస్తున్న ఆదాయంలో 7 వేల కోట్లు అప్పులకు, 5,500 కోట్లు జీతాలకు పోతోందని చెప్పారు. మిగిలే 6 వేల కోట్లలో వృద్ధాప్య పెన్షన్, రైతు రుణ మాఫీ, రైతు భరోసా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, విద్యార్థుల ఫీజుల చెల్లింపులు ఈ పథకాలన్నీ అమలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. దుబారా తగ్గించి సర్దుబాటు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రిగా ప్రత్యేక విమానంలో వెళ్లే అవకాశం ఉన్నా సామాన్యుడిలా అందరితో కలిసి ప్రయాణం చేస్తున్నానని గుర్తు చేశారు. గతంలో విడతల వారీగా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వచ్చేవని, ఇప్పుడు ఒకటో తేదీనే వస్తున్నాయని ప్రస్తావించారు. సమరం చేసేందుకు ఇక్కడ లేమని, ప్రజలపై యుద్ధం చేసిన వారు ఎవరూ బాగుపడలేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఉద్యోగ సంఘాల నేతలు రాజకీయ పార్టీల చేతుల్లో పావులుగా మారొద్దని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తుంటాయని, వాటి ఉచ్చులో పడి, వాటి చేతిలో చురకత్తిగా మారి ప్రజల్ని గాయపర్చవద్దని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తనను నిలువునా కోసినా.. రూ.18,500 కోట్లకు మించి ఆదాయం లేదని చెప్పారు. నన్ను కోసుకుని తింటారా? అని ఉద్యోగ సంఘాల నాయకుల్ని ప్రశ్నించారు. ఉచిత కరెంట్, వృద్ధాప్య పెన్షన్, ఏది ఆపాలో చెప్పాలని నిలదీశారు. ఉద్యోగులు డిసైడ్ చేస్తే బహిరంగ సమావేశం ఏర్పాటు చేసి. ప్రజలకు వివరించి ఆ పథకాలు నిలిపేద్దామని వ్యాఖ్యానించారు. పథకాలు ఆపలేమనుకుంటే నిత్యావసరాల ధరలు అడ్డగోలుగా పెంచుదామా? రూ.100 ఉన్న లీటర్ పెట్రోల్ రూ.200 చేద్దామా? రూ.30కి ఇచ్చే బియ్యం రూ.60కి ఇద్దామా? పప్పు, ఉప్పు, చింతపండు, బెల్లం ధరలు రెండింతలు చేద్దామా? అని ఉద్యోగ సంఘాల నాయకుల్ని నిలదీశారు. ధరలు పెంచకుండా, ఉన్న పథకాల్ని ఆపకుండా కొత్త కోరికలు నెరవేరవని స్పష్టం చేశారు. కొత్త కోరికతో ఉద్యమిస్తే వ్యవస్థ కూలిపోతుందని, రాష్ట్రం దివాలా తీస్తుందని, పెట్టుబడులు ఆగిపోతాయని, ఉద్యోగాలు రావని హెచ్చరించారు. ఉద్యోగులను ఒక్క మాట అనబోనని, అంతా ప్రజలకు వివరిస్తానని చెప్పారు.

> "ఎక్కడా అప్పు పుట్టడం లేదు. అప్పు కోసం వెళితే దొంగోడిలా చూస్తున్నారు. నన్ను కోసినా వస్తున్న ఆదాయానికి మించి పైసా మీకివ్వలేను. మీ కోసం ధరలు పెంచమంటారా? పథకాలు ఆపమంటారా? చెప్పండి, మీరేది తేలిస్తే అదే ప్రజలకు చెబుదాం"
>
> "స్వీయ నియంత్రణతో ఉన్నంతలో బండి నడపటమే పరిష్కారం. కాదు సమరం చేస్తానంటే రాజకీయ పార్టీల చేతిలో పావుగా మారినట్లే. ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. రాష్ట్రం దివాలా తీస్తుంది. మన 2 శాతం మంది ప్రయోజనాలా? 98 శాతం మంది రాష్ట్ర ప్రజల ప్రయోజనాలా చెప్పండి"
>
> - సీఎం రేవంత్ రెడ్డి

### ఫెయిల్ అంటే ముఖం వెలుగుతోంది

అడ్డగోలుగా 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చి అందరికీ చెల్లింపులు ఆపి బకాయిలు పెట్టి ఆర్థిక విధ్వంసం చేసిన వ్యక్తి చక్కగా ఫామ్ హౌస్‌లో పడుకున్నాడని రేవంత్ ఎద్దేవా చేశారు. మూడు నెలలకు ఒకసారి బయటకు వచ్చి ఏదో ఒక విషయం పట్టుకుని ప్రభుత్వం ఫెయిల్ అని మాట్లాడి వెళ్లిపోతుంటారని వ్యాఖ్యానించారు. బాధతో చెప్పాల్సిన ఫెయిల్ అన్న పదాన్ని పలికినపుడల్లా ఆయన మొహం వెయ్యి ఓల్టుల బల్బులా వెలుగుతోందని అన్నారు. ఇదేం పైశాచిక ఆనందమని ప్రశ్నించారు. ఉద్యోగులు సమయస్ఫూర్తితో ఆలోచించాలని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కోతుల గుంపునకు అప్పగించొద్దని కోరారు.

### అప్పు పుడతలే... దొంగల్లా చూస్తున్నారు

రాష్ట్ర అవసరాలకు కొత్తగా అప్పు పుట్టే పరిస్థితి లేదని సీఎం చెప్పారు. అప్పుకోసం వెళ్తే బ్యాంకర్లు దొంగల్లా చూస్తున్నారని, మాట్లాడేందుకు ముందుకు రావడం లేదని వివరించారు. ఢిల్లీకి వెళ్తే అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని, చెప్పులు ఎత్తుకుపోతామనేలా చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అప్పు పుడితే ఉద్యోగుల కోసం ఏదో ఒకటి చేసేవాడినని చెప్పారు. స్వీయ నియంత్రణే తమ ముందు ఉన్న పరిష్కారమని, ఉన్న సంసారాన్ని గౌరవంగా నడుపుకుంటే ఎవరైనా నమ్మి అప్పులు ఇస్తారని చెప్పారు. పరువును బజారులో పడేయవద్దని కుటుంబ పెద్దగా కోరుతున్నానని అన్నారు. లెక్కలు కావాలంటే అణా పైసలతో చెబుతానని, మిగిలిందంతా ఉద్యోగులకే పంచిపెడతానని ప్రకటించారు. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగులో పెట్టిందని, వాటికి రూ. 7 వేల కోట్లు కావాలని అన్నారు. ఏ ప్రభుత్వ విభాగానికి కూడా పట్టుమని వెయ్యి కోట్లు ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల కింద వేసిన రోడ్లకు మరమ్మతులు లేవని చెప్పారు. ఉద్యోగ సంఘాల నాయకులు ఆర్థిక మంత్రితో కూర్చొని మాట్లాడాలని సూచించారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు; చిత్రంలో స్పీకర్ ప్రసాద్ కుమార్

## ఉచితాలు తగ్గించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. కోటి పది లక్షల కుటుంబాలు ఉంటే.. కోటి పాతిక లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. అంటే పక్క రాష్ట్రాల వారికి కూడా ఇక్కడ కార్డులు ఉన్నాయనేది స్పష్టమవుతోంది. మీ ఊళ్లో రేషన్ కార్డులు లేనోళ్లను పది, ఇరవై మందిని తీసుకు రండి.. అంటే అందరూ పేదోళ్లేనా?" అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. వికారాబాద్ జిల్లా ధారూరులోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా భూమి ఆసామికే వెళుతుంది కానీ.. పంట పండించిన వారికి అందడం లేదన్నారు. రైతు భరోసా ఎలా ఇద్దామన్న దానిపై మీ సలహాలు కూడా ఇవ్వాలని ఆయన రైతులను, ప్రజలను కోరారు. పెద్దాయన చెప్పినట్లుగా కౌలు రైతులకు బోనస్ వచ్చిందని, మీరందరూ ఒప్పుకుంటే ఇంకా కొన్ని మార్పులు చేస్తామని చెప్పారు. అన్నదాతను కాపాడుకునే అవకాశం వస్తుందని, రైతులకు ప్రభుత్వం సాయం చేసేది కొంతైనా.. మీరు కష్టపడేది ఎక్కువ అని, కష్టానికి తగ్గ ఫలితం ఉండాలంటే మనం నూతన పద్ధతులను అవలంబించాలని, ప్రపంచంతో పోటీ పడుతూ పంటలు పండించాలని ఆయన అన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో మంచి లాభాలు ఉంటాయని, వికారాబాద్ జిల్లాలో ఈ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. ఆయిల్ పామ్ పంట మూడేళ్లలో కోతకు వస్తుందని, దీనికి కోతులు, పశువుల బెడద ఉండదన్నారు. ఈ పంట సాగుతో పాటు అంతర పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటను కంపెనీ వాళ్లతో కొనుగోలు చేయించి, డబ్బులను రైతుల ఖాతాల్లో వేయించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఎకరాకు రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుందని చెప్పారు. రైతులకు పంట నష్టం పరిహారం అందే విధంగా పంటల బీమా అమలుకు త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆయన అన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. వికారాబాద్ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మలను కోరారు. శాస్త్రవేత్తలు రైతులకు మేలైన వంగడాలను అందించాలని, శాస్త్రీయ వ్యవసాయం పద్ధతులను రైతులు అనుసరించి పంటల సాగు దిగుబడిని పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ.. ధరణి వల్ల చాలామంది రైతులు భూముల హక్కులను కోల్పోయారన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులు తమ భూముల సమస్యలను పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

## ఉద్యోగులను పలుచన చేసేలా మాట్లాడొద్దు

» బోనస్‌లు, జీతాలు పెంచాలని అడగట్లే

» సీఎం వ్యాఖ్యలు విచారకరం:యూటీఎఫ్

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): 'ఉద్యోగులు బోనస్‌లు అడగడం లేదు. సంక్షేమ పథకాలను నిలిపివేసి, జీతాలు పెంచమనీ అడగడం లేదు. న్యాయంగా రావాల్సిన డీఏలు ప్రకటించాలని, దాచుకున్న జీపీఎఫ్ నగదును అవసరాలకు ఇవ్వాలని మాత్రమే అడుగుతున్నారు' అని యూటీఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులను పలుచన చేసేలా మాట్లాడడం సరికాదని హితవు పలికారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి చావ రవి, ఎ.వెంకట్ ఈ మేరకు సీఎం రేవంత్ వ్యాఖ్యలపై స్పందించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు వారికి రావాల్సిన నగదు ప్రయోజనాల కోసం 14 నెలలుగా ఎదురు చూస్తున్నారన్నారు. ఇలాంటివి ఈ ఆర్థిక సంవత్సరంలో పరిష్కరిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు మాట మార్చి ప్రజల్లో ఉద్యోగులను పలుచన చేయడం విచారకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి తప్ప కుటుంబం అంటూనే ఉద్యోగులను బజార్న పడేయడం సమంజసం కాదని తెలిపారు. అక్టోబరు 24న ఐకాస ప్రతినిధులతో సమావేశమైన సీఎం.. మూడు గంటల పాటు ఉద్యోగుల సమస్యలను ఓపిగ్గా విన్నారని గుర్తుచేశారు. ఆర్థికేతర అంశాల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తామని చెప్పారన్నారు. ఆర్నెల్లు గడిచినా మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించలేదని తెలిపారు. ఉద్యోగులతో సత్సంబంధాలు కొనసాగించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే వెంటనే క్యాబినెట్ సబ్ కమిటీ లేదా ముఖ్యమంత్రి.. ఐకాస ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆందోళనకు మద్దతు

**బీజేపీ ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజి రెడ్డి**

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఆందోళన కార్యాచరణకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈమేరకు సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరీంనగర్ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు మల్క కొమురయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజి రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలు, 5 డీఏల విడుదల, పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ, జీవో 317 సమీక్ష వంటి కీలక డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ.. గత 18 నెలలుగా ప్రభుత్వ నిర్లక్ష్యంతో 13 లక్షల ఉద్యోగ కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వెల్లడించారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి బీజేపీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

# రేపటి నుంచి ఆర్టీసీ సమ్మె

» మంత్రి పొన్నంతో సంఘాల నేతల భేటీ

» చర్చలతోనే పరిష్కారం: పొన్నం

» సమ్మెకు వెళితే ఎస్మా : యాజమాన్యం

హైదరాబాద్, రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో సమస్యల పరిష్కారం కోసం జేఏసీ బుధవారం నుంచి సమ్మెలోకి దిగుతోంది. సమ్మెను విజయవంతం చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సన్నాహక కార్యక్రమాలు చేపట్టింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా 21 సమస్యలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో ముందుగా ప్రకటించిన విధంగా సమ్మెకు దిగుతున్నామని జేఏసీ నేతలు చెబుతున్నారు. మరోవైపు.. సమ్మె వద్దని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో పలు ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సోమవారం భేటీ అయ్యాయి. ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రితో చర్చించాయి. సమ్మె వద్దని ప్రభుత్వం చెబుతుండగా, చేసి తీరుతామని జేఏసీ నేతలు పట్టుబట్టారు. మరోవైపు.. సమ్మె కట్టడి చర్యల్లో భాగంగా ఆర్టీసీలో సమ్మెలు నిషేధమని, సమ్మెకు వెళితే ఎస్మా ప్రయోగిస్తామని ఆర్టీసీ యాజమాన్యం హెచ్చరికలు జారీ చేసింది.

### సమ్మెతో ప్రజలకు ఇబ్బంది: మంత్రి

సమస్యలపై జేఏసీ చర్చించి పరిష్కరించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సమ్మెతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. పలు సంఘాల నాయకులతో సమావేశం అనంతరం మంత్రి మట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు విని, పరిష్కరించేందుకు తనతోపాటు, ముఖ్యమంత్రి కార్యాలయం తలుపులు తెరిచే ఉంటాయన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమ, ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. 16 నెలల్లో ఆర్టీసీకి ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామన్నారు. ఉద్యోగులకు 2013 నుంచి చెల్లించాల్సిన బాండ్ మొత్తం రూ. 400 కోట్లు చెల్లించామని చెప్పారు. పీఎఫ్ ఆర్గనైజేసన్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ. 1039 కోట్లు చెల్లించామన్నారు. ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు కొత్తగా 3038 ఉద్యోగాల భర్తీ చేశామని, తార్నాక ఆస్పత్రి సూపర్ స్పెషాల్టీగా మార్చామని పొన్నం వివరించారు. సమ్మెకు పట్టుబడకుండా చర్చలకు రావాలని విజ్ఞప్తి చేశారు.



కవాతు నిర్వహిస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు

### ఎస్మా ప్రయోగం: యాజమాన్యం

సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం మరోసారి ఎస్మాను తెరపైకి తెచ్చింది. ఎస్మా చట్ట ప్రకారం ఆర్టీసీలో సమ్మెలు నిషేధం అని యాజమాన్యం ప్రకటించింది. సంస్థ నిబంధనల మేరకు సమ్మె చట్టవ్యతిరేకమైనదని, సమ్మె పేరుతో ఉద్యోగులను ఎవరైనా బెదిరించినా, విధులకు ఆటంకం కలిగించినా బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని యాజమాన్యం హెచ్చరించింది. ఆర్థిక కష్టాల్లోనూ ఉద్యోగుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యమిస్తున్నామని, ఇప్పుడిప్పుడే కోలుకుంటూ అభివృద్ధి పథంలో పయనిస్తున్న సంస్థకు సమ్మె తీరని నష్టం కలిగిస్తుందని ఆర్టీసీ యాజమాన్యం పేర్కొంది. సమ్మె వల్ల సంస్థకు నష్టం వాటిల్లుతుందని, ఒక వర్గం తమ మనుగడకోసం చెప్పే మాటలకు ప్రభావితమై సమ్మెకు వెళ్తే సంస్థతోపాటు ఉద్యోగులకు నష్టం జరుగుతుందన్న విషయం మర్చిపోవద్దని వెల్లడించింది.

### సమ్మెకు దూరం: అశ్వత్థామ రెడ్డి

సమ్మెకు ఇది సరైన సమయం కాదని, తాము సమ్మెకు దూరంగా ఉంటున్నామని టీఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై మంత్రితో చర్చించామన్నారు. తమ యూనియన్‌కు చెందిన కార్మికులు ఎప్పటిలాగే విధులకు హాజరవుతారన్నారు. అవసరమైతే అన్ని సంఘాలు ఏకతాటిపైకి వచ్చి యాజమాన్యానికి మరోసారి నోటీసులు ఇచ్చి సమ్మెకు వెళదామని ఆయన జేఏసీకి సూచించారు.

### సమ్మె యథాతథం: జేఏసీ

సమ్మె విషయంలో వెనక్కి తగ్గేదేలేదని, ముందుకే వెళ్తామని జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు. సమ్మెకు దూరంగా ఉండాలని అశ్వత్థామ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. 2019 సమ్మె సమయంలో కేసీఆర్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఆర్టీసీ ఉద్యోగులను, ఆర్టీసీని నాశనం చేసిన కార్మిక ద్రోహి అశ్వత్థామ రెడ్డి అని విమర్శించారు. జేఏసీ ఇదివరకు ప్రకటించిన విధంగా సమ్మెకు వెళ్తున్నామని, ప్రతి ఒక్కరు సమ్మెలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇతర సంఘాల నాయకులతో కాకుండా సమ్మెకు నోటీసు ఇచ్చిన జేఏసీ నాయకులను పిలిచి మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తే సమ్మె విషయంలో పునరాలోచిస్తామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని వెంకన్న విజ్ఞప్తి చేశారు. అంతకుముందు తమ డిమాండ్ల పరిష్కారానికి ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించి డిమాండ్లను పరిష్కారం చేయాలని లేనిపక్షంలో 6వ తేదీ అర్ధరాత్రి తర్వాత నుంచి సమ్మె చేపడతామని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రకటించారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్ నుంచి బస్‌భవన్ వరకు ఆర్టీసీ కార్మికులు కవాతు నిర్వహించారు.

# సింగరేణిలో సమ్మె సైరన్

**20న సమ్మెకు కార్మిక సంఘాల నోటీసు**

రుద్రంపూర్/ గోదావరిఖని, మే 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో సమ్మె సైరన్ మోగనుంది. బొగ్గు పరిశ్రమ రక్షణ, నూతన బొగ్గు గనుల ఏర్పాటు, రూ.26వేల కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం తదితర 17 డిమాండ్ల పరిష్కారానికి సింగరేణిలో సమ్మెకు కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి. 20న సమ్మె నిర్వహిస్తామని పలు కార్మిక సంఘాల ప్రతినిధులు సోమవారం సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాంకు సమ్మె నోటీసు అందజేశారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ (సెంట్రల్) డి. శ్రీనివాసులుకు కూడా సమ్మె నోటీసును ఇచ్చినట్లు కార్మిక సంఘాల నాయకులు రియాజ్ అహ్మద్, సీతారామయ్య, గట్టయ్య, రాములు, మణిరాంసింగ్ తదితరులు తెలిపారు. బొగ్గు బ్లాక్‌లను కేంద్రం సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. సంస్థవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో సింగరేణి కార్మికులు భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా కొన్ని కార్మిక సంఘాలు వ్యవహరించడం అన్యాయమన్నారు. లాభాల్లో నడుస్తున్న సింగరేణిలో నూతన భూగర్భ గనులకు అనుమతించాలని, సంస్థలో పనిచేస్తున్న 35వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియాలో మాదిరి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం మనుగడకు ముప్పు తెస్తున్న 4 లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. సమ్మెలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు భాగస్వాములు కావాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య కోరారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం(పర్సనల్) కవితానాయుడుకి సమ్మె నోటీసును అందజేశారు.

## జన్యుమార్పిడి కొత్త వరి వంగడాలొచ్చేశాయ్!

- 6 ఏళ్ల పరిశోధన ఫలితం.. 2 రకాల వంగడాల ఆవిష్కరణ
- న్యూఢిల్లీలో విడుదల చేసిన కేంద్రమంత్రి శివరాజ్ చౌహాన్



హయత్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): దేశీయంగా అభివృద్ధి చేసిన జన్యుమార్పిడి కొత్త వరి వంగడాలు రెండింటిని న్యూఢిల్లీలో సోమవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ చౌహాన్ ఆవిష్కరించారు. ఈ మేరకు అటారీ (అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) డైరెక్టర్ షేక్ ఎన్ మీరా ఒక ప్రకటనలో వెల్లడించారు. సాంబా మసూరి, ఎంటీయూ 1010 అనే రెండు ప్రధాన వరి వంగడాలను మెరుగుపరిచేందుకు 2018లో కీలక పరిశోధనను భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) ప్రారంభించిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ వంగడాలతో 19% మేర దిగుబడి పెరుగుతుందని, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు 20% మేర తగ్గుతాయని.. 7500 మిలియన్ క్యూబిక్ మీటర్ల సాగు నీరు కూడా ఆదా అవుతుందని వివరించారు. జన్యుక్రమంలో మార్పులు చేర్పుల ద్వారా వరి వంగడాలను అభివృద్ధి చేసిన తొలి దేశంగా భారత్ నిలిచిందని, ఇది శాస్త్రీయ పరిశోధన ఆవిష్కరణల రంగంలో కొత్త ఆరంభానికి సూచిక అని పేర్కొన్నారు. దేశాన్ని ప్రపంచ ఆహార కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో పేలుడు ఘటనపై..

## సీఎస్, డీజీపీకి ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు

న్యూఢిల్లీ, మే 5 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కాటేపల్లిలో గల ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో గత నెల 29న జరిగిన పేలుడు ఘటనను జాతీయ మానవహక్కుల సంఘం(ఎన్‌హెచ్ఆర్సీ) సుమోటోగా స్వీకరించింది. ఈ కంపెనీలోని ప్రొపెల్లెంట్ మిక్సింగ్ యూనిట్‌లో పేలుడు సంభవించి ముగ్గురు కార్మికులు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడిన ఘటనపై రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి సోమవారం నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై మీడియాలో వచ్చిన వార్తలు నిజమైతే మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి తీవ్రమైన అంశాలను లేవనెత్తినట్లేనని కమిషన్ అభిప్రాయపడింది. అందువల్ల దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితినీ నివేదికలో పొందుపరచాలని కమిషన్ కోరింది.

## పబ్లిక్ అకౌంట్స్ కమిటీ పునర్వ్యవస్థీకరణ

- తెలుగు ఎంపీలకు కమిటీలో మళ్లీ చోటు

న్యూఢిల్లీ, మే 5(ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ పబ్లిక్ అకౌంట్స్ (ప్రజాపద్దుల) కమిటీని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పునర్వ్యవస్థీకరించారు. కమిటీ చైర్మన్‌గా కేసీ వేణుగోపాల్‌ను తిరిగి నియమించారు. సభ్యులుగా తెలుగు రాష్ట్రాల ఎంపీలు కె.లక్ష్మణ్, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, సీఎం రమేష్, వల్లభనేని బాలశౌరి తిరిగి చోటు దక్కించుకున్నారు. కాగా ఈ కమిటీలో మొత్తం 22 సభ్యులు ఉంటారు. వీరిలో 15 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు ఉంటారు. పదవీకాలం ఏడాది ఉంటుంది.

## జూలై దాకా 10.26 టీఎంసీల నీరు ఇవ్వండి

- కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీని కోరిన తెలంగాణ

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): రానున్న జూలై 31 వరకు శ్రీశైలం, సాగర్ కింద తాగునీటి అవసరాలకు 10.26 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ కోరింది. సోమవారం కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం బోర్డు సభ్య కార్యదర్శి కమిటీ కన్వీనర్ డీఎం రాయిపూరే అధ్యక్షతన జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, నల్లగొండ చీఫ్ ఇంజనీర్ (సీఈ) అజయ్‌కుమార్, సూర్యాపేట చీఫ్ ఇంజనీర్ (సీఈ) రమేష్‌బాబు హాజరుకాగా.. ఏపీ అధికారులు గైర్హాజరయ్యారు. అంతర్జాతీయ నిపుణుల పోలవరం ప్రాజెక్టు పరిశీలన కారణంగా వారు హాజరుకాలేదు.

### 'సీతారామ'కు సాంకేతిక అనుమతులిచ్చినా..

## కేంద్ర నిధులకు గ్యారెంటీ ఇవ్వలేం

- టీఏసీ భేటీ మినట్స్‌లో పేర్కొన్న కేంద్ర జలశక్తి శాఖ

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల/సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు నిధుల మంజూరు విషయంలో ఎలాంటి గ్యారెంటీ ఇవ్వలేమని కేంద్ర జలశక్తి శాఖ తేల్చిచెప్పింది. ఇటీవలే శాఖ పరిధిలోని సాంకేతిక సలహా మండలి (టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ-టీఏసీ) పలు షరతులతో ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే.. ప్రధాన మంత్రి క్రిషి సించాయి యోజన(పీఎంకేఎస్‌వై), ఫ్లడ్ మ్యానేజ్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్ఎంపీ) వంటి పథకాలతో పాటు ఇతర శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాల కింద నిధుల మంజూరులో చేతులెత్తేసింది. టీఏసీ భేటీలో తీసుకున్న నిర్ణయాలతో కూడిన మినట్స్ కాపీని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) సోమవారం తెలంగాణకు పంపించింది. నిధుల మంజూరుపై పూచీ లేదని స్పష్టం చేసింది.

## బిగ్‌బాస్ షో ఓ నీచ సంస్కృతి: నారాయణ

తిరుపతి(ఆటోనగర్), మే 5(ఆంధ్రజ్యోతి): 'బిగ్‌బాస్ షో నిర్వాహకులపై నేను కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించింది. హైకోర్టు నోటీసులు పంపడం శుభపరిణామం' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బిగ్‌బాస్ షోలు, అందాల పోటీలను నిర్వహించడం నీచ సంస్కృతి. బిగ్‌బాస్ షోలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను ఆపాలని పోలీస్ స్టేషన్లను, కోర్టులను ఆశ్రయించా. మూడేళ్లుగా పోరాటం చేస్తూ చివరకు హైకోర్టును ఆశ్రయించాం. హైకోర్టు బిగ్‌బాస్ షో నిర్వాహకులకు నోటీసులు పంపడం ఆనందంగా ఉంది. తెలంగాణలో అందాల పోటీలు నిర్వహించడం మంచి పద్ధతి కాదు' అని నారాయణ అన్నారు.

## సర్వర్ డౌన్‌తో నిలిచిన 'మీ సేవలు'

- ఆన్‌లైన్ పనిచేయక ఇబ్బందులు పడ్డ నిర్వాహకులు

బోయినపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా సోమవారం మీ సేవ ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో నిర్వాహకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మీ సేవ సెంటర్లలో ఇప్పటికే ఉన్న బయోమెట్రిక్ మిషన్లను తొలగిస్తూ కొత్త మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చే క్రమంలో సర్వర్‌ను పునరుద్ధరిస్తున్నారు. దీంతో సేవలకు రోజంతా అంతరాయం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం మీ సేవలో అదనంగా కొన్ని సేవలను చేర్చేందుకు ఇటీవల చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కార్యక్రమాన్ని మొదలుపెట్టడంతో సర్వీసులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్‌లో సర్వీస్ సేవలను జత చేస్తున్న తరుణంలో నిర్వాహకులకు సంబంధించిన బయోమెట్రిక్ మిషన్ లాగిన్‌లో ఎర్రర్ అని వస్తుండడంతో మీ సేవల ద్వారా జరిగే సాధారణ కార్యకలాపాలకు విఘాతం కలిగింది. ప్రధానంగా విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌ల బయోమెట్రిక్ మిషన్లు అయిన మోర్ఫో, మంత్ర, స్టార్‌టెక్, కోజెంట్‌లు పనిచేయకపోవడంతో సెంటర్లకు వచ్చిన వినియోగదారులు వెనుదిరిగిన పరిస్థితి ఏర్పడింది. కాగా, విద్యార్థుల సేవలతోపాటు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఎడ్యుకేషన్, ఆర్టీఏ లాంటి సేవలు కూడా అందలేదని, అప్‌డేట్ కారణంగా రెండు నెలలుగా రావాల్సిన సర్టిఫై కాపీలు కూడా రాలేదని మీ సేవ నిర్వాహకులు వాపోయారు.

### నకిలీల అడ్డుకట్టకు చెక్!

మీ సేవ సెంటర్లలో పాత బయోమెట్రిక్ మిషన్లను తొలగిస్తూ కొత్త మిషన్లను అందుబాటులోకి తీసుకొస్తున్న తరుణంలో కొందరు నిర్వాహకులు తమ ఐడీలను వేరే సెంటర్ల వారికి అప్పగించి నడిపిస్తున్నారు. అలాగే కొందరు ఒకే ఐడీపై వివిధ ప్రాంతాల్లో అక్రమంగా సెంటర్లు నడిపిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. దీంతోపాటు సరైన ధ్రువపత్రాలు లేకుండానే దరఖాస్తులకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇలాంటి వారిని కట్టడి చేసేందుకు ప్రభుత్వం మీ సేవ సెంటర్లలో కొత్త మిషన్లను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణ.. జరూర్ ఆనా

## మిస్ వరల్డ్ పోటీలకు రాష్ట్రం ముస్తాబు.. ఈనెల 10 నుంచి 31 వరకు అందాల పోటీల నిర్వహణ

- రాష్ట్ర వ్యాప్తంగా అందగత్తెల పర్యటనలు
- ప్రపంచానికి తెలంగాణ అందాలను.. పరిచయం చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన 11వ సంవత్సరంలోనే ప్రపంచ అందాల పోటీల చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో తెలంగాణ పేరు చేర్చే తరుణం ఆసన్నమైంది. మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న 'మిస్ వరల్డ్ - 2025' వేడుకలకు 'చార్‌సౌ సాల్-కా-షహర్' హైదరాబాద్ ముస్తాబవుతుండగా.. రాష్ట్రవ్యాప్తంగా హెరిటేజ్, మెడికల్, టెంపుల్ టూరిజానికి ఊతమిచ్చేలా ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. 'తెలంగాణ జరూర్ ఆనా' థీమ్‌తో.. అటు అందగత్తెల పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తూనే.. ఇటు పర్యాటకాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటోంది. 116 దేశాల సుందరీమణులు, దేశవిదేశీ అతిథులు, 3 వేల మంది పాత్రికేయులు పాల్గొనే ఈ పోటీలను హైదరాబాద్ మహానగరానికే పరిమితం చేయకుండా.. రామప్ప ఆలయ దర్శనం, యాదగిరిగుట్ట నారసింహుడి ఆశీర్వాదం పోటీదారులకు కలిగేలా షెడ్యూల్‌ను రూపొందించింది. అంతేకాదు.. భౌగోళిక గుర్తింపు పొందిన పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరల తయారీ తీరు.. ఇప్పటికీ ఆద్యంతం చిక్కుముడిగా ఉండే మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి, ప్రఖ్యాత బౌద్ధారామమైన నాగార్జునసాగర్, హైదరాబాద్‌కు మకుటాయమానంగా ఉన్న చార్మినార్.. ఆ పక్కనే అపురూపమైన గాజులకు నిలయమైన లాడ్‌బజార్, ఆణిముత్యాల ఆభరణాలను విక్రయించే వీధులు, అసఫ్‌జాహీల కాలం నుంచి దేశవిదేశీ ప్రతినిధులకు ఆతిథ్యమిచ్చే చౌమొహల్లా ప్యాలెస్‌లను మిస్‌వరల్డ్ పోటీదారులకు పరిచయం చేయనుంది. ఈ పోటీలకు వచ్చిన వారు 'హైదరాబాద్ యాత్ర' అనుభూతి గురించి తమ డైరీల్లో ప్రముఖంగా రాసుకునేలా కార్యక్రమాలను రూపొందించింది. శంషాబాద్ విమానాశ్రయ ప్రాంగణంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయగా.. అతిథులకు ఇక్కడి వంటకాల రుచి చూపించనుంది.

### 21 రోజుల వేడుక

మిస్‌వరల్డ్ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈనెల 10న ప్రారంభమై.. 31న జరిగే గ్రాండ్ ఫినాలేతో ముగుస్తాయి. ఈ 21 రోజులు అడుగడుగునా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పోటీలో పాల్గొనే సుందరీమణులకు ఇక్కడి కళలను పరిచయం చేసేలా కార్యక్రమాలను రూపొందించింది. 31వ తేదీన ముగింపు కార్యక్రమం రాత్రి 10 గంటలకు మొదలై.. అర్ధరాత్రి ఒంటిగంట వరకు కొనసాగుతుంది. విజేతల ప్రకటనతో వేడుకలు ముగిసినా.. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మిస్‌వరల్డ్ విజేతతోపాటు.. ఆరు ఖండాల టైటిళ్లను గెలుచుకునే అందగత్తెలు, జూలియా మోర్లీ.. ఇలా 8 మందికి రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందును ఇస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. ఈ 21 రోజులు మిస్ వరల్డ్ పోటీల కారణంగా పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయనుంది.



హైదరాబాద్ వచ్చిన మిస్ నమీబియా, మిస్ ఘనాలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



మిస్ పోర్చుగల్



మిస్ ఐర్లాండ్ జాస్మిన్ గర్నార్ట్

### రోజువారీ కార్యక్రమాలు ఇలా..

మిస్‌వరల్డ్ పోటీల్లో భాగంగా రోజూవారీ కార్యక్రమాలను పర్యాటక శాఖ ఖరారు చేసింది. అందాల తారలను బృందాలుగా విభజించి, రోజూవారీ కార్యక్రమాలను రూపొందించింది.

**కార్యక్రమాలు/షెడ్యూల్**

**10న** సాయంత్రం 5గంటలకు, గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్-2025 ప్రారంభోత్సవం

**12** నాగార్జునసాగర్ బుద్ధవనానికి బౌద్ధ ఆధ్యాత్మిక యాత్ర. ఆసియాకు చెందిన 28 మంది మిస్ వరల్డ్ 2025 టీమ్ ఈ యాత్రలో పాల్గొంటారు.

**13** ● చార్మినార్, లాడ్‌బజార్ ప్రాంతాల్లో హైదరాబాద్ హెరిటేజ్ వాక్. 116 మంది సుందరీమణులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు చౌమొహల్లా ప్యాలెస్ సందర్శన, మ్యూజికల్ కన్సర్ట్‌తో వెల్ కమ్ డిన్నర్

**14** ● సాయంత్రం 5 గంటలకు అమెరికాకు చెందిన 22 మంది పోటీదారులు వరంగల్ హెరిటేజ్ టూర్‌లో భాగంగా వేయి స్తంభాల గుడి, వరంగల్ కోటను సందర్శిస్తారు. సాయంత్రం 4.30కు రామప్ప టెంపుల్ టూర్‌లో భాగంగా ఐరోపాకు చెందిన 35 మంది పోటీదారులు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. వీరికోసం ఇక్కడ కాకతీయుల కాలం నాటి ప్రసిద్ధ పేరిణి నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేస్తారు

**15** ● సాయంత్రం 5 గంటలకు కరేబియన్ దేశాలకు చెందిన 10 మంది భామలు యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. హ్యాండ్లూమ్ ఎక్స్‌పీరెన్షియల్ టూర్‌లో భాగంగా ఆఫ్రికా దేశాలకు చెందిన 25 మంది అందగత్తెలు సాయంత్రం 6 గంటలకు పోచంపల్లిలోని తెలంగాణ చేనేత పరిశ్రమను సందర్శిస్తారు

**16** ● తెలంగాణలో అభివృద్ధి చెందుతున్న మెడికల్ టూరిజంను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శిస్తారు

● మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి వనంలో అమెరికా గ్రూప్ పోటీదారులు పర్యటిస్తారు

● ఆసియాకు చెందిన 24 మందితో కూడిన బృందం.. ఎక్స్‌పీరియం ఎకో టూరిజం పార్క్‌ను సందర్శిస్తారు

**17** ● స్పోర్ట్స్ ఫినాలేలో భాగంగా గచ్చిబౌలి స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీదారులు స్పోర్ట్స్ ఫైనల్స్‌లో పాలుపంచుకుంటారు

● మరో బృందం రామోజీ ఫిల్మ్ సిటీ, ఫిల్మ్ స్టూడియోను సందర్శిస్తుంది

**18** ● సేఫ్టీ టూరిజంలో భాగంగా పోటీదారులు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)ను సందర్శిస్తారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ తెలంగాణ సచివాలయాన్ని(తెలంగాణ రైజింగ్ విజన్) పోటీదారులు సందర్శించనున్నారు.

సాయంత్రం సచివాలయం, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించే సండే ఫన్‌డే కార్నివాల్‌లో పాల్గొంటారు

**20, 21** కాంటినెంటల్ ఫైనల్ జరుగుతుంది. ఖండాల వారీగా పోటీదారుల ఫాస్ట్-ట్రాక్ సెలెక్షన్స్ ప్రక్రియ ఉంటుంది. ఈ రెండు రోజుల్లో ఏదో ఒకరోజు ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ ఆడే దేశాలకు చెందిన ఓ 20 మంది పోటీదారులు సందడి చేస్తారు

**21** ఐరోపాకు చెందిన 35 మంది శిల్పారామంలో తెలంగాణ డ్వాక్రా బజార్ స్టాళ్లను సందర్శిస్తారు

**22** మిస్ వరల్డ్ టాలెంట్ ఫైనల్‌లో భాగంగా సాయంత్రం శిల్పకళావేదికలో 116 మంది పోటీదారులు వివిధ కళల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తారు.

**23** హెడ్-టు-హెడ్ చాలెంజ్‌లో భాగంగా హోటల్ ట్రైడెంట్‌లో మిస్ వరల్డ్ చాలెంజ్‌లో నిర్వహించే పోటీల్లో అందాల తారలు పాల్గొంటారు

**24** మిస్ వరల్డ్ టాప్ మోడల్.. ఫ్యాషన్ ఫైనల్‌లో భాగంగా.. హోటల్ ట్రైడెంట్/హైటెక్స్‌లో సుందరీమణులంతా ఫ్యాషన్, జ్యువెలరీ షోలో పాల్గొంటారు. అదే రోజు బ్యూటీ విత్ పర్పస్ పేరుతో హైటెక్స్‌లో విందును ఏర్పాటు చేస్తారు

**31** సాయంత్రం 5.30 గంటలకు మిస్ వరల్డ్ గ్రాండ్ ఫైనల్ రెడ్ కార్పెట్ వేడుక ప్రారంభమవుతుంది. రాత్రి 10 నుంచి ఒంటి గంట వరకు ఫైనల్స్ ఉంటుంది. మిస్ వరల్డ్ విజేతను ప్రకటిస్తారు

**జూన్ 2** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజున రాజ్‌భవన్‌లో కొత్త మిస్ వరల్డ్, ఆరు ఖండాల విజేతలు, జూలియా మోర్లీతో సహా 8 మంది భామలు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి తేనేటి విందులో పాల్గొంటారు

## అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ రైతులపై లేదు

- రైతు మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే: హరీశ్ రావు



సిద్దిపేట కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అకాల వర్షం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతుల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని, సీఎంకు అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ రైతులపై లేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. సోమవారం సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన హరీశ్ రావు రైతులను పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటు అని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా ధాన్యం కొనడం లేదని, రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని, ధాన్యం కుప్పలపైనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ధాన్యపు రాశులే సాక్షిగా కొనుగోలు కేంద్రాల్లోనే చోటుచేసుకుంటున్న ఈ రైతు మరణాలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఈ మరణాలకు బాధ్యత వహించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా విఫలమయిందని, ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా గడుపుతుంటే ఏమాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్, గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించి, ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టారని చెప్పారు. పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని పేర్కొన్నారు.

# అందాల పోటీలతో రాష్ట్రఖ్యాతి విశ్వవ్యాప్తం

## ప్రతిష్ఠాత్మకంగా మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ.. ఘనంగా ఏర్పాట్లు.. కట్టుదిట్టమైన భద్రత

- తెలంగాణ సంప్రదాయలతో స్వాగతం
- ప్రతి కార్యక్రమానికి నోడల్ అధికారి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మిస్ వరల్డ్ పోటీలపై సీఎం సమీక్ష
- 10న గచ్చిబౌలి స్టేడియంలో పోటీల షురూ.. 31న ముగింపు



మిస్ వరల్డ్ -2025 ఏర్పాట్లపై మాట్లాడుతున్న సీఎం రేవంత్; చిత్రంలో మంత్రులు జూపల్లి, పొంగులేటి

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదం చేస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆ మేరకు ఈ నెల 10-31 తేదీల మధ్య హైదరాబాద్ వేదికగా జరగనున్న పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, ఏర్పాట్లను ఘనంగా చేయాలని అధికారులకు సూచించారు. పోటీల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ పోటీల్లో 116 దేశాలకు చెందిన యువతులు పాల్గొంటారని, అలాగే ఆయా దేశాలకు చెందిన ప్రతినిధులు, దాదాపు మూడు వేలమంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని.. వీరందరికి ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఘనంగా ఆతిథ్యమివ్వాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో అతిథులకు స్వాగతం పలకాలని.. నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని నిర్దేశించారు. మిస్ వరల్డ్-2025 ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రులు జూపల్లి, పొంగులేటి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమం నుంచి, 31న జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమం కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. హైదరాబాద్‌లోని చార్మినార్, లాడ్ బజార్, సచివాలయం, తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో అవసరమైన రవాణా, ఇతర వసతులు కల్పించాలన్నారు.

### డ్వాక్రా బజార్ సందర్శించనున్న అందగత్తెలు

పోటీలకు విచ్చేయనున్న అందగత్తెలు ఐకేపీ మహిళలు నిర్వహించనున్న డ్వాక్రా బజార్‌ను సందర్శించనుండటంతో పాటు ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ సెమీఫైనల్ మ్యాచ్‌ను తిలకించనున్న నేపథ్యంలో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం నిర్దేశించారు. మిస్ వరల్డ్‌కు వచ్చే విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతో పాటు గచ్చిబౌలి స్టేడియం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, సచివాలయ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరఫున మిస్ వరల్డ్-2025 ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు. ప్రభుత్వ గురుకులాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కూడా ఒకరోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ సీపీ సీవీ ఆనంద్, రాచకొండ సీపీ జి.సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితులకు అండగా..

(మొదటి పేజీ తరువాయి)



బ్రెస్ట్ క్యాన్సర్ బాధితురాలితో మాట్లాడుతున్న సుజాత

పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించిన ఆమె చాలా అంశాలపై మాట్లాడారు. అందులో ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే..

### మాదీ ముత్యాల నగరమే...

హైదరాబాద్‌కు రావడం ఇదే మొదటిసారి. కానీ.. నాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే.. నేను పుట్టిన పుకెట్‌కు, హైదరాబాద్‌కు ఒక సంబంధం ఉంది. అదేంటంటే.. హైదరాబాద్‌లాగానే మాదీ ముత్యాల నగరి. బ్యాంకాక్‌లో హైస్కూల్ విద్య అభ్యసిస్తున్నప్పుడే నా దృష్టి అందాల పోటీలపై పడింది. అయితే, ఆ పోటీల్లో పాల్గొంటూనే చదువునూ కొనసాగిస్తున్నాను. ప్రస్తుతం నేను రాజనీతి శాస్త్రం చదువుతున్నాను. నాకు ఆ సబ్జెక్ట్ అంటే ఇష్టం. ఒకవేళ నేను మోడలింగ్ రంగంలోకి రాకపోతే రాజకీయ రంగంలో ఉండే దాన్ని. మరీ ముఖ్యంగా అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించిన విభాగంలో పనిచేసేదాన్ని. భవిష్యత్‌లో మా దేశ రాయబారిగా ఉండాలన్నది నా కోరిక.

### అవగాహనతోనే..

'ఓపల్ ఫర్ హర్' పేరుతో నేను థాయ్‌లాండ్‌లో జాతీయస్థాయిలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. దీనికి ఒక కారణం ఉంది. నా పదహారేళ్ల వయసులో రొమ్ము భాగంలో ఒక కణితి ఏర్పడింది. వైద్యులు దాన్ని శస్త్రచికిత్స ద్వారా తీసేశారు. అది నా జీవితంలోనే అత్యంత సంక్లిష్టమైన దశ. ఆ దశను విజయవంతంగా అధిగమించాలని నాకు నేనే వాగ్దానం చేసుకున్నాను. ఎంతో ప్రయత్నించి దాన్నుంచి బయటపడ్డాను. ఆ సమయంలోనే నాకు రొమ్ము క్యాన్సర్ బాధితుల గురించి, వారి సమస్యల గురించి తెలిసింది. నిజానికి.. ముందుగా గుర్తిస్తే ఈ సమస్యను అధిగమించవచ్చు. అందుకే.. రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు, తొలి దశల్లోనే దాన్ని గుర్తించేలా అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాను. 'ఓపల్ ఫర్ హర్' ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపాలన్నదే నా లక్ష్యం. నా జీవితం థాయ్‌లాండ్‌లో ఎంతోమందికి స్ఫూర్తి కలిగించింది. క్యాన్సర్ రోగులు కొంతమంది ధైర్యంగా క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధిస్తే, కొంతమంది దురదృష్టవశాత్తు ఈ పోరాటంలో ఓడిపోయారు.

### తెలంగాణా ఆతిథ్యం అపూర్వం..

ప్రపంచ సుందరి పోటీలకు ఇక్కడి ప్రభుత్వ సహకారం, మద్దతు, తెలంగాణ ఆతిథ్యం అపూర్వం. నిన్న విమానాశ్రయంలో దిగగానే.. ఎంతోమంది వచ్చి నన్ను ఆహ్వానించడం, మద్దతు పలకడం.. చాలా సంతోషంగా అనిపించింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకోవడానికి నేను చాలా ఆసక్తిగా ఉన్నాను. నేను ఆభరణాలకు పెద్ద అభిమానిని. అందునా ముత్యాలంటే చాలా ఇష్టం. అందుకే.. హైదరాబాద్ ముత్యాలను కొనాలనుకుంటున్నాను. ఒకవేళ నేను మిస్‌వరల్డ్ టైటిల్ గెలిస్తే.. మా దేశం ఆ కిరీటాన్ని అందుకోవడం ఇదే తొలిసారి అవుతుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.